



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 38 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 31 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ
- నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు.
- జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే


6



## చమురు కొనుగోళ్లకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాం

- రష్యన్ కంపెనీలపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత్ వ్యాఖ్య
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్ ఇంకా చర్చలు జరుపుతోంది
- తక్కువ ధరకు చమురుకొనే బదులు ఇదే రేట్లకు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయగల అవకాశాలను పరిశీలిస్తోన్న భారత్

# తుపాను నష్టం.. రూ.5,265 కోట్లు



- సమిష్టి కృషి, టెక్నాలజీ సాయంతో తుపాను నష్టం తగ్గించాం
- ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే అంశంలో ప్రభుత్వం అనుసరించిన విధానం ఒక మాన్యువల్
- క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పర్యటించారు
- గ్రామస్థాయి సిబ్బంది నుంచి ప్రధాన కార్యదర్శి వరకు నిరంతరంగా పని చేశారు
- తుఫాన్ ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

మొంథా తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, సీసీ కెమెరాల లాంటి సాంకేతికత వినియోగించి ఈ ప్రాథమిక నష్ట అంచనాలను రూపొందించామని వెల్లడించారు. మొంథా తుపాను ప్రభావంతో కలిగిన నష్టాన్ని కూడా టెక్నాలజీ సాయంతోనే తగ్గించినట్టు సీఎం స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఎం.. రాష్ట్రంపై తుపాను ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణ అంశాలపై విలేఖరులకు వివరించారు. వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన రంగంలో రూ.39 కోట్లు, సెరీకల్చర్ రూ.65 కోట్లు, ఆక్వా రంగంలో రూ.1,270 కోట్లు, ఆర్ అండ్ బీకి రూ.2,079 కోట్లు, మున్సిపల్ శాఖలో రూ.109 కోట్లు, జలవనరుల విభాగంలో రూ.207 కోట్లు, పంచాయితీరాజ్ రూ.8 కోట్లు, విద్యుత్ శాఖ రూ.16 కోట్లు పశుసంవర్ధక శాఖలో రూ.71 లక్షలు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని వివరించారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారు చేసి కేంద్రానికి పంపిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ.. "సాంకేతిక పరిజ్ఞానంతో తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. అత్యంత ఖచ్చితత్వంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు - మిగతా2లో

## ధైర్యశాలి ప్రధాని అంటే మా నాన్నమ్మే



**యుద్ధం ఆపానన్న ట్రంప్‌తో మోదీ వాదనలో గెలవలేరు**

- నిజంగానే మోదీకి అంతటి ధైర్యం ఉంటే బిహార్ ఎన్నికల ర్యాలీల్లో యుద్ధం ఆపింది ట్రంప్ కానేకాదు అని మోదీ కరాఖండీగా ప్రకటించాలి
- అంత ధైర్యం మోదీకి లేదు
- రాహుల్ గాంధీ వ్యాఖ్య

6లో

# నష్టపోయిన రైతులకు పవన్ కల్యాణ్ భరోసా

- మోకాలి లోతు బురదలో దిగి... నేలకొరిగిన పంటను పరిశీలించి..
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- నేలకొరిగిన పంట పొలాల పరిశీలన... తుపాను ప్రభావంపై ఆరా
- మానవతా దృక్పథంతో తుపాను నష్టం అంచనాలు రూపొందించాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచన



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తుపాను కారణంగా జరిగిన పంట నష్టాన్ని పంట పొలాల మధ్యకు వెళ్లి పరిశీలించారు. అరటి రైతుల ఆవేదన విన్నారు. మీ కష్టంలో మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సాగిన తీరిది. ఉదయం 11 గంటల ప్రాంతంలో అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ నేరుగా కోడూరు మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో నేలకొరిగిన వరి చేల వద్దకు వెళ్లారు. రైతులతో కలసి బురద చేలోకి దిగి పడిపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొట్ట దశలో ఉన్న వరి కంకులను పరిశీలించారు. అన్ని విధాలా ఆదుకుంటామంటూ కూటమి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన కోట రమేష్ అనే రైతుకు - మిగతా2లో

# కూటమి సర్కార్ రైతుల నడ్డి విరిచింది



- "మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది
- ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లం
- గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయంతో గట్టిగా పనిచేసేది
- ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేది
- 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండేది
- ఇ-క్రాప్ నీరుగార్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే పరిస్థితి లేదు
- ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇచ్చే పరిస్థితి లేదు. ఇవన్నీ మానవ తప్పిదాలు
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మొంథా తుపాను నేపథ్యంలో పార్టీ నేతలతో వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంపై పార్టీ నేతలతో చర్చించారు. "పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు తుపాను దెబ్బపడింది. దీనివల్ల దిగుబడులు బాగా దెబ్బతింటాయి. నేలకొరిగిన - మిగతా2లో



## సామ్రాట్ 'బిగ్ మ్యాన్' అవుతారు

- ఎన్నికల్లో సామ్రాట్‌కు ఓటు వేసి గెలిపించాలి
- రానున్న రోజుల్లో ఆయన్ను ప్రధాని మోదీ "బిగ్ మ్యాన్, వెరీ బిగ్ మ్యాన్" చేస్తారు
- కేంద్ర మంత్రి అమిత్ షా

6లో

# ఆర్జేడీ-కాంగ్రెస్ @ 5-కే సర్కార్



- "ఆర్జేడీ-కాంగ్రెస్ పాలనను ఐదు పదాల్లో చెప్పొచ్చు
- కట్టా (నాటు తుపాకీ), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం),కరప్షన్ (అవినీతి)
- ఆయుధం ఉన్నచోట క్రూరత్వం ఉంటుంది. ఆటవిక రాజ్యం వస్తుంది
- ఆర్జేడీ అధికారంలో ఉన్న సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారు
- ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఛత్ పూజను కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు అవమానించాయి

6లో

# నష్టపోయిన రైతులకు పవన్ కళ్యాణ్ భరోసా





-మొదటిపేజీ తరువాయి

చెందిన అయిదు ఎకరాల వరి పంట పూర్తిగా నేలకొరిగింది. పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా ఆ రైతు తనకు వచ్చిన కష్టాన్ని ఆయనకు వివరించారు. ఇప్పుడిప్పుడే వరి పొట్ట పాలు పోసుకుంటున్న దశలో తుపాను రావడం వల్ల పంట పూర్తిగా నాశనం అయిందని, ఎందుకూ పనికి రాకుండా పోయిందని పవన్ కళ్యాణ్ ఎదుట వాపోయారు. మరో రెండు వారాలు ఆగితే పంట కోత దశకు వచ్చేదని తెలిపారు. వెంకటేశ్వరరావు, గోవాడ నాగేశ్వరరావు అనే రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. నీటిలో తడిసిన ధాన్యపు గింజలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కు త్వరితగతిన పంట నష్టం నివేదికలు ఇవ్వాలని సూచించారు. నష్టపోయిన వారిలో కౌలు రైతులు కూడా ఉన్నారని, వారిని ఆదుకోవాలని పలువురు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. తుపాను కారణంగా నష్టపోయిన కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అవనిగడ్డ మండల పరిధిలోని రామచంద్రపురం సమీపంలో తుపాను ధాటికి దెబ్బతిన్న అరటి తోటను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. విష్ణుమూర్తి అనే రైతుకు చెందిన అరటి తోట మొంథా తుపాను సమయంలో వీచిన పెనుగాలులకు పూర్తిగా నేల మట్టం అయినట్లు తెలుసుకున్నారు. సుమారు 1400 అరటి గెలలు పనికిరాకుండా పోయాయని రైతు.. పవన్ కళ్యాణ్ కు వివరించారు. ఉద్యాన శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసే సమయంలో రైతులకి మేలు చేసేలా ఆలోచన చేయాలని సూచించారు. దెబ్బ తిన్న అరట తోటలో ఎంత మేర పనికొస్తుంది? తిరిగి తోట బతుకుతుందా లేదా? మొత్తం తీసి తిరిగి పంట వేసుకోవడానికి ఎంత ఖర్చు అవుతుంది? అనే వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలని తెలిపారు. పంట నష్టంపై గణన చేపట్టే సమయంలో వ్యవసాయ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, రైతుల పక్షాన నివేదికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. జరిగిన నష్టానికి పక్కాగా అంచనా వేసి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌలు రైతులకు కూడా న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కోడూరు, అవనిగడ్డ మండలాల్లో సముద్రపు పోటుకు తీర ప్రాంత గ్రామాల్లో పంట నష్టం వాటిల్లుతోన్న విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి స్థానిక శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ తీసుకువచ్చారు. సముద్రం కరకట్టపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన అవుట్ ఫాల్ స్లూయిజ్ లు దెబ్బతినడం కారణంగా పోటు సమయంలో సముద్రపు నీరు పంట పొలాల్లోకి చొచ్చుకు వస్తోందని తెలిపారు. నూతన స్లూయిజ్ ల నిర్మాణం చేపడితే 5 వేల ఎకరాల్లో పంటలను కాపాడవచ్చని చెప్పారు. ఈ సమస్యపై సమగ్ర నివేదిక రూపొందించి సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తానని, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ తన పర్యటన ఆద్యంతం ప్రజలతో మమేకమయ్యారు. రైతుల పరామర్శ అనంతరం తిరుగు ప్రయాణంలో కోడూరు, అవనిగడ్డ మధ్య విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, మాచవరం తదితర గ్రామాల్లో రోడ్లపై బారులు తీరిన ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో తుపాను ప్రభావం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు, పవన్ కళ్యాణ్ తో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. పులిగడ్డ సమీపంలో రోడ్ సైడ్ కూరగాయలు, కొబ్బరి బొండాలు విక్రయించే వ్యాపారులను పవన్ కళ్యాణ్ పలకరించారు. అక్కడ ఉన్న ప్రజలను కలుసుకున్నారు. తుపాను ప్రభావం వల్ల ఎమైనా నష్టం వాటిల్లిందా అన్న విషయంపై ఆరా తీశారు. కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. గొర్రె నాగసూరి అనే మహిళ ఇల్లు కావాలని పవన్ కళ్యాణ్ గారిని కోరారు. పెద్ది వెంకటేశ్వరరావు అనే వృద్ధుడికి చెందిన దెబ్బతిన్న ఇంటిని పరిశీలించి, ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బొర్రా రాము అనే ఆటో డ్రైవర్ ను పలకరించి జీవనోపాధి ఎలా సాగుతుంది అని అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నం పోర్టుకు అనుసంధానంగా జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే లో భూములు కోల్పోతామన్న భయంతో పలువురు రైతులు పవన్ కళ్యాణ్ కు తమ సమస్యను విన్నవించుకున్నారు. గతంలో 65వ నంబర్ జాతీయ రహదారి నిర్మాణంలోనూ భూములు కోల్పోయామని, ఇప్పుడు మరోసారి విలువైన భూములు కోల్పోతామన్న భయం పట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని విస్తరించకుండా, నేరుగా పోర్టు రోడ్డుకి కలిపేలా సమాంతరంగా మరో రహదారిని నిర్మించాలన్న తమ సూచనను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి సమస్యలు వింటూ, ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సూచనలు చేస్తూ పవన్ కళ్యాణ్ ముందుకు సాగారు.

# బౌద్ధుల 140ఏళ్ల కల నెరవేరేనా? ఈ హామీతో 'మహాగర్‌బంధన్'కు లాభమా?

బిహార్ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి ప్రజలపై వరాల జల్లు కురిపించింది. నిరుద్యోగం, ఉపాధి, అభివృద్ధితో పాటు మైనారిటీ మతాలకు చెందిన హక్కుల పరిరక్షిస్తామని హామీ ఇచ్చింది. ముఖ్యంగా 140 ఏళ్ల నాటి బౌద్ధుల డిమాండ్?ను సైతం నెరవేరుస్తామని తెలిపింది. ఇంతకీ ఆ పురాతన డిమాండ్? ఏంటి? ఇన్నేళ్లుగా ఎందుకు కొనసాగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**260 రోజులుగా దీక్షలు**

బిహార్ గయా జిల్లాలోని బోధ్?గయ బౌద్ధులకు పవిత్ర ప్రదేశం. ఇక్కడ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన మహాబోధి ఆలయం ఉంది. అయితే, ఈ ఆలయ సంరక్షణ మాత్రం బుద్ధులకు లేదు. ఈ కమిటీలో బౌద్ధులతో పాటు హిందువులకు స్థానం కల్పించారు. దీంతో ఆలయ నిర్వహణ పూర్తిగా తమకు అప్పగించాలని ఎన్నో ఏళ్లుగా బౌద్ధ మతస్థులు డిమాండ్ చేస్తున్నారు. నిర్వహణ కమిటీలో నుంచి హిందూ సభ్యులను తొలగించాలని కోరుతున్నారు. ఇందుకోసం 2025 ఫిబ్రవరి నుంచి బోధ్?గయలో నిరవధిక దీక్ష సైతం చేపట్టారు. దాదాపు 260 రోజులుగా సాగుతున్న ఈ దీక్ష ఆల్ ఇండియా బుద్ధిస్ట్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరుగుతుంది. బోధ్‌గయ టెంపుల్ మేనేజ్‌మెంట్ కమిటీ యాక్ట్ 1949ను రద్దు చేయాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

టెంపుల్ మేనేజ్‌మెంట్ కమిటీ యాక్ట్? 1949 ప్రకారం కమిటీలో మొత్తం 9 మంది ఉంటారు. ఛైర్మన్?తో పాటు మరో ఎనిమిది మంది ఉండగా, అందులో హిందూ మతానికి చెందిన నలుగురిని ఈ కమిటీలోకి తీసుకోవచ్చు. దీనినే బౌద్ధ మతస్థులు వ్యతిరేకిస్తున్నారు. వీరితో పాటు జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీ సభ్యులను ప్రభుత్వమే నామినేట్ చేసే అధికారం ఉంది. హోం శాఖ నోటిఫికేషన్ ద్వారా వీరిని నియమిస్తారు. సెక్షన్ 3 ప్రకారం ఆలయ పరిసరాలు, ఆస్తులను పరిరక్షిస్తుంది. ఎనిమిది మంది సభ్యుల్లో నలుగురు బుద్ధులు కాగా, మరో నలుగురు హిందూ మతానికి చెందిన వారు ఉంటారు. నలుగురు బౌద్ధ సభ్యుల్లో మహంత్?తో పాటు ప్రధాన పూజారి



ఉంటారు.

**కొవ్వొత్తుల ర్యాలీ, 2లక్షల పోస్ట్‌కార్డులు**

ప్రభుత్వానికి ఎన్నో సార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఆల్ ఇండియా బుద్ధిస్ట్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి అకాశ్ లామా అంటున్నారు. తాము నిరసనలు చేపట్టిన తర్వాత ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్?ను సైతం కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఆయన తమ డిమాండ్?కు సానుకూలంగా స్పందించారని, నెరవేరుస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఈ డిమాండ్?ను నెరవేర్చాలని ఎన్నో ఏళ్లుగా పోరుడుతున్నామని మాజీ కార్యదర్శి బాంటే ప్రగ్యాశీల్ అన్నారు. దిల్లీ సహా అనేక రాష్ట్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీ సహా వివిధ రూపాల్లో నిరసనలు చేశామని గుర్తుచేశారు. 2లక్షల పోస్ట్?కార్డులను రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రికి పంపించామని తెలిపారు. చివరకు తమ డిమాండ్‌ను మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టోలో పెట్టిందని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ బౌద్ధ పరిరక్షకుడు కాదని సన్యాసులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ భౌద్ధమతంపై ప్రేమ ఉంటే 1949 నాటి చట్టాన్ని ఇప్పటికే రద్దు చేసి ఉండేవారని అంటున్నారు.

"మా డిమాండ్‌ను నెరవేరుస్తామని మహాగఠ్‌బంధన్ చేసిన ప్రకటన ఎంత మేరకు లాభం చేకూరుస్తుందో అంచనా వేసేందుకు మేము రాజకీయ విశ్లేషకులం కాదు. కానీ మహాగఠ్?బంధన్? కచ్చితంగా రాజ్యాంగాన్ని కాపాడుతుందనే నమ్మకం ఉంది. మా బోధ్?గయ సమస్యను ఇన్ని రోజులు విస్మరించారు. ఆర్టికల్? 13 ప్రకారం 1949 నాటి చట్టాన్ని రద్దు చేయాలి. ఒక వేళ మహాగఠ్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మా డిమాండ్‌ను తీరుస్తారు."

**బాంటే నాగదమ్మ, బౌద్ధ సన్యాసి**

చట్టాన్ని రద్దు చేసిన ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుంది. మహాగఠ్‌బంధన్ మా డిమాండ్?ను నెరవేరుస్తామని ఇప్పటికే మేనిఫెస్టోలో ప్రకటించింది. భౌద్ధాన్ని నమ్ముకున్న ప్రజలందరూ మహాగఠ్?బంధన్?కు మద్దతు ఇస్తారు. మేము ప్రజలను కలిసి మహాగఠ్?బంధన్?కు ఓటు వేయాలని కోరుతాం."

ుప్రజ్ఞానంద్, బౌద్ధ సన్యాసి

వాస్తవానికి బోధ్?గయ ఆలయ నిర్వహణను బౌద్ధ సన్యాసులకు అప్పగించాలనే డిమాండ్?ను ఈనాటిది కాదు. మొదటగా 1890లో శ్రీలంక నుంచి వచ్చిన అనగరిక ధర్మపాల అనే సన్యాసి ఈ ప్రతిపాదన చేశారు. ఆ తర్వాత 1922లో మహాత్మా గాంధీ బోధ్?గయకు వచ్చిన సమయంలో కూడా డిమాండ్ చేశారు. ఆయన సైతం బౌద్ధుల పవిత్ర క్షేత్రం నిర్వహణ వారికే దక్కాలని చెప్పారు. కానీ 1949లో చేసిన చట్టంలో పాత పద్ధతినే కొనసాగించారు. అప్పటి నుంచి బౌద్ధ మతస్థుల వ్యతిరేకిస్తూనే ఉన్నారు. 1990లో ఈ నిరసనలు తీవ్రతరం కాగా, 1995లో కార్యదర్శికి బౌద్ధులను నామినేట్ చేయడంతో సమస్య సద్దుమణిగింది. తాజాగా మహాగఠ్?బంధన్? మళ్లీ హామీ ఇవ్వడం తిరిగి తెరపైకి వచ్చింది. మరి మహాగఠ్?బంధన్? వారి డిమాండ్?ను నెరవేరుస్తామని హామీ ఇవ్వడం ఏ మేరకు లాభం చేకూరుస్తుందో తెలియాలంటే నవంబర్? 14 వరకు ఆగాల్సిందే.

# తుపాను నష్టం.. రూ.5,265 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

హెచ్చరికలను చేరవేయగలిగాం. టెక్నాలజీ సాయంతో తుఫాన్ ప్రభావం వల్ల కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించకలిగాం. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేశాయి. మొదటి రోజునే పరిస్థితులను చాలా వరకూ చక్కదిద్దాం. ఎప్పటికప్పుడు తుఫాన్ ప్రభావంపై సమీక్షలు నిర్వహించాం. అంతర్వేదికి సమీపంలో తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. శాటిలైట్ ఇమేజ్ ల ఆధారంగా తుఫాన్ పరిస్థితిని అంచనా వేశాం. సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలతో ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన నష్టాన్ని బాగా తగ్గించాం. వర్షాలు, గాలుల తీవ్రతను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి చర్యలు తీసుకున్నాం. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంది. తుఫాను ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాల్లో టెక్నాలజీ ద్వారా నష్టాలను తగ్గించాం. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎక్కడెక్కడ ప్రవాహాలు పెద్ద ఎత్తున వస్తాయనేది అంచనా వేసి ముందస్తుగా హెచ్చరికలు ఇచ్చాం." అని ముఖ్యమంత్రి అన్నారు. "మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకూ, లైన్ డిపార్టుమెంట్ల నుంచి గ్రామ వార్డు సచివాలయం వరకూ ఉద్యోగులు, సిబ్బంది తుపాను నష్టాల తీవ్రతను తగ్గించటంలో కృషి చేశారు. ఆర్టీజీఎస్ నుంచి మంత్రులు లోకేష్, అనితలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయికి ఆదేశాలు జారీ చేశారు. అంతా కలిసి సమష్టిగా పని చేయబట్టే ఇది సాధ్యమైంది. వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా.. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. రియల్ టైమ్ లోనే డేటా లేక్ ద్వారా సమాచారం విశ్లేషించి త్వరగా నిర్ణయాలు తీసుకోగలిగాం. టెక్నాలజీ వినియోగించి పంట నష్టాలు, ముంపు ప్రాంతాలు తదితర అంశాలను కూడా గుర్తించాం. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ మనుషులు.. ఫేక్ పోస్టులు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టు ఉంది. తుపాను కారణంగా నెల్లూరు నుంచి విశాఖ వరకూ భారీ వర్షాలు కురిసినా రాయలసీమలో కొన్ని చోట్ల వర్షాలు పడలేదు. వర్షాభావంతో కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 37 కరవు మండలాలుగా ప్రకటిస్తున్నాం. ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కునేందుకు మొంథా తుపాను అనుభవాన్ని ఓ మాన్యువల్ గా రూపొందిస్తాం. టెక్నాలజీ వినియోగం ప్రజా ప్రయోజనాల కోసమే" అని ముఖ్యమంత్రి అన్నారు.

## కూటమి సర్కార్ రైతుల నడ్డి విరిచింది

-మొదటిపేజీ తరువాయి

పంట తిరిగి నిలబడ్డం కష్టమయ్యే పరిస్థితి. దాదాపు 25 జిల్లాల్లో ప్రభావం చూపింది. ఉన్న సమాచారం ప్రకారం 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం దాటిల్లింది. 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయి. పార్టీ పరంగా రైతులకు తోడుగా నిలబడాలి" అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. "మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయంతో గట్టిగా పనిచేసేది. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేది. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండేది. 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ఇవాళ ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది. మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు మనం అండగా ఉండాలి. ..ఈ 16 నెలల్లో అల్పపీడనలు, వాయుగుండాలు, తుపాన్లు కారణంగా 16 వచ్చాయి. ఎంతమందికి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందింది, నష్టపోయిన రైతులను ఎంతమందిని ఆదుకున్నారు చూస్తే.. గుండుసున్నాయే కనిపిస్తుంది. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇ-క్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తామ న్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతుకూ మంచి చేయలేదు. తర్వాత హెక్టారుకు రూ.50వేలు ఇస్తామన్నారు. అదికూడా ఇచ్చిన పాపాన పోలేదు. ..ఇ-క్రాప్ నీరుగార్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే పరిస్థితి లేదు. ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇచ్చే పరిస్థితి లేదు. ఇవన్నీ మానవ తప్పిదాలు. మన హయాంలో మనమే ప్రభుత్వం తరపున ప్రీమియం కట్టి 54.55 లక్షల మంది రైతులకు రూ.7800 కోట్లు ఇన్సూరెన్స్ ఇప్పించగలిగాం. కాని ఇవాళ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ ప్రభుత్వం రైతుల నడ్డి విరిచింది" అంటూ వైఎస్ జగన్ మండిపడ్డారు.

## అనంత వైసీపీలో షాక్

అనంతపురం

విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా అభివృద్ధికి అడ్డుపడుతున్నారనే ఆరోపణలపై కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్ కుమార్‌ను ప్రభుత్వం పదవి నుంచి తొలగించింది. ఆరోపణలపై నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటంతోనే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీలోని పలువురు నేతలు, ఇతర పార్టీల్లోకి వలస వెళ్లారు. ముఖ్య నేతలు మొదలుకుని.. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా కూటమి పార్టీల్లో చేరిన పరిస్థితి. ఇక కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గురించి చెప్పాల్సిన పని లేదు. దీంతో చాలా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ అధికారం కోల్పోయింది. తాజాగా అనంతపురం జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్ కుమార్‌ను.. ప్రభుత్వం ఛైర్మన్ పదవి నుంచి తప్పించింది. మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న రాజ్ కుమార్.. 15 నెలలుగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సెప్టెంబర్ 22న షోకాజ్ నోటీసులు ఇచ్చింది.అయితే ప్రభుత్వం నుంచి షోకాజ్ నోటీసులు అందుకున్న మున్సిపల్ ఛైర్మన్ రాజ్ కుమార్.. నోటీసులపై వివరణ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకపోవడంతో కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధులకు విరుద్ధంగా వ్యవహరించడంతో పాటుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదనే కారణాలతో పదవి నుంచి తొలగిస్తూ ఏపీ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు 2024 నవంబర్ నెల నుంచి 2025 ఏప్రిల్ నెల వరకూ.. రెండు నెలల వ్యవధిలో నిర్వహించాల్సిన కౌన్సిల్ మీటింగులను రాజ్ కుమార్ నిర్వహించలేదని జీవోలో పేర్కొంది.మరోవైపు తలారి రాజ్ కుమార్.. పండ్లు విక్రయించే వ్యాపారి. మున్సిపల్ ఛైర్మన్ కాకముందు తోపుడు బండిపై పండ్లు విక్రయించేవారు. ఇంటర్ వరకూ చదువుకున్నారు. తలారి రాజ్ కుమార్‌కు భార్య విజయలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ




మొంథా తుఫాను ప్రాంతాలను

## కలెక్టర్ కీర్తి చేకూరి పరిశీలన



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలైన రాజమహేంద్రవరం రూరల్ రాజవోలు, కడియం మండలం ఆవ ప్రాంతాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి రైతులతో మాట్లాడం జరిగింది. మొంథా తుఫాను కారణంగా మునిగిన వరి పొలాలు, ఒరిగిన పంటలను పరిశీలించిన కలెక్టర్ రైతులను ఆదరిస్తూ, ప్రభుత్వ యంత్రాంగం వారి పక్కనే ఉందని హామీ ఇచ్చారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పంట నష్టాలను పూర్తి స్థాయిలో అంచనా వేయడానికి వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహిస్తు న్నారని తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టపరిహారం కోసం సరైన నివేదిక ప్రభుత్వానికి పంపబడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణులు పంట మునిగిన లేదా ఒరిగిన సందర్భాల్లో రైతులు అనుసరించ వలసిన సస్య రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల పునరుద్ధరణకు అవసరమైన మార్గదర్శకాలు కూడా అందజేశారు. సందర్శనలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, తహసిల్దార్లు శ్రీనివాస్, సునీల్ కుమార్, ఇతర వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో 79 మంది టిడ్కో లబ్ధిదారులను

## తొలగించడం దారుణం..

టిడ్కో అవతవకలపై విచారణకు ఆదేశించా..
తొలగించిన లబ్ధిదారులకు న్యాయం చేస్తా...
ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు...



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పారదర్శకంగా 1634 మంది లబ్ధిదారులు ఎంపిక చేస్తే అర్హులైన 79 మందిని వైసిపి ప్రభుత్వం తొలగించిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆగ్రహ వ్యక్తం చేశారు. 30 మంది టిడ్కో లబ్ధిదారులకు వారి కట్టిన లక్ష రూపాయలు చెక్కులను తిరిగి ఇచ్చే కార్యక్రమంలో గత ప్రభుత్వ అక్రమాలను ఆయన ప్రస్తావించారు. తొలగించిన 79 మంది అర్హతను మరోసారి పరిశీలించమన్నానని, వైసీపీ ఇచ్చిన 79 మంది లబ్ధి దారుల అర్హత నిర్ణయించమన్నానని ఎమ్మెల్యే అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించిన వారికి అవకాశం వస్తే ముందు వాళ్లకే ఇళ్ళను ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 30 మంది లబ్ధిదారులకు కమిషనర్ చాంబర్లో చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన

## ఎంపీ హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే బుచ్చిబాబు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తుఫాన్ ప్రభావిత కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిత్యవసర సరుకులు ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలంలో బాధితులకు అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పంపిణీ చేసారు. తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు మత్స్యకారులకు 50 కేజీల చొప్పున, కేజీ ఉల్లిపాయలు, లీటర్ నూనె, కేజీ పప్పు, కేజీ బంగాళదుంపలు, కేజీ చక్కెర ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## నవంబర్ 1న వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా

యువత వినియోగించుకోండి : కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "వికాస" ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటలకు రాజమహేంద్రవరం కలెక్టరేట్ పరిసరాల్లోని "వికాస కార్యాలయం" (బొమ్మూరు హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా)లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా,బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అర్హులైన అభ్యర్థులుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.10,000/- నుండి రూ.25,000/- వరకు వేతనం, అదనంగా ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సదుపాయాలు ఆయా సంస్థల ప్రకారం అందజేయబడతాయి. ఆసక్తిగల అభ్యర్థులు తమ అసలు సర్టిఫికెట్లతో పాటు జెరాక్స్ కాపీలు తీసుకొని తప్పనిసరిగా హాజరు కావాలనీ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే.లచ్చారావు కోరారు. మరిన్ని వివరాల కోసం : 7660823903 లేదా వెబ్‌సైట్ : www.vikasajobs.com ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ తెలియచేసారు.

పోలీసులంటే సమాజానికి

# భయం కాదు, ధైర్యం రావాలి

**పోలీసును క్షేత్రస్థాయిలో పబ్లిక్ కి దగ్గర చేయాలని సంకల్పం - విద్యార్థి దశ నుండే పోలీసు విధి నిర్వహణ పట్ల అవగాహన**
**ఆయుధాలు, జాగిలాల పనితీరును వివరించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా - ఆశ్చర్యచకితులైన విద్యార్థులు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగిస్తున్న డ్రోన్ పరికరాల ద్వారా నిఘా ఏర్పాటు విషయంలో పురోగతిని సాధిస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆర్మ్ డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయం ప్రాంగణం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ముఖ్య అతిథిగా హాజరై ఓపెన్ హౌస్ ను ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ అంటే ఇప్పటివరకు ప్రజల్లో ఒక రకమైన భయం ఉందని, విద్యార్థిని, విద్యార్థులను ఆహ్వానించి, పోలీసును క్షేత్రస్థాయిలో పబ్లిక్ కి దగ్గర చేయాలని సంకల్పంతో విద్యార్థి దశ నుండే పోలీసు విధి నిర్వహణ పట్ల అవగాహనను కల్పిస్తున్నామని, పోలీసు విధి నిర్వహణలో ప్రజలకు చేరువయ్యే లాగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎవరైనా వేరే గ్రామాలకు తాళాలు వేసి బయటికి వెళ్లిన సమయాలలో ఎల్ హెచ్ ఎం ఎస్ రక్షణ వ్యవస్థ ద్వారా వారికి, వారి ఇంటికి రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని అరికట్టేందుకు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని, అయినప్పటికీ ఒక వ్యక్తి మద్యం సేవించి మోటార్ సైకిల్ నడపడం వలన ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం ఈ మధ్య కాలంలోనే జరిగిన బాధాకరమైన సంఘటన అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హెల్మెట్ వాడకంపై విద్యార్థిని,విద్యార్థులు అవగాహన కల్పించుకొని, మీ కుటుంబ పెద్దలు హెల్మెట్ వాడే లాగా వారిని ప్రోత్సహించాలని విద్యార్థిని,విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కూడా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ, మనమే కాకుండా మన చుట్టుపక్కల వారికి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సుఖ ప్రయాణానికి ట్రాఫిక్ రూల్స్ ను తప్పక పాటించాలని విద్యార్థులకు వివరించారు. ఆధునిక పరికరాలపై అవగాహన పోలీసు శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ ఆయుధాలు (ఎస్ఎల్ఆర్,ఎకె-47, ఎమ్.పి5కె, టియర్ గ్యాస్ గన్), బి.పి జాకెట్ ల పనితీరును ఆర్మ్ రిజర్వ్ విధులను ఎస్పీ రాహుల్ మీనా విద్యార్థులకు వివరించారు. సాంకేతికత ప్రదర్శన క్లూస్ టీం, కమ్యూనికేషన్ వ్యవస్థ (వివిహెచ్ఎఫ్ సెట్), బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ పరికరాలు, డ్రోన్, డాగ్ స్క్వాడ్ వంటి కీలక విభాగాల సాంకేతికతను వివరంగా చూపించారు. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు డాగ్ స్క్వాడ్ యొక్క క్రమశిక్షణ, నేరస్థులను/ఎక్స్ప్లోజివ్ మెటీరియల్ను గుర్తించే విధానాన్ని హార్డిల్స్ జంప్ విన్యాసాలతో సహా డెమో చేసి చూపడం విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది.

**సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తలు**

అపరిచితులు పంపే లింకులను, మెసేజ్లను నమ్మవద్దని, ఉద్యోగాలు/ఎక్కువ డబ్బు ఆశ చూపించే మోసాల పట్ల అతి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930కు కాల్ చేయాలని, ఈ జాగ్రత్తలను తమ చుట్టుపక్కల వారికి, కుటుంబ సభ్యులకు వివరించాలని కోరారు. జిల్లా శక్తి టీం సభ్యులు విద్యార్థుల యొక్క రక్షణ కొరకు విద్యాసంస్థల వద్ద, బహిరంగ ప్రదేశాలలో గస్తీ తిరుగుతూ ఆకతాయిల వేధింపులకు గురి కాకుండా, బాలికలకు రక్షణ కల్పిస్తున్నారని, ఆపద సమయంలో ఉన్నవారు డయల్ 112 కి సమాచారం అందిస్తే పది నిమిషాల వ్యవధిలో పోలీసు వారి సహకారం అందిస్తారని జిల్లా ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఏవిఆర్‌పిబి ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, అమలాపురం డిఎస్పి టిఎస్ఆర్‌కె ప్రసాద్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ పుల్లారావు, డిసిఆర్‌బి సీఐ మురళి కృష్ణ, ఏఆర్ఆర్ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు, ఆర్ఎస్ఐ దిలీప్ పాటు వివిధ విద్యా సంస్థలు విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పంపాలోకి కొనసాగుతున్న వరదనీటి ఉధృతి

102 అడుగులకు చేరువలో నీటి మట్టం- ప్రమాదకర పరిస్థితిలో పంపా బ్యారేజ్
జల దిగ్బంధంలో అన్నవరం బైపాస్ రోడ్డు - తెగిన పోలవరం కాలువ మరమ్మత్తుల గట్టు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పంపారిజర్వాయర్లోకి ఎగువ ప్రాంతాల నుండి భారీగా వరదనీరు చేరుకోడం గురువారం నాటికి కూడా యధావిధిగా కొనసాగుతోంది. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల ఎగువ ప్రాంతం నుండి వర్షం నీరు పంపాలోకి వస్తుండటంతో పంపాలో నీటి నిల్వ సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరుకుంది. మండలంలోని ఎస్.జగ్గంపేట బొర్రా పెదబాపన్నదొర చెరువు అదనపు నీరు కూడా నేరుగా పంపాలోకి వచ్చే చేరుతోంది. పంపా ప్రాజెక్ట్ ఎగువన ఉన్న పోలవరం కాలువకు అభివృద్ధి పనుల్లో భాగంగా వేసిన గట్టు తెగిపోవడంతో ఈ నీరు కూడా పంపాలోకే భారీగా చేరుతోంది. ఫలితంగా పంపా రిజర్వాయర్ నీటి సామర్థ్యం103 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 102 అడుగులకు చేరువలో ఉంది. పంపాలోకి వచ్చే వరద నీటి స్థాయి ఉధృతంగా ఉండటం వలన ఇరిగేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్తగా రెండవ నెంబరు వరద గేటు ద్వారా అదనపు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్లోకి చేరే నీరు 1800 క్యూసెక్కులు కాగా వరద గేటు ద్వారా బయటకు వెళ్ళే నీరు కూడా 1800 క్యూసెక్కులుగానే ఉంది. ఎంత మొత్తంలో నీరు వస్తోందో అంతే మొత్తంలో యధాతధంగా బయటకు పోతున్నాయి. తుఫాను నీరు పంపాలోకి ఇంకా అధికంగా వస్తే గనుక మరిన్ని వరద గేట్ల ద్వారా అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అయితే వరద నీరు సముద్రంలోకి వెళ్ళే క్రమంలో తొండంగి మండలం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారికి ముప్పుపొంచి ఉండటం వలన ప్రజలను అధికార్లు అప్రమత్తం చేశారు. అవసరమైన అత్యవసర ఏర్పాట్లకు జెసిబిలు, ట్రాక్టర్లు సిద్ధం చేసారు. పంపాలోకి నీటి ప్రవాహం కొనసాగుతూ ఉండడంతో పంపా బ్యారేజీలో ఒక గేటును ఇరిగేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన రెండు అడుగుల పైకి లేపి దిగువకు వరద నీటిని విడచి పెట్టారు. దీంతో జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు క్రింద నుండి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పంపా వంతెన కూలిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ముప్పు వాటిల్లితే మొదట మునిగేది సమీపంలోని కొత్తపేట వీధి ప్రాంతం. అందువల్ల ఆప్రాంత వాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మంటున్నారు. గేట్లు మొరాయిస్తే గనుక పంపా బ్యారేజ్ వరద ఉధృతికి కొట్టుకుపోయే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులే అంటున్నారు.

**దిగువకు వెళ్ళే దారికి అడ్డంగా లేఔట్...**

బైపాస్ రోడ్డులో సత్యదేవుని నూతన నమూనా ఆలయం ఉంది. పంపా వరద కాలువ నుండి వచ్చే నీరు ఆ ప్రాంతంలో కల్వర్టు నుండి దిగువకు వెళ్తుంది. అయితే దిగువన ఉన్న స్థలం యజమాని లే ఔట్ కోసం మట్టితో కప్పేయడంతో వరద నీరు బైపాస్ రోడ్డులోని సత్యదేవుని నూతన నమూనా ఆలయం చుట్టూ చేరుకుంది. ఆలయం ముందు భాగంలో దేవస్థానం సేద్యం చేస్తున్న మారేడు వనం పూర్తిగా మునిగి పోయింది. వనంలోకి సుమారు నాలుగు అడుగుల మేర నీరు చేరింది. ఇంకా కిసేపట్లో జాతీయ రహదారి జలదిగ్బంధంలో చిక్కుకోనుందన్న వార్తలు దావానలంలా వ్యాపించడంతో స్థానికులతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు తండోప తండాలుగా చూడ్డానికి వస్తున్నారు. ఒకవేళ ఆ పరిస్థితి ఎదురైతే విశాఖ-విజయవాడ వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం కూడా ఉంది. ఐతే గురువారం రాత్రి సమయానికి కూడా ఎటువంటి ప్రమాద హెచ్చరికలు వెలువడలేదు. హైవే 216 సిబ్బందిని మాత్రం అప్రమత్తంగా వుండాలని ఆ శాఖ అధికార్లు, హైవే పోలీసు లు మౌఖికంగా ఆదేశించారు.

## నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి : పిల్లి సూర్య ప్రకాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా నేలకొరిగిన వరి పంటలను పరిశీలించిన రామచంద్ర పురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్. ఈ మేరకు అయన కే.గంగవరం మండలం పాణింగపల్లి, సత్యవాడ, పామర్రు, కూళ్ళ గ్రామాలలో రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకు న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని,వారి నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం చెల్లించాలని అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, మండల కన్వీనర్ పెట్టా శ్రీను, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం మండల ఆర్గనైజర్ల ఆధ్వర్యంలో

## బౌద్ధోత్సవ కార్యక్రమ కరపత్ర ఆవిష్కరణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం ఇనుగంటివారి పేట గ్రామంలో బుద్ధ వనం నందు సీతానగరం మండలం నుండి ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్న గుడిసె వనరాజు, బందిల దుర్గా ప్రసాద్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామ పరిధిలో గల భౌద్ధ ఆరామం నందు 8 నవంబర్ 2025 తేదీన బౌద్ధోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ 2 వేల సంవత్సరాల పూర్వపు చరిత్ర కలిగిన కాపవరం నందు గల బౌద్ధారామం నందు బౌద్ధోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 8 తేదీన నిర్వహించే విధంగా పెద్దలు ఏర్పాటు చేస్తున్నారని ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యొక్క ముని మనవడు (అంబేద్కర్ అన్నయ్య యొక్క మనువడు)రాజా రత్నా అశోక్ అంబేద్కర్ విచ్చేస్తున్నారని కావున ఆ కార్యక్రమానికి ప్రతి ఒక్కరిని ప్రేమతో ఆహ్వానిస్తూ కరపత్రాన్ని ఆవిష్కరించినట్లు తెలియజేశారు.ఆ రోజు ఉదయం 8 గంటల నుండి ఆ కార్యక్రమం ప్రారంభమవుతుంది అని వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రేమ విందు ఏర్పాటు చేయబడుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మర్రి బాబ్జీ(కన్వీనర్), సిహెచ్ సుబ్బారావు(అధ్యక్షులు), బి.రత్నం(ఉపాధ్యక్షులు), పి.మోహన్(అడ్వకేట్), కొంకి రమేష్(ఆర్గనైజర్), గొంతి కేశవ, కె.మోహన్, కడుగుల అబ్బులు, ఈరెల్లి శ్రీను బాబు, గోశాల రాజ్ కుమార్, కానేటి ప్రేమ కుమార్, గుంటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని

## ప్రజలు వినియోగించుకోవాలి

కేసుల పురోగతిపై సమీక్ష



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం నందు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి బి.పద్మ వారి ఆధ్వర్యంలో ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫ్యామిలీ కోర్ట్ జడ్జి ఎం.మాధురి వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించబడిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతి గురించి సమీక్షించారు. కేసులను యథాశీఘ్రం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు వెంటనే తెలియజేయాలని సూచించారు. అలాగే క్రిమినల్ కేసులకు సంబంధించిన బెయిల్ అర్జీల వివరాలు కూడా తెలుసుకున్నారు.

లక్ష్మీ శ్రీవిద్య యోగాలో

## ఉత్తమ ప్రతిభతో జిల్లా స్థాయికి ఎంపిక



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రం ఆలమూరు డాక్టర్ బోబ్బా జయశ్రీ జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుచున్న పసుపులేటి లక్ష్మీ శ్రీవిద్య గురువారం కొత్తపేట డివిజన్ స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీలలో యోగాలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి గేమ్స్‌కి ఎంపికైంది. దీంతో విద్యార్థిని లక్ష్మీ శ్రీవిద్యను మరింత ఉన్నత విద్య ఉత్తమ ప్రదర్శనతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ హైస్కూల్ హెచ్‌ఎం కె.ఉమ, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్.ప్రసన్న కుమారి, జి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యా కమిటీ, అభివృద్ధి కమిటీ, తదితరులు అభినందనలు తెలియజేశారు.

క్రీడాకారిణి సాయి దుర్గకి

## అభినందనలు తెలిపిన త్రిమూర్తులు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తైక్వాండో రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలు ఈనెల 26, 27 ,28 తేదీల్లో కడప జిల్లా రైల్వే కోడూరులో స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి యు/19 తైక్వాండో పోటీలు జరిగినవి. ఈ పోటీల నందు కేకే సాయి దుర్గ బ్రౌన్ మెడల్ సాధించింది. సాయి దుర్గని క్రీడాకారులు, వాకర్స్ అభినందించారు. కోచ్స్ భూషణం, భార్గవి, తైక్వాండో సీనియర్ కోచ్ పి.త్రిమూర్తులు అభినందించిన వారిలో ఉన్నారు.

# ఎడిటర్ వాయిస్

## నీటి సంక్షోభానికి ప్రత్యామ్నాయ మార్గాలు

ప్రపంచంలో మంచినీటి కొరత నానాటికీ తీవ్రమవుతున్నది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మంచినీటి లభ్యతను పెంచడం ఎలా అన్నది ప్రస్తుతం ప్రభుత్వాలు, విధానకర్తల ముందున్న ప్రధాన సమస్య. 95 శాతం ఉన్న ఉప్పునీటి సముద్ర జలాలను మంచినీటిగా మార్చే అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా మంచినీరు, ఆహార కొరతను తీర్చవచ్చని శాస్త్రజ్ఞులు అంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా లభించే జలాలతో 97.43 శాతం ఉప్పునీరు కాగా, మంచినీటి లభ్యత కేవలం 2.57 శాతం మాత్రమేనని గణాంకాలు ఘోషిస్తున్నాయి. ఈ స్వచ్ఛజలాలలో నదుల ద్వా రా లభించేది కేవలం 0.0002 శాతం మాత్రమే. ఈ పరిమిత నీటితోనే విశ్వవ్యాప్తంగా మానవులు, జంతువుల ఆకలిదప్పులు, పంటల సాగు అవసరాలు తీర్చవలసి వస్తోంది. అయితే ప్రస్తుతం 800 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా 2050 నాటికి 1000 కోట్లు దాటుతుంది. పరిమితంగా ఉన్న మంచినీటి లభ్యతను పెంచకపోతే భవిష్యత్తులో జీవావళి తీవ్ర నీటికొరతను ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో వస్తున్న పెనుమార్పులవల్ల దుర్భిక్షాలు, కరవులు ఏర్పడి నీటిలభ్యత తగ్గడం, దశాబ్దాల క్రితం నిర్మించిన భారీ జలాశయాలు ఒండ్రు మట్టి చేరడంవల్ల పూడికపెరిగి నిల్వ సామర్థ్యం తగ్గి ఆయకట్టు చివరి ప్రాంతాలకు నీరు చేరకపోవడం తెలిసిందే. భారీవర్షాలు, వరదలు వచ్చినపుడు నీరు నిల్వ చేసుకోలేని దుస్థితి వల్ల ఏటా వేల టిఎంసిలు వృథాగా ఉప్పు సముద్రాలలో కలసి పోవడం, అయినా రాష్ట్రాల మధ్య జలజగడాలు ఎడతెగకుండా కొనసాగడం, ఒక ప్రధాన ప్రాచీన పార్టీ నేతలు వాస్తవాలను గమనించకుండా 90% వాటా నీరు తమకే కావాలని కోరుతూ జాతీయ సమైక్యతకు చేటు తెస్తూ ఉండటం చూస్తున్నాం. నీటి సంక్షోభం ముంచుకొస్తున్నా ప్రత్యామ్నాయ మంచినీటి వనరుల కోసం జరుగుతున్న ప్రయత్నాలు ఏమంత ఆశాజనకంగా లేవు. రానున్న కాలంలో ఆహారం, మంచినీటి అవసరాలు మరింత పెరుగుతాయి. నీటికొరత ఉన్న ప్రాంతాలలో సేద్యానికి, మంచినీటికోసం అధికాధికంగా తోడటం వల్ల పెక్కు చోట్ల భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. లభ్యమయ్యే ఉపరితల నదీ జలాల కోసం వివిధ ప్రాంతాల మధ్య ఎడతెగని వివాదాలు, వైషమ్యాలను పెంచుతున్నాయి. ప్రపంచ జనాభాలో ఇప్పటికే సగం మంది నీటికొరతను ఎదుర్కొంటున్నట్లు యునిసెఫ్ పేర్కొన్నది. భారత్‌లో 60 కోట్లమంది (జనాభాలో 45%) నీటి కొరతను ఎదుర్కొంటున్నట్లు కేంద్ర విధాన నిర్ణాయక మండలి నీతిఆయోగ్ వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో నీటి అవసరాలు రెండింతలు పెరగనుండటం, మరోవైపు జలాశయాలలో పూడికపెరిగి నీటి నిల్వ సామర్థ్యం తగ్గి నీటికి కటకట ఏర్పడింది. ఉప్పునీటిలో లీటరుకు టిడిఎస్ స్థాయిలు వెయ్యి మి.గ్రా కంటే ఎక్కువగా ఉండటం వల్ల అవి తాగడానికి, సేద్యానికి, పారిశ్రామిక వినియోగానికి పనికి రావనే అభిప్రాయం ఉంది. అందువల్ల అన్ని అవసరాలకు మంచినీటినే వాడటం వల్ల గిరాకీ కంటే నీటి లభ్యత తక్కువగా ఉండటంవల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. నీటిసంక్షోభం తీవ్రమవుతున్నా నీటి పొదుపు, పరిమితంగా ఉన్న మంచినీటి పునఃపంపిణీ గురించే మాట్లాడుతున్నారే గానీ ప్రత్యామ్నాయాల గురించి పట్టించుకోవడం లేదు. ఉప్పునీటి నుండి క్షారాన్ని యోలగించి మంచినీటిగా మార్చడం, సేద్యానికి ఎలా వాడాలి అనే దానిపైనే పరిశోధనలు సాగుతున్నాయి. వాస్తవ మేమంటే ప్రపంచ నీటిలో 98% ఉప్పునీరే. అందువల్ల అత్యాధునిక శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను వినియోగించి పెరుగుతున్న మానవాళి అవసరాలు తీర్చే రీతిలో ప్రపంచ దేశాలు క్షార జలాలను ఎలా మార్చాలి అనే ప్రధానాంశంగా పరిశోధనలు సాగిస్తే అది ఎంతో మేలు. రక్షణ బడ్జెట్లు, ఆయుధ పోటీలు పెంచి, లాభాలు దండుకుంటున్న సంపన్న దేశాలు మానవాళికి అత్యవసరమైన మంచినీటిపై దృష్టి సారించకపోవడం తగదు. భారీ జలాశయాలలో నీటినిల్వ, నీటి ఆదాకు మాత్రమే పరిష్కారాలను పరిమితం చేశారు. ఉప్పునీటిని శుద్ధి చేసి ఆహారోత్పత్తికి, మంచినీటి సరఫరా మెరుగుకు నిర్దిష్ట ప్రయత్నాలు లేవు. ఉప్పునీరు వాడకానికి పనికి రావనే నమ్మకాలు బలంగా ఉన్నా యుగయుగాలుగా మానవాళి ఆక్షార జలాలను వాడటం తెలిసిందే. 1900 పోషకాలతో లభించే సముద్ర ఉత్పత్తులు మానవ ఆహారంలో ప్రధాన భాగం. మన సాగరాలు, మహాసముద్రాలు ఎన్నో ఖాద్య యోగ్యమైన మొక్కలకు నెలవులు. వివిధ వర్ణాల, రకాల నాచు, ఆలగే గవ్వలరకాలు, తూర్పు, ఆగ్నేయాసియా, పసిఫిక్ తీరదేశాల్లో ఎక్కువగా వాడే సముద్ర ద్రాక్ష తదితర మొక్కలు ఆహారంగా ఎంతో ఉపయోగమవుతున్నాయి. ఆర్థిక దృక్కోణం నుండి చూస్తే మంచినీటితో సాగయ్యే ఎన్నో పంటలను కొన్ని ప్రక్రియలతో ఉప్పునీటితో సాగు చేసే వీలుం ఉంటుందని అంటున్నారు. క్షారాన్నీ తట్టుకుని పెరిగే తుమ్మ, జమ్మి తదితర సముద్ర మాన్లు మేలి కలపగా పనికొస్తాయని చెబుతున్నారు. హాలో ఫైట్స్ ప్రత్యామ్నాయంగా వస్తున్న పంటలు వంట నూనెల ఉత్పత్తికి, మొక్కజొన్న, చెరకు, పామాయిల్‌కు ప్రత్యామ్నాయంగా అక్కరకొస్తాయంటున్నారు. ఉప్పునీటితో పెరిగే పూవులు, ఉద్యాన పంటలు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడతాయని నిపుణుల అభిప్రాయం. క్షారాజలాన్ని మెరుగైనరీతిలో వాడితే పురోభివృద్ధి సాధ్యం కాగలదని భావన బలంగా ఉంది. ప్రపంచ



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# టెట్ అర్హత సాధిస్తేనే.. ఉపాధ్యాయులా?



భారతదేశంలోని 6 నుండి 14 సంవత్సరాలు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడమే లక్ష్యంగా ఉచిత విద్యా నిర్బంధ హక్కు చట్టం– 2009 ఆగస్టు 4న రూపొందించింది భారత పార్లమెంటు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ లో ఉంది. ఈ చట్టం 2010 ఏప్రిల్ 1న అమల్లోకి వచ్చింది. దీంతో విద్యను ప్రతి విద్యార్థికి ప్రాథమిక హక్కు గా అందించే 135 దేశాలలో భారతదేశం ఒకటిగా మారింది. ఈ చట్టంలో భాగంగానే 2011లో కేంద్రం టెట్‌ను ప్రవేశ పెట్టింది. ఇప్పుడు ఈ పరీక్షే ఉపాధ్యాయులకు గుదిబండగా మారింది. ఈ చట్టం ప్రకారం టీచర్‌గా పని చేయాలంటే టెట్ కూడా క్వాలిఫై అవ్వాలని చట్టం చేశారు. ఇక అప్పటినుండి బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన వారందరూ టెట్ రాస్తున్నారు. మరి ఇప్పుడెందుకు టెట్ గోల? అంటే సుప్రీంకోర్టు సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పు ప్రకారం, ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీస్ ఉన్న ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష తప్పనిసరి చేస్తూ.. అలాగే సర్వీస్‌తో సంబంధం లేకుండా ప్రమోషన్ పొందాలంటే.. టెట్ పాస్ అవడం తప్పనిసరి చేస్తూ తీర్పునివ్వడంతో ఉపాధ్యాయుల్లో టెన్షన్ నెలకొంది. సుప్రీం తీర్పు ప్రకారం, ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణులు కావాలని లేదా తప్పనిసరి పదవీ విరమణ ఎదుర్కోవాలని షరతు పెట్టింది. ఆ మేరకు రాష్ట్రాలు ఇప్పుడు ఈ విధానాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాయి. దీనికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో నాలు గు రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్లు వేసి పోరాడుతుంటే 'ఊరంతా ఒకదారైతే ఉలిపి కట్టెదొక దారన్నట్లు' ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు ఆరడుగులు ముందుకేసి ఇందుకు నోటిఫి కేషన్‌ను విడుదల చేశాయి.. ఈ ప్రభుత్వాలకు ఇంత ఉత్సాహం ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలులో, 32 వేల బకాయిల చెల్లింపులో, పీఆర్సీ కమిటీ నియామకంలో, ఖాళీగా ఉన్న పోస్టుల్లో మరో డీఎస్సీ వేయడం వంటి సమస్యల పరిష్కారంలో ఎందుకు చూపలేక పోతున్నారు? దున్నపోతు ఈనిందంటే గాట్లో కట్టేసే ధృతరాష్ట్ర సంస్కృతి అమలుకు ఉత్సాహమెందుకు? ఊపిరి సలపని విధులతో అల్లాడుతున్న ఉపాధ్యాయ వర్గంపై ఒత్తిడి పెంచడం అవసరమా?

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్ పాస్ కాకపోతే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ఉద్యోగం నుండి తొలగించాలి. అయితే ఇలా ఎంత మందిని తొలగిస్తారు? పాతిక, ముప్పై సంవత్సరాల సర్వీస్ కలిగిన వేలాది మంది గురువులకు ఇంతటి అగ్ని పరీక్షలు అవసరమా? విద్యా చట్టం ప్రకారం ఎస్ఈఆర్టీలోని అన్ని ప్రతిపాదనలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేశాయా? ప్రైవేట్ విద్యాసంస్థలు 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాయా? ముందుగా ప్రభుత్వా లు టెట్‌కు అర్హత సాధిస్తేనే పరిపూర్ణమైన ఉపాధ్యాయులనే ఛాందస భావన నుండి బయటకు రావాలి. కాదు అదే సమంజసమని పాలకులు భావిస్తే.. ఇప్పటివరకు ఆయా ఉపాధ్యాయుల వద్ద విద్యను అభ్యసించిన లక్షలాది పౌరులు, వివిధ ఉద్యోగాలు చేస్తున్న వారికీ ఆయా స్థాయిల్లో పరీక్షలు అవసరమే కదా! ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల పరిస్థితి కూడా ఇదే! ఉపాధ్యాయ వర్గాన్ని త్రిశంకు స్వర్గంలోకి నెట్టే ఈ దుందుడుకు అపరిపక్వ విధానాలకు స్వస్తి పలకక పోతే వ్యవస్థ నిర్వీర్యమై ప్రజల్లో ఒక శాశ్వత అనుమానం పాదుకునే ప్రమాదం వుంది. నిజానికి ఉపాధ్యాయ వృత్తిలోకి రావడమంటే అంత సాదా సీదా వ్యవహారం కాదు. ప్రతి దశలోనూ జల్లెడ పట్టిన తర్వాతనే ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశించగలుగుతున్నాడనే నగ్న సత్యాన్ని ఎన్సీటీఈ, సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఉపాధ్యాయులుగా నియామకం కావడానికి టీటీసీ, బీఈడీ కోర్సులు పూర్తి చేసి వేలాది మందితో పోటీపడి డీఎస్సీలో మెరిట్ సాధిస్తేనే ఉద్యోగంలోకి రాగలగుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై అన్ని వర్గాలు స్పృహతో ఆలోచించాలి. వీలైనంత త్వరగా ఈ సమస్యని పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలపై వుంది. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలూ తగిన చొరవ తీసుకోవాలి. ఎందుకంటే విద్యారంగం కేంద్ర ప్రభుత్వ గుప్త ఆస్తి కాదు. లేని పక్షంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉభయలూ నష్టపోయే ప్రమాదం ఉంది. ఎన్ని తీర్పులున్నా, ఎంత ఒత్తిడి వున్నా ఉపాధ్యాయులు అధైర్యపడొద్దు. ఉద్యోగాన్ని ఒక్క సెంటీ మీటర్ కూడా కదిలించే శక్తి ఎవరికీ లేదు. ఏ న్యాయస్థానం ఈ మీమాంసలు లేవనేత్తిందో అదే న్యాయ స్థానంలో మన వాణిని వినిపిద్దాం! ఎందరినో ఎన్నో పరీక్షలలో గట్టెక్కించిన మేధావిలోకం ఈ చిన్న సమస్యకే అదిరిపోయి మానసిక ఒత్తిడికి గురి కావద్దు. అనవసర అందోళనకు గురికావద్దు. జీవితమంటే ఉద్యోగం మాత్రమే కాదు. మీకూ కుటుంబాలున్నాయి. మీ మీద ఆధారపడిన వారున్నారు. బాధ్యతలున్నాయి. ఏ సమస్యనైనా సమిష్టిగా ధైర్యంగా ఎదుర్కొందాం. టెట్ అర్హత పొంది ఉన్నవారికి, లేని వారికీ, మినహాయింపు పొంది ఉన్నవారికి ఇది వేర్వేరు సమస్య కాదు. అందరిదీ. అందరం కలిసి పోరాడదాం అంతిమ విజయం మనదే!

# వేద భారతావనిలో ప్రముఖుడు

యాజ్ఞవల్క్య మహర్షి ప్రాచీన వేద భారతావనిలో ప్రముఖుడు. ఉపనిషత్తుల్లో ముఖ్యంగా కనిపించే యాజ్ఞ వల్క్యుడు శతపథ బ్రాహ్మణం (బృహదారణ్య కోపనిషత్తు సహా), యాజ్ఞవల్క్య సంహిత, యాజ్ఞవల్క్య స్మృతి రచించాడు. పూర్వం కురుపాంచాల దేశంలో గంగానదీ తీరాన చమత్కార పురం అనే నగరంలో ఉండే యజ్ఞవల్క్యుడు అనే మహర్షి, ఆయన భార్య సునందలకు జన్మించినవాడే యాజ్ఞ వల్క్యుడు. యాజ్ఞవల్క్యుడు భాష్కలుడి దగ్గర రుగ్వేదాన్ని, జైమిని మహర్షి దగ్గర సామవేదాన్ని, అరుణి దగ్గర అధర్వణ వేదాన్ని నేర్చుకున్నాడు. వైశంపాయన మహర్షి దగ్గర యజుర్వేదాన్ని నేర్చుకున్నాడు. అయితే యాజ్ఞవల్క్యుడికి అహంకారం, విద్యామదం లాంటివి కలిగాయి. ఆ విషయాన్ని గురువు గ్రహించాడు. యాజ్ఞవల్క్యుడిలో నానాటికీ విద్యామదం అధికం అయింది. అది ఆత్మాభిమానమని యాజ్ఞవల్క్యుడు అనుకున్నాడు. ఓ రోజున వైశంపాయనుడు తన మేనల్లుడు అధర్మమార్గంలో సంచరిస్తున్నాడని తెలుసుకొని కోపం పట్టలేక కాలితో అతడిని తన్నాడు. బ్రాహ్మణుడిని కాలితో తన్నటం బ్రహ్మహత్యతో సమానమని ధర్మశాస్త్రాలు చెప్పిన విషయాన్ని వైశంపాయనుడు కోపం చల్లారిన తర్వాత గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇక ఆ పాపాన్ని ఎవరు పోగొడతారా అని మదన పడసాగాడు. ఆ విషయాన్ని గమనించిన యాజ్ఞవల్క్యుడు గురువు దగ్గరగా వెళ్ళి ఆ పాపాన్ని పోగొట్టడం తనవల్ల తప్ప మరెవరివల్లా కాదని గర్వంగా అన్నాడు. తనపాపం పోవటం అటుంచి అంతటి కష్టకాలంలోను శిష్యుడు అంత గర్వంగా మాట్లాడటం గురువుకు కోపం తెప్పించింది. ఇక తాను ఎలాంటి విద్యలు అతడికి నేర్పబోనని, అప్పటిదాకా నేర్పిన వాటి నన్నింటినీ కక్కి (ఏవీ గుర్తుంచు కోకుండా మరిచిపోయి) వెళ్ళిపొమ్మని అన్నాడు. గురు ద్రోహానికి అదే తగిన శిక్ష అని అన్నాడు. అయితే అప్పటికి యాజ్ఞవల్క్యుడు తాను ఆత్మాభిమానం పేరున గర్వభావాన్ని కలిగివున్నానని తెలుసు కొన్నాడు. క్షమించమని గురువును వేడుకొన్నా లాభం లేకపోయింది. అయితే తనవంతు బాధ్యతగా యాజ్ఞవల్క్యుడు తన తపోబలంతో గురువుకు సంక్రమించిన బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టి తాను నేర్చుకొన్న వేదాలను అక్కడే రక్తరూపంలో కక్కి వెళ్ళి పోయాడు. అయితే ఎంతో విచిత్రంగా యాజ్ఞవల్క్యుడు విసర్జించినదాన్ని కొన్ని తిత్తిరి పక్షులు గ్రహించి, అవి తిరిగి ఆ వేదసారాన్ని పలికిన పలుకులే తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధికెక్కాయి. గురువు దగ్గర నేర్చుకున్నదంతా అక్కడే వదిలివేసిన యాజ్ఞ వల్క్యుడు ఆత్మస్థైర్యంతో సూర్య భగవానుడిని ఆరాధించి ఆయన కరుణకు పాత్రుడై శుక్ల యజు ర్వేదాన్ని నేర్చుకున్నాడు. తర్వాత సరస్వతీదేవిని ఉపాసించి సమస్త విద్యలూ అభ్యసించాడు. ఉత్తమోత్తమ విద్యాధిపతిగా యాజ్ఞవల్క్యుడు పేరుతెచ్చు కున్నాడు. కణ్వుడు లాంటి ఉత్తమ శిష్యులు ఆయనదగ్గర శిక్షణ పొందాడు. ఒకసారి జనకుడు యాగం చేస్తూ మహర్షులందరినీ ఆహ్వానించాడు. యాజ్ఞవల్క్యుడికి ఆహ్వానం వెళ్ళింది. అలా మహర్షు లందరూ రాగానే జనకుడు మీలో ఎవరు గొప్ప విద్యా వంతులైతే వారొచ్చి ఇక్కడున్న ధనరాశులను తీసుకు వెళ్ళవచ్చు అని అన్నాడు. రుషు లంతా ఒకరిముఖాలు ఒకరు చూసుకొని తామందుకు అర్హులం కామను కొంటూ ఊరకనే కూర్చున్నారు. యాజ్ఞవల్క్యుడు మాత్రం లేచి తన శిష్యులను పిలిచి ఆ ధనరాశులను తన ఇంటికి తీసుకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు. యాజ్ఞవల్క్యుడి ధైర్యాన్ని చూసిన తర్వాత అతడితో శాస్త్ర విషయాల్లో పోటీకి దిగి యాజ్ఞ వల్క్యుడిని అనర్హుడిగా నిరూ పించేందుకు చేసిన ప్రయత్నం ఫలించక పోవడంతో జనకుడు ఆ రుషిని గొప్పగా పూజించి సత్కరించాడు. జనకునికి ఆయన అనేక ఆధ్యాత్మిక విషయాలను వివరించి చెప్పాడు. ఓ రోజున విశ్వావసుడు అనే గంధర్వుడు యాజ్ఞవల్క్యుడి వద్దకు వచ్చి, తత్వాన్ని ఉపదేశించమని కోరి ఎంతో నేర్చుకొని యాజ్ఞవల్క్యు డంతటి గొప్పవాడు మరొకడు లేడని ఆ మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్ళి పోయాడు. అనంతరకాలంలో ఆ రుషి గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు. ఆ రోజుల్లో కతుడు అనే ఒక రుషి ఉండేవాడు. ఆయనకు కాత్యాయని అనే పేరున్న కూతురుండేది. ఆమెను యాజ్ఞవల్క్యుడి కిచ్చి పెళ్ళిచేశారు పెద్దలు. అయితే మిత్రుడు అనే పేరున్న ఒక బ్రాహ్మణుడి కుమార్తె, పండితురాలైన గార్గి అనే ఆమె శిష్యురాలు అయిన మైత్రేయి యాజ్ఞవల్క్యుడిని వివాహ మాడాలని పట్టుబట్టింది. అప్పటికే అతడికి కాత్యాయనితో వివాహం కావటంతో పెద్దలకు ఏంచేయాలో అర్థంకాలేదు. గార్గి ఈ సమస్యకు సమాధానాన్ని వెతికింది. మైత్రేయిని కాత్యాయనికి పరిచయంచేసి ఆ ఇద్దరూ ఎంతో స్నేహంగా ఉండేలా చేసింది. కాత్యాయని, మైత్రేయి ఒకరిని విడిచి మరొకరు ఉండలేని స్థితికి వచ్చారు. అప్పుడు గార్గి అసలు విషయాన్ని కాత్యాయనికి చెప్పింది. కాత్యాయని కూడా మైత్రేయి కోరికను మన్నించి యాజ్ఞ వల్క్యుడితో వివాహాన్ని జరిపించింది. అలా యాజ్ఞ వల్క్యుడికి ఇద్దరు భార్యల య్యారు. రుషులంతా యాజ్ఞ వల్క్యుడి లోని విద్యా వైభవాన్ని, యోగ ప్రాభవాన్ని గుర్తించి మాఘశుద్ధ పూర్ణిమ నాడు యోగీంద్ర పట్టాభిషేకం చేశారు. అతను ఋషులకు తెలియజేసిన విషయాలే యోగశ్రాస్తమని యోగ యాజ్ఞవల్క్య మనీ ప్రసిద్ధికెక్కాయి. యాజ్ఞవల్క్యుడు భార్యలకు తత్వమునుపదేశించి సన్యసిం చాడు. ఆయన పేర ఒక స్మృతి ఉంది.

## పొదుపు.. దేశ ఆర్థిక భద్రతకు పునాది!

ప్రజలు తమ ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి, భవిష్యత్తు ఖర్చులకు సిద్ధం కావడానికి, ఆర్థిక ఒత్తిడిని తగ్గించుకోడానికి డబ్బు ఆదా చేయడం ఒక ముఖ్యమైన అడుగు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది ప్రజలు తమ పొదుపు డబ్బును తమ ఇంట్లో ఉంచడం లాంటివి చేస్తుంటారు. కానీ అదే పొదుపును ఇతర మార్గాలలో చేస్తే.. ఆ చేసిన పొదుపుకు ఆదాయం సమకూరడంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందుతారు. దీనిపై అందరినీ చైతన్యపరిచేలా అవగాహన పెంచే ఉద్దేశ్యంతో ప్రపంచ వ్యాప్తంగా పొదుపు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇది వ్యక్తులకే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరం చేయడానికి ప్రోత్సహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రపంచ పొదుపు దినోత్స వాన్ని జరుపుకుంటే భారత్ మాత్రం అక్టోబర్ 30న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటుంది. (కారణం ఇందిరా గాంధీ అక్టోబర్ 31వ తేదీన హత్యకు గురైన రోజు) 'పొదుపు' అంటే వనరులన్నింటినీ ఒకేసారి ఖాళీ చేయకుండా తెలివిగా అవసరాలకు తగ్గట్టుగా జాగ్రత్తగా ఉపయోగించడం. ఆదాయ అభివృద్ధి గణనీయంగా పెంచుకోవడం అందువల్ల, బ్యాంకులు, ఇతర వాణిజ్య వ్యాపారాలు పొదుపు పెట్టుబడి సంస్కృతిని ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. స్థిరమైన జీవితాన్ని పొందాలన్నా, వారసత్వాల భవిష్యత్తుకు స్థిరమైన ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నా ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలి, కచ్చితమైన రాబడులకోసం పొదుపు సూత్రాలను పాటించాలి. డబ్బు నిర్వహణ లోపిస్తే జీవిత చరమాంకంలో బతుకు దుర్లభంగా మారుతుంది. ఈ పొదుపు అనేది మనుషులదే కాదు దేశానికి కూడా చాలా అవసరం. ప్రభుత్వాలు, ప్రజలకు అనవసరమైన ఉచితాలు ఇవ్వకుండా వైద్యం, విద్యను ఉచితంగా ఇవ్వగలిగితే ప్రజలు సంపాదించానికి, పొదుపు చేసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఉచితాలు అందించే ఏ ప్రభుత్వమైనా, దేశమైనా ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేయడమే అవుతుంది. ప్రజలకు పొదుపు చేయడం అలవాటు చేసి, బతకడం నేర్పిస్తే ఏ దేశమైనా శక్తివంతమైన దేశంగా మారుతుంది. ప్రజలు భద్రతతో ఉన్నారంటే దేశం పటిష్టమైన స్థానంలో ఉంటుంది. పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత.

### మొంథా తుఫాన్ మూలంగా నష్టపోయిన వారికి

# ప్రభుత్వం ఆర్థిక సాయం

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ మూలంగా నష్టపోయిన వారికి తా త్కాలిక ఉపశమనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులను రానున్న మూడు రోజులలో పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మొంథా తుఫాన్ ఉపశమన చర్యలు పంట నష్ట అంచనాలు రూపకల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాలలో నిత్యవసర వస్తువు లైన ఉల్లిపాయలు బంగాళ దుంపలు కందిపప్పు, పామ్ ఆయిల్ పంచదార ప్యాక్ చేసి పంపిణీ చేయాలని 25 కేజీలు, బియ్యం మాత్రం చౌక ధరల దుకాణాల వద్ద పంపిణీ చేయాలన్నారు. అదేవి ధంగా గత ఐదు రోజులుగా చేపల వేట కోల్పోయిన మత్స్యకారులకు చేనేత రంగ కార్మికులకు 50 కేజీల చొప్పున బియ్యాన్ని ఈ పాస్ ఎనేబుల్ పద్ధతిలో ఉచితంగా సరఫరా చేయాలన్నారు. జిల్లావ్యాప్తం గా పునరావాస కేంద్రాలను ఆశ్రయం పొందినవారు సుమారు 30 వేల మంది వరకు ఉన్నారని వీరందరికీ ఆర్థిక సహాయం కుటుంబానికి రూ 3 వేలు ఒంటరి వ్యక్తులకు వెయ్యి చొప్పున అందించాల న్నారు. తీర ప్రాంత వ్యాప్తంగా 45 గ్రామాలలో సుమారు 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కేజీలు బియ్యం సంబంధిత మత్స్య అభివృద్ధికారుల జీవన భృతి కోల్పోయారనే ధ్రువీకరణ తో అదేవిధంగా చేనేత జౌలి శాఖ ధ్రువీకరణతో చేనేత రంగ కార్మి కులకు ఉచితంగా అందిం చాలన్నారు. మూడు రోజులలో తుఫాన్ ఉపశమన ప్రక్రియను సంబంధిత ప్రజాప్రతినిధుల భాగ స్వామ్యంతో ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా ఉప శమన పరిహారాలు అందించు ప్రక్రియలో స్థానిక తాసిల్దారు ఎంపీడీవో సమన్వయం సహ కారం పొంది పారదర్శకంగా బియ్యం నిత్య వసరాలు పంపిణీ చేయాలన్నారు. సముద్రపు తీర ప్రాంతంలో ఇతర జిల్లాల నుండి వలస వచ్చి తుఫాను మూలంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారుల జీవన భృతికి ఉచితంగా బియ్యం అందించాలన్నారు. వ్యవసాయ ఉద్యాన శాఖలు పంట నష్టాలను అంచ నా వేసి లెక్కించడానికి బృందాలను నియమించాలని ఆదేశించారు. పంట నష్ట అంచనాలు శాస్త్ర యుక్తంగా వ్యవసాయ శాస్త్రజ్ఞుల నిబంధనలు పరిగణనంలోకి తీసుకొని గణించాలన్నారు జిల్లావ్యాప్తంగా ప్రాథమిక అంచనాగా సుమారు 31 వేల ఎకరాలలో వరి పంట దెబ్బ తిందని గుర్తించినట్లు తెలిపారు రెవెన్యూ గ్రామ వ్యవసాయ సహాయకులు వ్యవసాయ అధికారులు శాస్త్రజ్ఞుల ద్వారా బృందాలు నియమించి పంట నష్ట అంచనాలను రూపొందించాలన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు కౌలు దారులకు మాత్రమే పరిహారం అందేలా చూడాలన్నారు. తుఫాను నేపథ్యంలో పశుసం వర్ధక శాఖ 50% రాయితీతో పశుదాన సరఫరా చేసేలా 800 టన్నులు సిద్ధం చేసిందని రైతులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. అదేవిధంగా పశు వైద్యశాలల తుఫాన్ డామేజ్లను గణించాలన్నారు అలాగే పశు ఔషధాలను గణించాలన్నారు. మత్స్య శాఖ ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు జెట్టీలు, హర్బర్ల డామేజ్ లను గణించాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ దెబ్బతిన్న గృహాల అంచనాలను గణించాలన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం వారు సి పి డబ్ల్యూ ఎస్, సింగల్ విలేజ్ స్కీముల ఓవర్ హెడ్ ట్యాంకులు పైప్ లైన్లు, జనరేటర్లు వంటి నష్టాలను గణించాలన్నారు. పంచాయి తీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారు డామేజ్ రోడ్లు వంతెనలు నిర్దేశిత ప్రొఫార్మాలో కిలోమీటర్ల వారీగా గణించాలన్నారు. పాఠశాల విద్యాశాఖ 47 పాఠశాలల్లో డ్యామేజీలను ఆటస్థలం కాంపౌండ్ వాల్తో సహా ఎడ్యుకే షన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఇంజనీర్ల ద్వారా అంచనాలు రూపొందించాలన్నారు. ఐసిడిఎస్ వారు అంగన్వాడీ కేంద్రాలు అంగ న్వాడీ కార్యాలయాల డామేజీలపై నివేదికలో సమర్పించాలన్నారు. జల వనరుల శాఖ ఇంజనీర్లు లాకులు కాలువ గట్ల షట్టర్లు డామేజ్పై నివేదికలు రూపొం దించాలన్నారు. డ్రైనేజీ శాఖ ఇంజనీర్లు డ్రైనేజీలలో పూడికతీత షట్టర్ల రిపేర్లు డామేజ్లను లెక్కించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పీహెచ్సీ సిహెచ్సి ఆరోగ్య కేంద్రాలు డామేజ్లను విద్యుత్ శాఖ కరెంటు స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లు కండక్టర్లు డామేజీలను రూపొందించాలన్నారు. అధికా రులు తమ హెచ్ఓడీలకు జిల్లా కలెక్టర్ వారికి నివేదించే అంచనాలు ఒకే విధంగా ఇటువంటి వ్యత్యాసాలకు తావు లేకుండా సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఐదు రోజులలో ఈ నివేదికలు రూపకల్పన చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కే.మాధవి పి.శ్రీకర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సెల్ఫీ వీడియో - ఆపై సూసైడ్

# భార్యా భర్తలిద్దరూ మృతి

- ★ అనాథ ఐన మూడేళ్ల కుమారుడు
- ★ తొందరపాటుతనమా..? శరీరేచ్ఛలా..? దేనికి సంకేతం..?
- ★ వెరిసి అనాథగా మారిన బాలుడు..!!
- ★ కుటుంబ జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్న ఫ్యామిలీస్..
- ★ అరచేతిలో మొబైల్ ఫోన్.. అడ్డుకునే వారే లేరు..
- ★ నా జీవితం - నా ఇష్టం - ఒకరిపై ఇష్టం - మరొకరిపై మోజు
- ★ సంసారం ఒకరితో.. మరొకరితో...!!



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** భీమడోలు..అవమాన భారంతో జంట ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది.భీమడోలుకు చెందిన గుండుమోలు భానుపూర్ణిమ (22),భర్త సుధాకర్ విషం తాగి ఆత్మహత్యాయత్నం చేయగా భార్య సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.అయితే భర్త నిన్న తెల్లవారుజామున 2 గంటల సమయంలో చికిత్స పొందుతూ అదే ఆసుపత్రిలో మృతి చెందాడు.వీరు ఇద్దరు గతంలో ప్రేమ వివాహం చేసుకుని హ్యాపీగా జీవితం గడిపే వాళ్ళు అనుకోకుండా దంపతులు ఇరువురు శనివారం విషం తాగి ఆ సెల్ఫీ వీడియోను స్నేహితులకు, కుటుంబ సభ్యులకు పంపి ఆత్మ హత్య చేసుకున్న వైనం. అయితే అస్సలు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు. దీనివెనక ఎవరు వున్నారు. అనే అనుమానాలు వ్యక్తం అయ్యే సమయంలో అదే గ్రామానికి చెందిన కటారి మోహన్ అనే వ్యక్తి 15 రోజులు క్రిందట మాయమాటలు చెప్పి భాను పూర్ణిమను తన వెంట తీసుకువెళ్లడంపై భర్త సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ విషయంపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు.అయితే కొన్ని రోజులు గడిచిన తర్వాత పూర్ణిమ మరల తిరిగి వచ్చిన క్రమంలో ఏమైందో ఏమో మోహన్ అనే వ్యక్తి వారి లైఫ్లోకి రావడం వల్ల తాము మానసికంగా కృంగిపోతున్నామని సెల్ఫీ వీడియో తీసి తదనంతరం విషం తాగి సోమవారం రాత్రి భార్య మృతి చెందగా,నిన్న తెల్లవారుజామున భర్త మృతి చెందాడు. భాను పూర్ణిమ ఇచ్చిన సెల్ఫీ వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసి మృతికి కారకుడైన కటారి మోహన్ ను అరెస్ట్ చేసి రిమాండ్కి పంపించిన భీమడోలు పోలీసులు.పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

# తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటాం...

### పంట నష్టాన్ని అంచనా వేయండి - వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే వేగుళ్ళ ఆదేశాలు

### పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి ప్రభుత్వ సహాయంగా 3 వేలతో పాటు నిత్యవసర సరుకులు అందజేత



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలో రోడ్లన్ని దెబ్బతిన్నాయన్నారు. రైతాంగం మొత్తం ఏం చెయ్యాలో దిక్కుతోచని పరిస్థితిలలో ఉన్నారన్నారు. దీనిపై అగ్రికల్చర్ ఎ.డి మూడు మండలాల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి, ప్రతీ గ్రామనికి వెళ్ళి పరిస్థితిని పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వెయ్యమని ఆదేశించి నట్లు చెప్పారు. మండపేట నియోజకవర్గంలో సుమారు 57,600 ఎకరాలు వరిపంట పండిస్తున్నారన్నారు. జిల్లాలోనే అత్యధికంగా వరి పండించే నియోజకవర్గాలలో మండపేట నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందన్నారు. నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ నియోజకవర్గం నుండి పంట నష్టాన్ని అంచనా వేయమని అధికారులను ఆదేశించారన్నారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ముందస్తు చర్యగా ప్రతీ నియోజకవర్గంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండపేట నియోజకవర్గంలో 50 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తాటాకు పాకలలో నివసిస్తున్న వార్ని, శిథిలావస్థలో ఉన్న పెంకుటింట్లో నివసిస్తున్న వార్ని, ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కూలీలలను సుమారు 2,400 మందిని కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. వీరందరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ వ్యక్తికి వెయ్యి రూపాయలు, కుటుంబానికి అయితే 3 వేల రూపాయలు, రేషన్ కార్డు కు 25 కేజీల బియ్యం, కేజి నూనె, కేజి కందిపప్పు, కేజి ఉల్లిపాయలు, కేజి బంగాళాదుంపలు, కేజి పంచదార అందించనుందన్నారు. తుఫాను సమయంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు ఆ రాత్రంతా నిద్రపోకుండా మండపేట నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు సంసిద్ధులై ఉన్నారన్నారు. అటు అమరావతి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ రాత్రంతా మెలకువగా ఉండి రాష్ట్ర పరిస్థితిని ఏ విధంగా పర్యవేక్షణ చేశారో అధేవిధంగా మండపేట నియోజకవర్గంలో అధికారులు అందరూ సమన్వయంతో పనిచేశారన్నారు. అన్ని శాఖల అధికారులకు మరోసారి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఎప్పటికప్పుడు వాస్తవ విషయాలను ప్రజలకు తెలియజేస్తూ, వారిని మరింత జాగ్రత్తగా ఉండే విధంగా చేసిన ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ అభినందనలు తెలిపారు.

# పంటనష్టంపై పరిహారం రైతులకు సత్వరమే అందేలా చూస్తాము



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంతో రైతులకు ఏర్పడిన పంట నష్టాన్ని అంచనా వేయడం ద్వారా త్వరితగతిన సాయం అందేలా చర్యలు చేపడతామని లొల్లి కూటమి నాయకులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ , రైతు సేవా కేంద్ర సిబ్బంది క్షేత్ర స్థాయిలో పొలాలను పర్యటించి, నీట మునిగిన వరి చేనులను కూటమి నేతలు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, లొల్ల గ్రామ సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు వైట్ల సతీష్, గ్రామ టీడీపి అధ్యక్షులు సుంకవల్లి గంగరాజు ఆద్వర్యంలో పరిశీంచారు. ఈ సందర్భంగా సర్పంచ్ జానకి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తుఫాన్ సమయంలో పంట నష్టాన్ని నివారించడానికి చేపట్టిన చర్యలు, పంటనష్టం పై అందిస్తున్న సాయం గురించి రైతులకు వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన సాయం రైతులందరికి సత్వరమే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవిన్యూ అధికారి మాధవి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ వల్ల అన్నదాతలకు తీరని నష్టం...

### ముందస్తు చర్యలతో సామాన్య ప్రజలకు ఇక్కట్లు తప్పాయి - ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో ముప్పు తగ్గింది

### రైతులను ప్రభుత్వం తరపున ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాం : ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో తీసుకున్న ముందస్తు జాగ్రత్తలతో మొంథా తుఫాను వల్ల సామాన్య ప్రజలకు ఇక్కట్లు తప్పాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పూరి గుడిసెలు, రేకుల షెడ్లు, శిథిల భవనాలలో నివాసం ఉంటున్నవారినందరినీ పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, పరిపాలనాదక్షతతో చేసిన ఏర్పాట్ల వల్ల ప్రాణనష్టం గానీ, గాయపడటం గానీ లేకుండా తుఫాను నుంచి ప్రజలంతా బయటపడటం జరిగిందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్నవారికి పరిశుభ్రమైన తాగునీరు, భోజనం అందించడం జరిగిందన్నారు. అధికారులను సమాయత్తం చేయడం, ప్రజలందరినీ అప్రమత్తం చేయడంతో యంత్రాంగం చురుకుగా పనిచేసి ప్రజల్ని చైతన్యవంతం చేసిందన్నారు. తుఫాను గాలుల వల్ల దెబ్బతిన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు వెంటనే తొలగించి విద్యుత్ పునరుద్ధరించడం జరిగిందన్నారు. అయితే ఈ తుఫాను వల్ల రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోయారని వాపోయారు.కొత్తపేట నియోజకవర్గంలో పదివేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని తెలిపారు. మరో 1500 ఎకరాల నుంచి 2 వేల ఎకరాల్లో అరటి,బొప్పాయి, కూరగాయలు, పూలతోటలు దెబ్బతిన్నట్లు అంచనా వేయడం జరిగిందని తెలియజేశారు. వరి ఎకరానికి రూ. 8వేలు, అరటికి రూ. 14వేలు, పూలు,కూరగాయల పంటలకు ఎకరానికి రూ. 10వేలు నష్ట పరిహారంగా అందించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంగళవారం తుఫాను వస్తే బుధవారం ఉదయాన్నే ముఖ్యమంత్రి స్వయంగా ఓడలరేవు వచ్చి పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడి వారితో మాట్లాడటం జరిగిందన్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న కుటుంబాలకు నిత్యవసర వస్తువులు, మనిషికి రూ. 1వెయ్యి, కుటుంబానికి రూ. 3వేలు పంపిణీ ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో ఎన్నో ప్రకృతి విపత్తులు సంభవించాయని, ప్రభుత్వం ఈ తుపాను సందర్భంలో అధికార యంత్రాంగాన్నంతా సమాయత్తం చేసి సామాజిక బాధ్యతతో కలిసి పనిచేయడం జరిగిందన్నారు. తుఫాను నుంచి ప్రజలను రక్షించడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సహకారం అందించిన ప్రధాని మోదీలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సేవలో ముందున్న ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలకు సైతం కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్తపేట నియోజకవర్గంలోని రైతాంగాన్ని ఆదుకునేందుకు విస్తృతంగా కృషి చేస్తామని తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, పల్లి యేసు, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్, కాసా సాగర్ పాల్గొన్నారు.

## కర్నూలు బస్సు ప్రమాదంలో మృతి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం..



### శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బండారు

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు వద్ద కావేరి బస్సు దగ్ధమైన ఘటనలో మృతి చెందిన రావులపాలెం కి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం పరామర్శించారు. శ్రీనివాసరెడ్డి భార్య, కుమారుడు, కుమార్తెలను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.

# ఇన్సూరెన్స్ ఉంటేనే రైతుకు నష్టపరిహారమా...??

### ఇన్సూరెన్స్ ఉన్న లేకున్నా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి - నష్ట తీవ్రతను అంచనాలో తీవ్ర అవకతవకలు ఉన్నాయి : ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మెన్, మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. మండపేట విజయలక్ష్మి నగర్లోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ కనివిని ఎరుగని విధంగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. అదృష్టవశాత్తు ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగలేదని అన్నారు. వ్యవసాయ రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోయారని తోట పేర్కొన్నారు. పంటకు చేతికి అందే దశలో ఈ తుఫాను తీవ్ర నష్టాన్ని చూపిందన్నారు. గాలుల ప్రభావం వల్ల వరిచేలు తెరచాపలా నేలకు వోరిగాయని దీనివల్ల రైతులు ఎంతగానో నష్టపోయారన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఎంతో తేడాలు ఉన్నాయ న్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే వరి పంటకు ఇన్సూరెన్స్ చెల్లించేదని గుర్తు చేశారు. ప్రమాద వశాస్తూ ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రైతులకు మేలు చేసిందన్నారు. 2019-2024లో ప్రజలకు మంచి చేసినట్లు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో పంటలకు ఇన్సూరెన్స్ అనే విధానాన్ని రైతులు కడితేనే ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకునే విధంగా కొత్త విధానాన్నే కాకుండా ఒక బిల్లును తీసుకు వచ్చారన్న విషయాన్ని తోట గుర్తు చేశారు. శాసనమండలిలో మంత్రి అచ్చంనాయుడు మాట్లాడినప్పుడు దానిపై తాము గత ప్రభుత్వంలో ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కట్టే విధానాన్ని కొనసాగించాలని అవసరమైతే పేరు మార్చుకుని పాత విధానాలు అవలంబించాలనీ డిమాండ్ చేసిన విషయం గుర్తు చేశారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం వ్యవసాయ పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి ఉంటే ఈ రోజు రైతులకు మేలు జరిగేదని పేర్కొన్నారు. శాసనమండలి సాక్షిగా ఈ ప్రభుత్వంలో రైతు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తేనే ఇన్సూరెన్స్ నష్టపరిహారం అమలు జరుగుతుందని మంత్రి దాటవేసి రైతుకు అన్యాయం చేస్తున్నారనీ విమర్శించారు. వాస్తవానికి రైతు నష్టపోయారని ఎట్టి పరిస్థితుల్లోని రైతును ఆదుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ కట్టిన కట్టకపోయినా రైతులకు బాసటగా నష్టపరి హారాన్ని చెల్లించాలని తోట డిమాండ్ చేశారు. మండపేట నియోజకవర్గంలో నష్ట తీవ్రతను వ్యవసాయ అధికారులు, రెవెన్యూ, గ్రామ వీఆర్వోలు పర్యవేక్షిస్తున్నప్పటికి పూర్తి స్థాయిలో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చాయని తోట తీవ్రంగా విమర్శించారు. ఇన్సూరెన్స్ కట్టినా కట్టకపోయినా రైతులకు న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఉపయోగపడే విధంగా సర్వేలు ఉండాలన్నారు. రైతులు నష్టపోయే విధంగా అంచనాలు ఉండకూడ దన్నారు. నష్టపోయిన రైతులు సచివాలయాలు, పంచాయితీలకు కాగితాలను తీసుకొచ్చిన వాళ్లకు మాత్రమే నష్టపరిహారం ఇస్తారని చెబుతున్నారని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని తోట తీవ్రంగా మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిడ్డిటిసికుడిపూడి భవాని రాంబాబు, జిల్లా వైసిపి పార్టీ ఉపాధ్యక్షులు దూలం వెంకన్న బాబు, మండల వైసిపి కన్వీనర్ అడబాల బాబ్జి, రాష్ట్ర వైసిపి యువజన విభాగ సెక్రటరీ వాసిరెడ్డి అర్జున్, మండల వైసిపి మాజీ కన్వీనర్ పిల్ల వీరబాబు, అద్దంకి వెంకటరమణ, పాలతోడు సర్పంచ్ పిల్ల అరవరాజు, సుదర్శనం శ్రీవేంకట గోపాల్, కోళ్ళ శ్రీను, యారమటి వెంకన్న బాబు పాల్గొన్నారు.



# అరటి, వరి రైతులను ఆదుకుంటాం..

### రావులపాడులో పంట నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండారు

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫానుతో దెబ్బతిన్న అరటి, వరి, ఉద్యాన, కూరగాయల పంటల రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు. రావులపాలెం మండలం రావులపాడులో గురువారం ఆయన తుఫాను కారణంగా నష్టపోయిన అరటి తోటలను పరిశీలించారు. అరటి రైతులతో మాట్లాడారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క అరటి చెట్టుకు రూ.200 వరకు పెట్టుబడి ఖర్చులు అవుతున్నాయని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. చెట్లు పడిపోవడంతో పూర్తిగా నష్టపోయామన్నారు. వారి ఆవేదన విని ఎమ్మెల్యే బండారు చలించిపోయారు. తక్షణమే నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందే విధంగా నమోదు కార్యక్రమం చేపట్టాలని వ్యవసాయ అధికారులను, సిబ్బందిని ఆయన ఆదేశించారు. అరటికి ఎకరాకు రూ. 14వేలు, వరికి ఎకరాకు రూ. 8వేలు, కూరగాయల పంటలకు రూ. 10వేలు నష్టపరిహారంగా ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన రైతులకు తెలియజేశారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం తుఫాను గాలులకు పడిపోయిన వరి పొలాలను పరిశీలించారు.

ఒమ్మంగి గ్రామంలో

## పలు కుటుంబాలకు ముదునూరి పరామర్శ

**నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందించిన మురళీరాజు..**



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఒమ్మంగి గ్రామంలో ఇళ్లు కూలి నిరాశ్రయులైన పలు కుటుంబాలను నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు వైసిపి నాయకులు ముదునూరి మురళి కృష్ణంరాజు పరామర్శించారు. మొంథా తుఫాను కారణంగా ఒమ్మంగి గ్రామంలో ఇల్లు కోల్పోయిన మూడు కుటుంబాలను ఆయన పలకరించారు. గ్రామానికి చెందిన గోపు, కాపు, బాబ్జికి చెందిన పెంకుటిల్లు కూలిన నేపథ్యంలో ఆ కుటుంభానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయంతోపాటు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను మురళీ రాజు అందించారు. ఇదే గ్రామానికి చెందిన చుక్కల తాతారావుకి చెందిన పెకుటిల్లు కూలడతో దానిని పరిశీలించారు. వారికి బియ్యం, నిత్యావసర సరుకులతో 5 వేలు రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల కాలుకి గాయమై మంచాన పడ్డ షేక్ సత్తిబాబును పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ముదునూరి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తుఫాను కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చేతికొచ్చిన పంట నేల పాలవ్వడంతో అభాగ్యులైన రైతులను ప్రభుత్వం వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రచారానికి పరిమితం కాకుండా బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని ముదునూరి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గొళ్ల సుధాకర్, సీద్రపు భాస్కరరావు, నానిపల్లి చంటి, గటా గంగబాబు, కోలా తాతబాబు బోలు నాగేశ్వరరావు, తోలేటి శేఖర్, గంట లచ్చబాబు, నార్లంక వెంకన్నబాబు, ముమ్మిడి వీరబాబు, మిత్తన వీరబాబు, దారా నూకరాజు, సుంకర తమ్మారావు, గంట చిట్టిబాబు, ముద్దా జోగారావు, సుంకర దొంగయ్య, నూకల తాతబాబు, కూరాడ వీరబాబు, షేక్ సత్తిబాబు, పోలుమతి చిన్ని పలువురు మురళి రాజు, అభిమానులు పాల్గొన్నారు.

అన్నదాతలు కలత చెందకండి..

## కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది..

**తడిసిన ధాన్యమూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**
**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి హామీ**



**కాకినాడ రూరల్ /కరప, విశ్వ వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంతో కరప మండల వ్యాప్తంగా భారీ వర్షాలు, గాలివానలు బీభత్సం సృష్టించాయి. పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, యండమూరు, జీ భావారం, సిరిపురం, వేళంగి, కూరాడ, పెద్ద కొత్తూరు, వాకాడ, వేములవాడ, కరప, పెనుగుదురు, కొరిపల్లి, జెడ్ బావారం, అరట్లకట్ట తదితర గ్రామాల్లో పంట పొలాలు నేలమట్టమయ్యాయి. మండలంలో 23 గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి నీట మునిగిన పంటపొలాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని ఆయన పిలుపునిచ్చారు. తడిసిన ధాన్యమూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. క్రాప్ట్ ఇన్సూరెన్స్ చేసుకున్న రైతుల వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కరప మండలంలో మొత్తం 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగులో ఉండగా, వాటిలో సుమారు 3,500 ఎకరాల్లో పంటలు పడిపోయినట్లు గుర్తించామని తెలిపారు.ప్రస్తుతం పంటలు గింజ గట్టిపడే దశ నుండి పాలు నిండే దశ వరకు ఉన్నాయని, ఈ దశలో తుఫాను వల్ల భారీ నష్టం సంభవించిందని చెప్పారు. ముఖ్యంగా సిరిపురం, జెడ్ బావారం గ్రామాల్లో నష్టం తీవ్రంగా నమోదైందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనలు పూర్తి చేసి, రైతులకు తగిన సహాయక చర్యలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే 18 ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అన్నదాతలు కలత చెందవద్దని,కూటమి ప్రభుత్వం రైతుల అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్శనలో మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి, మద్దూరి స్వామి, గండి వెంకటేశ్వరరావు, చీపురుపల్లి జయేంద్ర బాబు, పంపన కన్నారావు, పులపకూర శుభ మహేష్, కొమరిశెట్టి నరసింగ రావు,అనుకుల రాంబాబు, పేపకాయల సత్తిబాబు, ఆట్ల గోవిందరాజు, వనుం నారాయణరావు, గొల్లపల్లి బుజ్జి, పలివెల జానకీరామయ్య, గంధం లక్ష్మీనారాయణ, గంటా వీరన్న చౌదరి, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, పుణ్యమంతుల అన్నవరం, జోకా అప్పలరాజు, గండి బుజ్జి, జెల్దాని నూకరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## తుఫాన్ భాదితులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే పంతం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం ఉప్పలంక గ్రామంలో మొంథా తుఫాన్ బాధితుల సహాయార్థం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిత్యా వసర సరుకుల (50 కేజీల రైస్ బ్యాగ్, కందిపప్పు 1.కేజీ, పామ్ ఆయిల్ 1 లీటర్, ఉల్లిపాయలు 1 కేజీ. బంగాళా దుంపలు 1 కేజీ, పంచదార 1 కేజీ) కిట్లను 840 మంది మత్స్యకార కుటుంబాలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, చిక్కాల రామచంద్రరావు, నూరుకుర్తి వెంకటేశ్వరరావు, రంభాల వెంకటేశ్వర రావు, పితాని లీలా, ఖాదీ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాస్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోటి దిపోత్సవం, సహస్ర లింగార్చన

## విజయవంతం చేయండి : వెలుగుల నాని



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రతిపాడులో డిసిసిబి బ్యాంకు సమీపంలో గురుభవాని పత్రి రమణ ఆధ్వర్యంలో నవంబర్ 3, సోమవారం జరగబోయే కోటి దిపోత్సవం, సహస్ర లింగార్చన కార్యక్రమాలను హిందూ భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని కోరారు. ఈ సందర్భంగా నాని కోటి దీపోత్సవ కమిటీతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పరిసర ప్రాంతాలలో ఎక్కడా జరిగిన విధంగా జరుగుతున్న ఈ మహా యజ్ఞంలో మాలాధారణ భక్తులతో పాటు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్తీక దామోదరుని ఆశీస్సులు పొందాలన్నారు.వేద మంత్రాల నడుమ జరిగే ఈ పుణ్య కార్యక్రమానికి కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో గానాల గంగాధర్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వాములకు ఫ్యాన్లు బహుకరణ

**కరప మాజీ సర్పంచ్ తాతీల కోరిక మేరకు**

**కాకినాడ రూరల్/కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ ఉప్పాలమ్మ అమ్మవారి గుడి వద్ద అయ్యప్పస్వామి పీఠం ఏర్పాటు చేసుకున్న స్వాములకు రాత్రి వేళల్లో పడుకోవడానికి ఇబ్బందిగా ఉండటంతో మరియు దోమల ఎక్కువగా ఉండటంతో నక్క సాంబయ్య స్వామి కరప మండలం ప్రజా సేవకుడు మరియు మాజీ సర్పంచ్ అయిన తాతీలుకు స్వాములకు ఫ్యాన్లు కావాలని అడగగా వెంటనే స్పందించిన ఆయన కోనసీమ జిల్లా రామచంద్రపురంనికి చెందిన హెూల్ సేల్ కాయగూరలు వ్యాపారస్తుడైన మౌళికి ఫ్యాన్ల కోసం తెలియజేసిన వెంటనే, తాతీలు కోరిక మేరకు నాలుగు ఫ్యాన్లను స్వాములకు బహుమానంగా ఇవ్వడం జరిగింది.. స్వామిలందరూ తాతీలుకు మౌళికి ధన్యవాదములు తెలిపారు.

# కాకినాడ జిల్లాలో మొంథా ఆస్థి నష్టం రూ.19 కోట్లు

**జిల్లాలో 16,000 హెక్టార్లలో వరి పంట నష్టం - ఇందులో ఏలేరు నీటి వల్ల 6,000 హెక్టార్లలో నష్టం**
**కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సాగింది - కలెక్టర్ వెంట ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ**



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను కారణంగా కాకినాడ జిల్లాలో దాదాపుగా రూ. 18 నుంచి 19 కోట్ల మేరకు ఆస్థులకు నష్టం సంభవించినట్టు ప్రాథమిక అంచనా వేసామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ప్రకటించారు. అయితే మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయి నష్టాన్ని లెక్కిస్తా మన్నారు. ఈ మేరకు జిల్లాలోని రెవిన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బంది పంట నష్టం అంచనాలను లెక్కిస్తారని ఆయన వెల్లడించారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలంలోని ఎగువ ప్రాంతాల నుంచి ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలోకి భారీగా చేరుతున్న నీటిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలిసి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం పరిశీలించారు. ఏలేరు జలాశయంలో ప్రస్తుత నీటి మట్టం, ఎగువ నుంచి జలాశయంలోకి చేరుతున్న నీరు, దిగువకు విడుదల చేస్తున్న నీటి వివరాలు, ఏలేరు జలాశయం పరివాహక ప్రాంతంలోని కాలువల పరిస్థితి గురించి జలాశయం ఇంజనీర్లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులు, ప్రజలు, పాత్రికేయులతో మాట్లాడారు. మొంథా తుఫాను కారణంగా జిల్లా మొత్తం మీద దాదాపుగా పంట పూర్తయిన 16,000 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందులో ఒక్క ఏలేరు జలాశయం నుంచి దిగువకు మూడు రోజులుగా విడుదల చేస్తున్న నీటి వల్ల దాదాపుగా 6,000 హెక్టార్లలోని వరి పంట దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా వేసామని ఆయన వెల్లడించారు. మొంథా తుఫాను కారణంగా మన్యంలోని రంపచోడవరం, అడ్డతీగల, ఒమ్మంగి ఇతర గిరిజన ప్రాంతాల్లో పడ్డ వర్షపు నీరు ఏలేరు జలాశయానికి అధిక మొత్తంలో చేరుతోంది అన్నారు. దీనితో జలాశయం నీటి మట్టం దాదాపుగా 22,000 క్యూసెక్కులకు చేరుకుంది. దీంతో దిగువకు అదనపు నీటినీ విడుదల చేయాల్సిన అత్యవసరం ఏర్పడింది. ఈ విధంగా ఏలేరు జలాశయం నుంచి నేడు 6000 నుంచి 7,000 క్యూసెక్కుల వరకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నా మన్నారు. ఫలితంగా నీటి ఉధృతికి ఎక్కడన్నా కాలువలకు గండి కొట్టాల్సి వస్తే పంట కాలువల గట్లకే గండి కొడతామే తప్ప నీరు గ్రామాల్లోకి, ఇళ్లలోకి నీరు చేరకునేలా గండ్లు కొట్టమని స్పష్టం చేశారు. అందుకు తగిన పటిష్ట చర్యలను చేపట్టామన్నారు. నిత్యం ఎప్పటికప్పుడు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షిస్తూ తగు జాగ్రత్తలను తీసుకుంటున్నారు అన్నారు. దీనిపై రైతులు, ప్రజలు ఆందోళన చందాల్సిన పనిలేదని, ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తతో వ్యవహరిస్తూ అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. ఇలా ఏలేరు జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో కిర్లంపూడి, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట కాలువల్లోని వర్షపు నీరు రోడ్ల పైకి చేరుకుంది అన్నారు. అందువల్ల ఈ ఒక్క ఏలేరు జలాశయం నుంచి దిగువకు విడుదల చేస్తున్న నీటి వలననే దాదాపుగా 6,000 హెక్టార్లలోని వరి పంట దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనాకు వచ్చామని ఆయన వెల్లడించారు. ఈ ఏలేరు నీటి ప్రవాహ పరిస్థితికి అదనంగా మరో పక్క జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పంట, మురుగు నీటి కాలువలు అన్నీ నీటితో నిండుకుని ఉన్నాయి. దీని వల్ల జిల్లాలో నాలుగు ప్రధాన రోడ్లు, కొన్ని పంట కాలువల గట్లకు కూడా గండ్లు పడ్డాయని, ఏతా వాతా జిల్లా మొత్తం మీద మొంథా నష్టం రూ. 18 నుంచి 19 కోట్లు ఉంటుందని ప్రాథమిక అంచనా వేసామన్నారు.

**ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం : సత్యప్రభ**

ఏలేరు పరివాహక ప్రాంత రైతులకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జలాశయం నుంచి క్రమం క్రమంగా దిగువకు నీటిని విడుదల చేయడం జరిగుతుందన్నారు. ఈ జలాశయం లోకి ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ దిగువ నున్న రైతులను ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు అన్నారు. దీని ద్వారా ఎక్కడ సమస్యలు తలెత్తుతకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్తిపాడు, కిర్లంపూడి.. దివిలి మీదుగా పెద్దాపురం మండలం కాండ్ర కోట గ్రామంలోని దబ్బా కాలువ బ్రిడ్జ్ వద్ద నీటి ప్రవాహాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, జల వనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోపీనాథ్, డీఈలు ఎ.రవికుమార్, ఎ.జనార్ధన్, కె.శ్రీకాంత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు జనసేన ఆర్ధిక సహాయం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజవర్గం శంఖవరం మండలం కొండగౌరంపేట, కత్తిపూడి గ్రామాల్లో మొంథా తుఫాన్ బారీ వర్షం కారణంగా నివాస గృహాలు కూలిపోయిన బాధితులకు జనసేన పార్టీ ఆర్థిక సహాయం అందించింది. కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆదేశానుసారం ఆ పార్టీ తరఫున ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన నాయకులు, విజయవాడ రైల్వే డివిజన్ వినియోగదారుల సలహా మండల సభ్యులు గొర్లి నాగేశ్వరరావు తన సొంత సొమ్ములతో గురువారం ఉదయం ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. మంగళవారం నాటి మొంథా తుఫాన్ విలయానికి మండపం పంచాయితీ కొండ గౌరంపేటలో చాగంటి రాజలక్ష్మి, సత్యనారాయణ దంపతులు అద్దెకు ఉంటున్న ఇల్లు కాస్తా ముంథా తుఫాను కారణంగా కూలిపోయింది. అలాగే మండపం గ్రామంలో సిద్ధాంతపు సత్తిబాబు నివాసం ఉంటున్న పూరిపాక కూడా పూర్తిగా మొంథా తుఫానుకు పూర్తిగా శిధిలమైనది. దీంతో ఆ కుటుంబం ఇంట్లోని సర్వస్వం కోల్పోయారు. కత్తిపూడి గ్రామంలో కొజ్జారపు చందయ్య, వాడపర్తి అప్పారావుల రెండు కుటుంబాలు నివాసం ఉంటున్న పెంకుట్లి కూడా కూలిపోయి నిరాశ్రయులు అయ్యారు. ఈ మూడు ఊళ్లలోని నాలుగు కుటుంబాలకూ వారి ఇళ్ళ వద్దకే గొర్లి నాగేశ్వరరావు గురువారం కలిసి వెళ్ళి ఒక్కో కుటుంబానికి రూ. 1,500 విలువ చేసే 26 కేజీల బియ్యం బస్తాలను, కొంత మొత్తంలో నగదును తన వ్యక్తిగత సాయంగా ఆయా గ్రామాల జనసేన నాయకుల సమక్షంలో అందించారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి నల్లల రామకృష్ణ, కాకినాడ జిల్లా టెలికమ్యూనికేషన్ సలహా మండలి సభ్యులు మేకల కృష్ణ, పార్లమెంటరీ కమిటి సభ్యులు రావూరి వెంకటేశ్వరరావు, మండపం జనసేన నాయకులు పోలం వెంకటరత్నం, వేల్పుల నరసింహమూర్తి, చాగంటి అప్పారావు, నక్కా నాగేశ్వరావు, వేల్పుల నాగబాబు, ఊటుకూరి రంగా, దాసరి శ్రీను, గుండిబిల్లి నూకరాజు, కత్తిపూడి జనసేన నాయకులు బొజ్జ చిన్నా, జీలకర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులను ఆదుకోవాలి

**ఏపీ కౌలు రైతు సంఘం అధ్యక్షులు వళ్ళు రాజబాబు**

**తాళ్ళరేవు/కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాజులూరు మండలం, తాళ్లరేవు మండలాలలో భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులను భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వళ్ళు రాజబాబు శీలలంక కాజులూరు సేదువాడ గ్రామాలు పర్యటించి ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్వర్ణ రకం నేల వాలిందని 13 18 రకం ఇంకా పొట్ట దశలో అక్కడక్కడ ఈనిక దశలో ఉన్నపొలాలు బాగా దెబ్బతిన్నాయని అన్నారు. ఇప్పటికే ఎకరానికి 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి రైతుల గగ్గోలు పెడుతున్నటువంటి రైతులకు ఈ ప్రకృతి నష్టాలు అప్పుల పాలు చేసే విధంగా ఉన్నాయని ప్రభుత్వం ఇటువంటి పరిస్థితుల్లో పంట నష్టం అంచనా వేసి ప్రతి సాగుదారునికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్డుతో సంబంధం లేకుండా కులంతో సంబంధం లేకుండా ప్రతి కౌలు రైతులు నమోదు చేసి పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి ఇన్సూరెన్స్ కూడా వచ్చే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు మరో 15 రోజుల్లో పంటలు కోతకు వచ్చే పరిస్థితి ఉన్న కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు మరియు సంచులు తగిన సిబ్బంది ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాజులూరు శీలలంక రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వళ్ళు రాజబాబు శీలలంక కాజులూరు సేదువాడ గ్రామాలు పర్యటించి ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్వర్ణ రకం నేల వాలిందని 13 18 రకం ఇంకా పొట్ట దశలో అక్కడక్కడ ఈనిక దశలో ఉన్నపొలాలు బాగా దెబ్బతిన్నాయని అన్నారు. ఇప్పటికే ఎకరానికి 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి రైతుల గగ్గోలు పెడుతున్నటువంటి రైతులకు ఈ ప్రకృతి నష్టాలు అప్పుల పాలు చేసే విధంగా ఉన్నాయని ప్రభుత్వం ఇటువంటి పరిస్థితుల్లో పంట నష్టం అంచనా వేసి ప్రతి సాగుదారునికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్డుతో సంబంధం లేకుండా కులంతో సంబంధం లేకుండా ప్రతి కౌలు రైతులు నమోదు చేసి పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి ఇన్సూరెన్స్ కూడా వచ్చే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .మరో 15 రోజుల్లో పంటలు కోతకు వచ్చే పరిస్థితి ఉన్న కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు మరియు సంచులు తగిన సిబ్బంది ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాజులూరు శీలలంక రైతులు పాల్గొన్నారు.

## ఈవీఎంల భద్రతకు చర్యలు : జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈవీఎం, వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రెవిన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ,ఎన్నికల శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం గోదాము భద్రతను తనిఖీ చేసి, నివేదిక పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటి ఎం.జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఐక్యత ర్యాలీ



**కాకినాడ సిటీ, విశ్వంవాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ కాకినాడ ఆధ్వర్యంలో నవంబర్ 17న ఉక్కుమని షిగా పిలవబడే భారత దేశాని ఒక ఐక్యత వేదికగా కలిపిన మహాను భావుడు దేశభక్తుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఐక్యత ర్యాలీకి సంబంధించిన ప్రెస్‌మీట్ మై భారత్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ శ్రీ టీ గోపి మాటలాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతినీ పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా ఐక్యత పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని ఈ పాదయాత్ర టౌన్ రైల్వేస్టేషన్ నుండి ప్రారంభం అయి మహిళా డిగ్రీ కలశాల వరకు ఉంటుందని ఈ ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశం యువతని ఐక్యం చేయడం మరియు యువతలో దేశభక్తి నీ నింపడం అని అన్నారు. ఈ పాదయాత్రలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు ఉదయశ్రీనివాస్ మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ శ్యామ్ మరియు ప్రోగ్రామ్ కన్వీనర్లు పాపారావు, సాయికుమార్, వీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హితకారిణి ఛైర్మన్‌గా డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్

**డైరెక్టర్‌గా గుణ్ణం శ్యామ్ సుందర్ - సిటీలో కూటమి నేతల ఐక్యతకు నిదర్శనం ఎండోమెంటు కమిటీలు**
**పుష్కరాల నాటికి దేవస్థానాలు అభివృద్ధి చేసి భక్తులకు సదుపాయాలు కల్పించాలి**
**వ్యక్తిగతంగా పేరు తెచ్చుకోవాలి - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి సిటీలో ప్రతిష్టాత్మక హితకారిణి సమాజం ట్రస్టు ఛైర్మన్‌గా డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్ నియమితులయ్యారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ప్రకటించారు. తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో గురువారం కమిటీలను ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఛైర్మన్లతో పాటు కూటమిలోని టీడీపీ జనసేన బీజేపీ వారితో మొత్తం 11 మంది వంతున సభ్యులను నియమించామని చెప్పారు. రాజమండ్రి నగరంలోని 14 ఎండోమెంటు కమిటీలు ఉండగా ఇంతవరకు 12 కమిటీలు వేశామని, త్వరలో చందా సత్రం, శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం ఛైర్మన్లు, సభ్యులను నియమిస్తామని ఆయన తెలిపారు. రాజమండ్రి క్షేత్రపాలకుడు శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఛైర్మన్‌ను నియమించినా పునః పరిశీలనకు వెళ్ళిందని ఆయన వివరించారు. ఇప్పుడు నియమించిన ఈ రెండు కమిటీలు నవంబరులో ప్రమాణ స్వీకారం చేస్తాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనివిధంగా ముందుగా రాజమండ్రి సిటీలో ఎండోమెంటు కమిటీలను వేసుకోవడం జరిగిందని, కూటమిలోని టీడీపీ జనసేన బీజేపీ నాయకులంతా ఐకమత్యంతో, సఖ్యతతో ఒకే మాటమీద ఉండడంతో ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. ఈ కమిటీల నియామకంలో సహకరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేన సిటీ ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీను, టీడీపీ కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఎండోమెంటు కమిటీలు వేస్తున్నామని, దేవస్థానాలు అభివృద్ధి చేసి, వాటి ఆస్తులను పెంచాలని, పుష్కర యాత్రికులు, భక్తులకు సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. తద్వారా ఛైర్మన్లు, సభ్యులు వ్యక్తిగతంగా కూడా బాగా చేశారనే విధంగా మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

**హితకారిణి సమాజం సభ్యులు వీరే :**

ఆదిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, మేడపాటి సాయి భాగ్యలక్ష్మి, కూచర్లపాటి లలితారాణి, గుణ్ణం శ్యామ్ సుందర్, చెరుకుమల్లి అనంత సత్య నాగవల్లి, కొడమళ్ళ శ్రీనివాసరావు, మంచెం విజయకుమార్, తణుకు శేషు కుమారి, కిలారి వెంకట నాగలక్ష్మి ఉన్నారు.

## నిడిగట్లలో వరి పంటలను

# పరిశీలించిన బత్తుల

### నష్టపరిహారాన్ని అంచనా వేయండి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని నిడిగట్ల గ్రామంలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి ఉద్యాన పంటలను రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పరిశీలించి బాధిత రైతులకు సకాలంలో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నిడిగట్ల గ్రామంలోని మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను, ఉద్యాన పంటలను సందర్శించి, ఆయా రైతులను ఓదారుస్తూ ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఆందోళన చెందొద్దని వారికి భరోసా కల్పించారు. రైతులు పూర్తి పెట్టుబడి పెట్టి అహర్నిశలు శ్రమించి, పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవడం చాలా బాధాకరమన్నారు. మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన వరి, ఉద్యాన పంటలను అధికారులు సత్వరమే నమోదు చేసుకుని, ప్రభుత్వానికి నష్టపరిహార నిమిత్తం నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ మండలం వ్యవసాయ శాఖ అధికారులు, జనసేన, తెలుగు దేశం, బిజెపి పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి

# టీటీ జట్ల ఎంపిక పోటీలు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక టౌన్ హాల్ ఎదురుగా గల రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబర్ 2 తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి తూర్పు గోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించబడును. తూర్పు గోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి విటి వి.సుబ్బారావు తెలియజేశారు. అండర్ 15 బాల, బాలికలు, పురుషులు మరియు మహిళల విభాగాలలో ఈ పోటీలు నిర్వహించబడు నని, ఈ పోటీలలో ఎంపిక చేసిన జట్లు నవంబర్ 17 నుండి 20వ తేదీ వరకు విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో జరిగే అంతర్ జిల్లా రాష్ట్ర టేబుల్ టెన్నిస్ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటారని, ఈ జిల్లా పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ పేర్లను నవంబర్ 2 తేదీ ఉదయం 8:30కు లోపు తమ పేర్లను 9347586233 నంబర్‌కు తెలియజేయవలసిందిగా ఆయన కోరుచున్నారు.

## రైతులకు పంట పొలాల

# ఇన్సూరెన్సులు కూటమి ప్రభుత్వం చెల్లించలేదు

**మొంథా తుఫాన్‌తో పంట నష్ట రైతులను తక్షణమే ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చిన్నకొండేపూడి గ్రామంలో మొంథా తుఫాను వలన వారం రోజుల్లో చేతికి వచ్చే పంట నేలకొరిగి పూర్తిస్థాయిలో నీటిలో మునగడంపై రైతులు ఆవేదన చెందడంతో నేలకొరిగిన పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించి వైకాపా ప్రభుత్వం నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేంత వరకూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు నేటి కూటమి ప్రభుత్వం అండగా నిలబడాల్సిన అవసరం ఉందని అన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రైతులు ఇబ్బందులు పడకుండా గతంలో రైతులకు ఇన్సూరెన్స్ ప్రీమియంలు వైకాపా ప్రభుత్వం ప్రభుత్వమే చెల్లించేదని అన్నారు. కూటమి ప్రభుత్వం గడచిన 18 నెలల కాలంలో రైతులకు ఇబ్బందులు ఎదురవకుండా ఎలాంటి ఇన్సూరెన్స్ స్కీములు కట్టకుండా ఎత్తేయడం వలన నేడు రైతులు అయోమయం పరిస్థితిలో ఆవేదన చెందుతున్నా.. నేటి ప్రభుత్వం రైతులకు ఎలాంటి హామీ ఇవ్వడం లేదని రైతులను అన్ని విధాలుగా నష్టపరుస్తున్నారని రాజాబాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రబీ సీజన్లో రైతులు యొక్క దిగుబడులను కొనుగోలు చేయకుండా దళారులకు విడిచిపెట్టారని అన్నారు. దళారులకు 1000 నుంచి 1100కు అమ్ముకునే దుస్థితి రాజానగరం నియోజకవర్గంలో రైతులకు ఏర్పడిందని ఆరోపించారు. తుఫాను కారణంగా వారం రోజుల్లో చేతికొచ్చే పంట నీటిలో మునిగి నష్టపోయామని రైతులు ఎదురుచూస్తున్నారని ఎవరు వచ్చి ఆదుకుంటారో తెలియని దుస్థితిలో రైతుకి నేడు ఈ దుస్థితి ఎదురైందని అన్నారు. పంట నీట మునిగిన రైతులను ఆదుకునే దిశగా ఇన్ ఫుడ్ సబ్సిడీ,ఇన్సూరెన్స్ సబ్సిటీ వంటి మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే అన్నారు. రైతులను ఆదుకునే దిశగా ఎన్యూమరేషన్ ఒకరోజు మాత్రమే గడువుఇస్తే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన పంట రైతులందరినీ ఎంట్రీ చేయడానికి అవకాశం ఉండదని ఆ గడువుని ఇంకా కొన్ని రోజులపాటు పెంచాలని అన్నారు. నష్టపోయిన పంటలను పరిగణలోకి తీసుకోవడానికి పంట పొలాల్లో ఉన్న నీరు పూర్తిగా తగ్గడానికి సమయం ఉందనే విషయాన్ని నేటి నియోజకవర్గం కూటమి నాయకులు తెలుసుకోవాలని అన్నారు. 2019లో ఇదే కూటమి నాయకులు గ్రామానికి పది మందిని నష్ట పోయిన పంట పొలాల వీళ్లే రైతులు అన్నట్టుగా చూపించి దాంతో బాజాలు కొట్టుకున్న సందర్భాలు ఉన్నాయని అన్నారు. బురద కాలువ,పలు రకాల పంట కాలువల వలన ఇంకా పంట పొలాలు నీటిలోనే మునిగి ఉన్నాయనే విషయాన్ని పూర్తి స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలన చేపట్టాలని కోరుతున్నానని అన్నారు. నష్టపోయిన రైతులందరినీ పూర్తి స్థాయిలో ఎన్యూమరేషన్‌లో జాయిన్ అయ్యేలా చూడాలని అన్నారు. కౌలు రైతులు అప్పులు చేసి వడ్డీలు కడుతూ ఉన్నారని వారికి ఎలాంటి స్పష్టత కూటమి ప్రభుతో ఇవ్వలేదని అలాంటి వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరుతున్నానని అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 40 కోట్లకు పైబడి మైనర్ ఇరిగేషన్ సివిల్ స్ట్రక్చర్ మరియు మెకానికల్ వర్క్స్ మంజూరు చేసి టెండర్లకు పిలిచామని దాంతో వారు అసైన్ అవడం జరిగిందని ఈనాడు 18 నెలల కాలంలో పనులకు అడ్డుపడుతూ కాసుల కోసం కక్కుర్తి పడి కమిషన్లు ఇమ్మని చెప్పి ఇబ్బంది పెడుతున్నారని దాంతో పనులన్నీ ఎక్కడి కక్కడే ఆగిపోయిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. రివర్స్ పంపి స్కీం రాపాక బురద కాలువ రైతులకు శాశ్వత పరిష్కార దిశగా సదుద్దేశంతో రివర్స్ 100 కోట్లు టెండర్‌కు పిలిచామని నేటి కూటమి ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఏ పనులు చేయలేదని అన్నారు. దాంతో నేడు వేలాది ఎకరాలకు పంట నష్టం వాటిల్లిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే అది చేస్తాం.. ఇది చేస్తామని మాయ మాటలు చెప్పారు తప్ప పనులను పూర్తి చేసి ఉంటే నేడు అమాయక రైతులకు నష్టం వచ్చి ఉండేది కాదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు న్యాయం జరిగేంత వరకు రైతుల పక్షాన నిలబడి పోరాడతామని అన్నారు. ఒక్కొక్క ఎకరాకు 50 క్వింటాలు ధాన్యం దిగుబడి వచ్చేదని కొన్నిచోట్ల పూర్తిగా పంట మునగడంతో ఐదు క్వింటాలు కూడా రాని సందర్భాలు నేడు ఎదురయ్యాయని అన్నారు. వైకాపా ప్రభుత్వం తరఫున నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని, రైతులకు ఇన్సూరెన్స్ కట్టకపోవడంపై పూర్తి బాధ్యత తీసుకోవాలని రైతులకు గత ప్రభుత్వం అందించిన నష్టపరిహారం కంటే రెండింతలు అందించి రైతులను ఆదుకోవాలని జక్కంపూడి రాజా అన్నారు. ఈ కార్యక్రమంలో చేకూరి నాని, ఎంపీపీ గుర్రాల జోత్స్న,పెదపాటి రమేష్ (డాక్టర్ బాబు),మండల కన్వీనర్ గంటా శ్రీను,పిచ్చుకల విజయ్, మేడిశెట్టి తులసీరామ్, మనెల్లి వెంకట్రావు, ముదునూరి కిట్టయ్య, ముదునూరి సురేష్ రాజు, ముదునూరి ప్రసాద్ రాజు,కొల్లి చిరంజీవి, అంబటి రాజు,చెరుకూరి శ్రీను, బచ్చు మురార్జీ, ఎర్రంశెట్టి బాబులు తదితరులు పాల్గొన్నారు.

# శివరామ సుబ్రహ్మణ్యంను కలిసిన బర్రే కొండబాబు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీఐఐసి మాజీ ఛైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రిఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం తనయుడు చిరంజీవి యశ్వంత్, చిరంజీవి కుమారి యజ్ఞతకు రాజమండ్రి పురపాలక సంఘ మాజీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ బర్రే కొండబాబు ఆశీస్సులు అందించారు. ఈ నెల 26వ తేదీన భీమవరంలో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. కొన్ని అనువార్య కారణాలవల్ల కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన బర్రే కొండబాబు, ఏపీఐఐసి మాజీ ఛైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రిఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యంను ఆయన స్వగృహంలో బర్రే కొండబాబు మర్యాద పూర్వకంగా కలిసి నూతన దంపతులకు ఆశీస్సులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రిఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం మంచి మనసుతో ఆనందం వ్యక్తం చేశారు.

# సైబర్ నేరాలు, జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన

**సైబర్ నేరాలకు 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయండి**



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉదయం కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఏ.వెంకట రమణ అధ్యక్షతన తూర్పు గోదావరి జిల్లా పోలీస్ సైబర్ నేర విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు-జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.ఎస్.ఐ శివాజీ మాట్లాడుతూ నేడు సైబర్ నేరాలు పెరిగి పోయాయి అని వాటిపట్ల విద్యార్థులు అప్రమతంగా ఉండాలి అని సూచించారు. లోన్ యాప్,ఫెడ్ ఎక్స్ పార్సిల్ ఫ్రాడ్, గూగుల్ కస్టమర్ కేర్ నెంబర్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్,ఆన్లైన్ షాపింగ్, ఏ పికె ఫైల్ ఫ్రాడ్, కెవైసి ఫ్రాడ్, మల్టీలేవేల్ మార్కెటింగ్ స్కీమ్, హానీ ట్రాప్, ఏఈపిస్ మాత్ర మోనీ ఫ్రాడ్ మొదలగు రూపాల్లో ఫ్రాడ్ జరుగుతుందని తెలిపారు. ఇటువంటి సైబర్ నేరంకు సంబంధించి1930 నెంబర్ కు వెంటనే కాల్ చేసి నేరం వివరాలు తెలియజేయాలి కోరారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ గోపాలకృష్ణ, అమరేంద్ర, భవాని, రాణి, వెంకట లక్ష్మి, అధ్యాపకులు ఎస్‌కె అలీముద్దీన్, వివిస్ శేఖర్ బాబు, కె.పెద్దబ్బులు, వై.శివ కుమారి, సి.శాంతిసుధ, కె.వెంకటరావు, డి.భాస్కరరావు, ఎన్.కళ్యాణి దేవి, కె.గంగాధర్, బి.ఏసురత్నం, వై.రాజేష్‌బాబు, పి.సూర్య, పి.భాస్కరరావు, రాజ్యలక్ష్మి, రామాంజనేయరావు, ఉమాశంకర్, జి.అక్షయ జ్యోతి, టి.సుహాసిని, ఎ.జ్యోతి, ఆఫీసు సిబ్బంది మేఘన, తులసి, పుణ్యవతి లక్ష్మి, అమ్మాజీ తదితరులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధితులు అందరికీ ఎన్డీఏ ప్రభుత్వం దన్నుగా ఉంటుంది : బత్తుల



**ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ అప్రమత్తం**

**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఎన్డీఏ ప్రభుత్వం ఆదుకుంటుందని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బాధితులతో అన్నారు. గురువారం శ్రీరంగపట్నంలోని వరద ముంపు ప్రాంతాన్ని సందర్శించి, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లో నీరు చేరకుండా ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ఇసుక బత్తాలను దగ్గరుండి బత్తుల వెంకటలక్ష్మి అడ్డుకట్టగా వేయించారు. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా బాధితులను గుర్తించి పునరావాస కేంద్రానికి తరలించాలని, తాగునీరు, ఆహారం, పిల్లలకు పాలు అందించాలని అధికారులకు తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి సుమారు వెయ్యి, ఇసుక బత్తాలను ముంపు నివారణకు వినియోగించినట్లు తన్నీరు తాతాజీ, అతికిం శెట్టి కామరాజు తెలిపారు. రాజమహేంద్రవరం ఉత్తర మండల డిఎస్పి వై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు, ఎంపీడీవో అశోక్ కుమార్, తాసిల్దార్ సుస్వాగతం, రెవెన్యూ సిబ్బంది అప్రమతమై ముంపు నివారణకు ప్రతిష్ట చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెద్దమ్మజీ రమణ, అడ్డాల శ్రీను, తనకాల నాగేశ్వరరావు, పెనకటి రాంబాబు, పిల్ల సుందర్ సింగ్, పలువురు ఎన్డీఏ నాయకులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాబా ఆలయంలో భారీ అన్న సమారాధన



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శిరిడి నగర్‌లోని బాబా ఆలయంలో కార్తీక మాస శ్రవణా నక్షత్రం కార్తీక గురువారం పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున బాబా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం షిరిడినగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో ఉమా పార్వతీశం సరిత దంపతుల తనయుడు వంశీధర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస శ్రావణ నక్షత్రం రోజున ఏ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టిన కోటి కార్తీక సోమవారాల వ్రత ఫలం తక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద ఎత్తున వివిధ ఆలయాలను సందర్శించి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమా పార్వతీశం సరిత దంపతుల తనయుడు వంశీధర్ జన్మదిన పురస్కరించుకొని షిరిడి నగర్ బాబా ఆలయంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్, గరగ చంటి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేరళ జాతీయ మేజిక్ పోటీలకు

# న్యాయ నిర్ణేతగా స్టిక్ మనోహర్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మేజిక్ ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న ప్రముఖ మెజీషియన్ డాక్టర్ ఎస్.మనోహరరావు(స్టిక్ మనోహర్) కేరళ రాష్ట్రం అలెప్పిలో జరిగిన రెండవ జాతీయ మేజిక్ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. మలయాళీ మెజీషియన్స్ అసోంయేషన్ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం అలెప్పిలో ఈనెల 25,26 తేదీల్లో జరిగిన ఎంఎంఏ నేషనల్ మేజిక్ ఫెస్ట్-2025లో జూనియర్స్,సీనియర్స్ పోటీలకు స్టిక్ మనోహర్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.అలాగే ఈ కార్యక్రమంలో ఆయన మేజిక్ పై లెక్చర్ కమ్ డెమాన్ స్ట్రేషన్ చేశారు. కొత్త కొత్త మేజిక్ అంశాలను ప్రదర్శించారు. వాటిని తయారుచేసుకుని ప్రదర్శించే విధానాన్ని మెజీషియన్స్ అందరికీ అర్థమయ్యే విధంగా విపులంగా వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేరళ రాష్ట్ర మాజీ మంత్రి జి.సుధాకరన్, అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ ఆర్.కె.మళయాత్, చీఫ్ ప్యాట్రన్ సామ్రాజ్, అసోసియేషన్ ప్రెసిడెంట్ బినూ పట్టైల్, జనరల్ సెక్రటరీ జోసెఫ్ జీబా, మాయాన్ వైదర్ షా సమక్షంలో మనోహర్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఫెస్టివల్‌లో అసోసియేషన్ సభ్యులు, సుమారు 225 మందికి పైగా మెజీషియన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంకి చెందిన న్యాయవాదులు, మెజీషియన్లు, ప్రముఖులు మనోహర్ రావును అభినందించారు.

# స్వంత గృహం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం..

### కలెక్టరేట్‌లో డైరెక్టర్ ప్రియా సౌజన్య సమీక్ష



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి స్వంత గృహం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంకల్పబద్ధంగా ముందుకు సాగుతోందనీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ప్రియా సౌజన్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ప్రియా సౌజన్య గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా హౌసింగ్ ప్రధాన అధికారి కార్యాలయాన్ని సందర్శించి, గృహ నిర్మాణ సంస్థ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.బుజ్జి మరియు జిల్లా హౌసింగ్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. జిల్లాలో జరుగుతున్న గృహనిర్మాణ కార్యక్రమాలపై సమగ్ర వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రియా సౌజన్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన -గ్రామీణ (2.0) పథకం ద్వారా గృహనిర్మాణం వేగవంతం చేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రము మరియు రాష్ట్రం కలిసి పేదల సంక్షేమం దిశగా ఈ పథకం విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. అర్హులైన కుటుంబాలు తమ ప్రాంతంలోని గృహనిర్మాణ శాఖ ఏఈ కార్యాలయాలు లేదా గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల ద్వారా ఆవాస్ ప్లస్ యాప్‌లో దరఖాస్తులు సమర్పించ వచ్చని ప్రియా సౌజన్య వివరించారు. జిల్లాలో మూడు లక్షల గృహ ప్రవేశాలు పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గృహనిర్మాణం పేదల జీవన ప్రమాణాలను మార్చే దిశగా పెద్ద మలుపు తీసుకు వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన మూడు లక్షల గృహప్రవేశాల లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని హౌసింగ్ శాఖ వేగవంతంగా చర్యలు కొనసాగిస్తోందనీ జిల్లా హౌసింగ్ అధికారి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ బుజ్జి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,794 గృహాల లక్ష్యానికి 7,394 గృహాలు పూర్తై 69 శాతం పురోగతి సాధించామని తెలిపారు. మిగిలిన 3,400 గృహాలను నవంబర్ చివరినాటికి పూర్తి చేయడానికి అన్ని నియోజకవర్గాల హౌసింగ్ ఇంజనీర్లు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.బుజ్జి, కార్య నిర్వాహక ఇంజనీర్ సి.హెచ్. వేణుగోపాలస్వామి (కొవ్వూరు డివిజన్), రాష్ట్ర హౌసింగ్ జేఏసీ అధ్యక్షులు కె.ఎస్. చక్రవర్తి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం ఆదుకోకపోతే

# రైతులకు ఆత్మహత్యలే శరణ్యం : జక్కంపూడి

### ఇరిగేషన్ పనులు జాప్యంతో మరింత నష్టం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వమే ఆదుకోవాలని లేకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ఎన్డీఏ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం శ్రీరంగపట్నం గ్రామంలో తుఫాన్ కారణంగా బురద కాలువ పొంగడంతో గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు, వరదకు గురైన పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు అహర్నిశలు శ్రమించి పూర్తి పెట్టుబడి పెట్టి, పంట చేతికందే సమయంలో ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోవడం చాలా బాధాకరమన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు భరోసాగా పంటలకు బీమా ప్రభుత్వమే పూర్తిగా చెల్లించిందని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతుకు సకాలంలో నష్టపరిహారంతో పాటు ఇన్పుట్ సబ్సిడీ, రాయితీపై విత్తనాలు అందించిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వీటిని అన్నింటిని గాలికి వదిలేసి, 48 గంటల్లో అరకొర బాధితులను గుర్తించి తెదేపా కార్యకర్తలకు మాత్రమే నష్టపరిహారాన్ని అందించి చేతులు దులుపు కోవడానికి చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందే వరకు విశ్రమించమన్నారు. వైసిపి ప్రభుత్వంలో 40కోట్ల రూపాయలతో ఇరిగేషన్ పనులకు టెండర్లు పిలుచామని అయితే స్థానిక నాయకులకు పర్సంటేజ్ కుదరకపోవడంతో తీవ్ర జాపం జరిగిందని, అదేవిధంగా కోరుకొండ, సీతానగరం మండలాల్లో వరి పొలాలు ముంపుకు గురి కాకుండా బురద కలువ ముంపు నివారణకు 100కోట్ల రూపాయలతో రివర్స్ పంపింగ్ స్కీం నిర్మాణ పనులను అటకెక్కించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.గత మూడు రోజుల నుండి తుఫాన్ తీవ్రతను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరిస్తున్న, లోతట్టు ప్రాంతాలకు, పొలాలు ముంపుకు గురి కాకుండా చేపట్టిన చర్యలు నామమాత్రమని జక్కంపూడి అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి నాగేశ్వరరావు, వైకాపా నాయకులు నక్కా రాంబాబు, అడపా కనకరాజు, గణేషుల పోసియ్య, కొండపల్లి దుర్గారావు, బొరుసు బద్రి, కడియాల పాపారావు, సింగంపల్లి శ్రీనివాస్, సూరిశెట్టి సుబ్బలక్ష్మి,కోయిడాల నానాజీ, తనకాల నూకరాజు, దాడి రాంబాబు, బుద్ధ శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కాజులూరు మండలంలో

# పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

### మొంథా తుఫాన్‌తో రైతాంగం కుదేలు – 75 నుండి 80 శాతం వరకూ నష్టం

### మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్ర డైరెక్టర్ డాక్టర్ పివి సత్యనారాయణ



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫానుతో రైతులుకు తీవ్ర నష్టం జరిగిందని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్ర డైరెక్టర్ డాక్టర్ పి.వి.సత్య నారాయణ పేర్కొన్నారు. గురు వారం కాజులూరు మండలంలోని నామవానిపాలెం కోలంక గ్రామాల్లో తుఫాను కారణంగా నేలనంటిన వరి పొలాలను కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాల కులు విజయ కుమార్ మార్టేరు, పెద్దాపురం వరి పరిశోధన కేంద్రాల సైంటిస్టులతో కలిసి సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మార్టేరు వరి పరిశోధన కేంద్ర డైరెక్టర్ సత్యనారాయణ స్థానిక రైతులతో మాట్లాడుతూ గోదావరి ప్రాంతంలో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందని అయితే వాతావరణ పరిస్థితులు తట్టుకునే వరి వంగడాలను తాము అందిస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి కృష్ణా డెల్టాలో సుమారు ఐదు లక్షల 50వేల ఎకరాలలో, నూతనంగా రూపొందించిన ఎంటియు 13 18 రకాన్ని సాగు చేస్తున్నారన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో అధికంగా స్వర్ణ రకాల సాగు చేయడం వల్ల ప్రస్తుతం గింజ తోడుకునే దశలో ఉండగా ఈ అకాల వర్షాల వల్ల పంట అంతా నేలమట్టం అయిందని ఈ క్రమంలో సుమారు 75% నుండి 80% వరకు నష్టం కలిగిందని వివరించారు. స్థానిక అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి వెళ్లడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు వ్యవసాయ శాఖ కమిషనర్ సంయుక్తంగా రైతులకు అధిక ఆదాయం ఇచ్చే సన్న రకాలపై దృష్టి సారించి నూతన వంగడాల సృష్టించాలని కోరారన్నారు. ఈ ప్రాంతంలో అధిక దిగుబడిన సాధించే అవకాశం ఉందని ప్రతి రైతు నూతన వంగడాలపై దృష్టి సాధించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సేద్యం చేయాలన్నారు. ఈ ప్రకృతి వైపరీత్యాల నుండి తప్పించుకోవడానికి ప్రతి రైతు జూన్ నెలలో ఖరీఫ్ పనులు ప్రారంభించినట్లయితే నవంబర్ నెలలో కోతలు పూర్తవుతాయన్నారు. తదనంతరం రబీలో ఇబ్బందులు తగ్గుతాయిన్నారు. ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునే విత్తనాలను ఎంచుకోవాలన్నారు. మార్టేరు వరి పరిశోధన కేంద్ర డాక్టర్ శ్రీనివాస్ , వరి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గిరిజా రాణి, డాక్టర్ దయల్ ప్రసాద్ బాబు, డాక్టర్ సీతారాం శర్మ, డాక్టర్ రామభద్రరాజు, డాక్టర్ సుధీర్ కుమార్ కరప ఏడిఏ బాబురావు మండల వ్యవసాయ అధికారి అశోక్ కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాలరాజు మాజీ సహకార సంఘాల అధ్యక్షులు దంతులూరి వెంకట నరసింహ రాజు భూపతి రాజు రామచంద్ర రాజు బొండా వెంకన్న సహకార సంఘం అధ్యక్షులు బొండా వెంకట నరసింహనాయుడు పలువురు రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు.

# తుఫాను నష్టంపై అంచనాలు వేసి నివేదిక సమర్పించాలి

### సకల శాఖలను ఆదేశించిన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ తీవ్రత మూలంగా నష్టపోయిన వారికి తాత్కాలిక ఉపశమనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులను రానున్న మూడు రోజులలో పంపిణీ చేయాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మొంథా తుఫాన్ ఉపశమన చర్యలు పంట నష్ట అంచనాలు రూపకల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాలలో నిత్యవసర వస్తువులైన ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, కందిపప్పు, పామ్ ఆయిల్, పంచదారలు ప్యాక్ చేసి పంపిణీ చేయాలని, 25 కేజీలు, బియ్యం మాత్రం ప్రభుత్వ చౌక ధరల దుకాణాల నుండి పంపిణీ చేయాలన్నారు. గత ఐదు రోజులుగా చేపల వేట కోల్పోయిన మత్స్యకారులకు, చేనేత రంగ కార్మికులకు 50 కేజీల చొప్పున బియ్యాన్ని ఈ పాస్ ఎనేబుల్ పద్ధతిలో ఉచితంగా సరఫరా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పునరావాస కేంద్రాలలో సుమారు 30 వేల మంది వరకు ఆశ్రయం పొందారని, వీరందరికీ ఆర్థిక సహాయంగా కుటుంబానికి రూ. 3,000 ఒంటరి వ్యక్తులకు వెయ్యి చొప్పున అందించాలన్నారు. తీర ప్రాంత వ్యాప్తంగా 45 గ్రామాలలో సుమారు 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కేజీలు బియ్యం,జీవన భృతి కోల్పోయారనే ధ్రువీకరణతో సంబంధిత మత్స్య అభివృద్ధికారు లకు, అదేవిధంగా చేనేత జౌళి శాఖ ధ్రువీకరణతో చేనేత రంగ కార్మికులకు ఉచితంగా అందించాలన్నారు. మూడు రోజులలో తుఫాన్ ఉపశమన ప్రక్రియను సంబంధిత ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రారంభించి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఉపశమన పరిహారాలు అందించే ప్రక్రియలో స్థానిక తహశీల్దార్, ఎంపీడీవో సమన్వయం సహకారంతో పారదర్శకంగా బియ్యం నిత్యవసరాలు పంపిణీ చేయాలన్నారు. సముద్రపు తీర ప్రాంతంలో ఇతర జిల్లాల నుండి వలస వచ్చి తుఫాను మూలంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారుల జీవన భృతికి ఉచితంగా బియ్యం అందించాలన్నారు. వ్యవసాయ ఉద్యాన శాఖలు పంట నష్టాలను అంచనా వేసి లెక్కించడానికి బృందాలను నియమించాలని ఆదేశించారు. పంట నష్ట అంచనాలు శాస్త్రయుక్తంగా వ్యవసాయ శాస్త్రజ్ఞుల నిబంధనలు పరిగణన లోకి తీసుకొని లెక్కించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రాథమిక అంచనాగా సుమారు 31 వేల ఎకరాలలో వరి పంట దెబ్బ తిందని గుర్తించినట్లు తెలిపారు. రెవెన్యూ, గ్రామ వ్యవసాయ సహాయకులు వ్యవసాయ అధికారులు శాస్త్రజ్ఞుల ద్వారా బృందాలు నియమించి పంట నష్ట అంచనాలను రూపొందించాలన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు కౌలుదారులకు మాత్రమే పరిహారం అందేలా చూడాలన్నారు. తుఫాను నేపథ్యంలో పశు సంవర్ధక శాఖ 50% రాయితీతో పశు దాణా సరఫరా చేసేలా 800 టన్నులు సిద్ధం చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పశు వైద్యశాలలు తుఫాన్ డామేజ్ లను గణించాలన్నారు. అలాగే పశు ఔషధాలను గణించాలన్నారు. మత్స్య శాఖ ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు జెట్టీలు, హార్బర్ల డామేజ్ లను గణించాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ దెబ్బతిన్న గృహాల అంచనాలను గణించాలన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం వారు సి పి డబ్ల్యూ ఎస్, సింగల్ విలేజ్ స్కీముల ఓవర్ హెడ్ ట్యాంకులు పైప్ లైన్లు, జనరేటర్లు వంటి నష్టాలను గణించాలన్నారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారు డామేజ్ రోడ్లు వంతెనలు నిర్దేశిత ప్రొఫార్మాలో కిలోమీటర్ల వారీగా గణించాలన్నారు. పాఠశాల విద్యా శాఖ 47 పాఠశాలల్లో డ్యామేజీలను ఆటస్థలం కాంపౌండ్ వాల్‌తో సహా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఇంజనీర్ల ద్వారా అంచనాలు రూపొందించాలన్నారు. ఐసిడిఎస్ వారు అంగన్వాడీ కేంద్రాలు, అంగన్వాడీ కార్యాలయాల డామేజీ లపై నివేదికలు సమర్పించాలన్నారు. జలవనరుల శాఖ ఇంజనీర్లు లాకులు కాలువ గట్ల షట్టర్లు డామేజ్‌పై నివేదికలు రూపొందించాలన్నారు. డ్రైనేజీ శాఖ ఇంజనీర్లు డ్రైనేజీలలో పూడికతీత షట్టర్ల రిపేర్లు డామేజ్‌లను లెక్కించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పీహెచ్సీ సిహెచ్సి ఆరోగ్య కేంద్రాలు డామేజ్ లను విద్యుత్ శాఖ కరెంటు స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లు కండక్టర్లు డామేజీలను రూపొందించాలన్నారు. అధికారులు తమ హెచ్ఓడీలకు జిల్లా కలెక్టర్ వారికి నివేదించే అంచనాలు ఒకే విధంగా ఇటువంటి వ్యత్యాసాలకు తావు లేకుండా సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఐదు రోజులలో ఈ నివేదికలు రూపకల్పన చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కే.మాధవి పి.శ్రీకర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### సత్యదేవుని అన్నప్రసాదానికి

# రూ. 2.10 లక్షలు విరాళం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న సత్యదేవ నిత్య అన్నదాన పథకానికి ఓ దాత రూ. 2,10,000 లను విరాళంగా అందజేసారు. వేమగిరికి చెందిన పేరూరి శ్రీనివాసరావు తల్లి, తండ్రులు పేరూరి పాండురంగారావు, సావిత్రమ్మల పేరు మీద ప్రతీ ఏడాది తొలి ఏకాదశి రోజున అన్నదానం నిర్వహించాలని కోరుతూ దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావుకు విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఇఓ. సుబ్బారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్వో అనకాపల్లి ప్రసాద్, సూపరిం టెండెంట్ పప్పుల వెంకట రమణ ఉన్నారు.

### మొంథా తుఫాన్‌తో

# రైతులకు తీవ్ర నష్టం

### వరి పరిశోధన కేంద్రాల సైంటిస్టులు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫానుతో రైతులుకు తీవ్ర నష్టం జరిగిందని మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్ర డైరెక్టర్ పీఎం సత్యనారాయణ తెలిపారు.గురువారం రామచంద్రపురం మండలంలో చోడవరం గ్రామాల్లో ఇటీవల సంభవించిన తుఫానుకు నేలనంటిన వరి క్షేత్రాలను కోనసీమ వరి పరిశోధన కేంద్రాల సైంటిస్టులతో కలిసి సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగ మార్టేరు వరి పరిశోధన కేంద్ర డైరెక్టర్ సత్యనారాయణ స్థానిక రైతులతో మాట్లాడుతూ గోదారి ప్రాంతంలో అధిక దిగుబడిన సాధించే అవకాశం ఉందని,అయితే వాతావరణ పరిస్థితులు తట్టుకునే వరి వంగడాలను తాము అందిస్తున్నామని గోదావరి కృష్ణా డెల్టాలో సుమారు ఐదు లక్షల 50వేల ఎకరాలలో నూతనంగా రూపొందించిన ఎంటియు 13,18 రకాన్ని సాగు చేస్తున్నారన్నారు. ఉభయగోదావరి జిల్లాలో అధికంగా స్వర్ణ రకాల సాగు చేయడం వల్ల ప్రస్తుతం గింజ తోడుకునే దశలో ఉండగా ఈ అకాల వర్షాల వల్ల పంట అంతా నేలమట్టం అయిందని సుమారు 75 శాతం నుండి 80 శాతం వరకు నష్టం కలిగిందన్నారు. స్థానిక అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి వెళ్లడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కమిషనర్ సంయుక్తంగా రైతులకు అధిక ఆదాయం ఇచ్చే సన్న రకాలపై దృష్టి సారించి నూతన వంగడాల సృష్టించాలని కోరారన్నారు.ఈ ప్రాంతంలో అధిక దిగుబడిన సాధించే అవకాశం ఉందని ప్రతి రైతు నూతన వంగడాలపై దృష్టి సాధించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సేద్యం చేయాలన్నారు.ప్రస్తుతం రైతులు ప్రకృతి వైపరీత్యాలుతో అధికంగా నష్టపోతున్నారన్నారు.

# స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సేవలకు ఆరు వసంతాలు పూర్తి

### పోసికుమార్, సత్య సేవలు అభినందనీయం.. : బెన్నిబాబు


### సహకరించిన దాతలకు కృతజ్ఞతలు – నిర్వాహకులు ముత్యాల పోసికుమార్, సత్య



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం ఉదయం ధవలేశ్వరం గ్రామంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పోసికుమార్ సత్య దంపతుల ఆధ్వర్యంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆరవ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జియోన్ ఎడ్యుకేషనల్ కరస్పాండెంట్ సెక్రటరీ బెన్ని బాబు హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి వృద్ధులకు దివ్యాంగులకు నిరాశ్రయులకు యాపిల్స్, అరటి పళ్ళు,పానీయాలను దాతలు జై కుమార్ జయప్రద దంపతులు ఏర్పాటుచేసిన భోజనాలు సమర్పించారు. బెన్నీ బాబు మాట్లాడుతూ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పి ఎందరో నిరాశ్రయులకు, దివ్యాంగులకు వృద్ధులకు కరోనా కష్టకాలంలో ఇబ్బంది పడకుండా వారిని ఆదుకున్న ముత్యాల పోసి కుమార్ సత్య సేవలు అభినందనీయమని అన్నారు, నేటికీ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పి ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నన్ను ఆహ్వానించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోసి కుమార్ మాట్లాడుతూ 2019 వ సంవత్సరంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని తదుపరి. కరోనా కష్టకాలంలో ఎంతోమంది పేదలకు సహాయం అందించామని. నేటికీ సుమారు ఐదు సంవత్సరములుగా నిత్య అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా జరుగుతుందని దీనికి సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ట్రస్ట్ ఏర్పాటు చేయడంలో కానీ ట్రస్ట్‌కు నిరంతరం సహకరించిన బెన్నీ బాబు లాంటి వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కెవిఆర్ సాగర్, జియోన్ ఎడ్యుకేషనల్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, వృద్ధులు, దివ్యాంగులు, నిరాశ్రయులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలు చేయని అధికారులపై చర్యలు

### నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాచారహక్కు చట్టంను అమలు చేయని అధికారులపై తక్షణ చర్యలు ఉంటాయని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అధికారులకు హెచ్చరికలు జారిజేశారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో గార్డ్స్ ఫర్ ఆర్‌టిఐ ప్రతినిధులు గార్డ్స్ ఫర్ ఆర్‌టిఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు, జాతీయ మహిళా కన్వీనర్ ఆకుల విజయభారతి, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధరరావు కమిషనర్‌కు పుష్పగుచ్ఛము ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు కమిషనర్‌కు నగరపాలక సంస్థలో సహాచట్టం సక్రమంగా అమలు కావడం లేదని అధికారులు చట్టం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ నీరుకారుస్తున్నారని వివరించారు. సెక్షన్ 5(1), 5(2)ప్రకారం బహిరంగంగా ప్రదర్శించడం లేదని కమిషనర్‌కు మూల విసిరేసినట్టు ఉన్న పి ఐ ఓ బోర్డ్స్ ను చిత్రం ద్వారా చూపించారు. సహా చట్టం ప్రకారం సెక్షన్ 4(1)(బి) అధికారుల వద్ద లేదని పిర్యాదు చేశారు. సహా చట్టం కార్యకర్తలు ఈ విషయంపై ప్రశ్నిస్తే మాటల దూషణలకు పాల్పతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌టిఐ దరఖాస్తు వేస్తే పొంతనలేని సమాదానాలు ఇస్తూ సమాచార హక్కు చట్టం నిర్వీర్యం చేస్తున్నారని మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళి ధరరావు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ రాహుల్ మీనా తన రికార్డులో ఈ విషయాలు రాసుకున్నారు. సహా చట్టం నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటానని సహా చట్టంపై నిర్లక్ష్యం ఉన్న విషయాలు తన దృష్టికి తీసుకువస్తే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు.

### మొంథా తుఫానుతో నష్టపోయిన రైతును

# ప్రభుత్వాలు ఆదుకునేలా కృషి చేస్తాం..

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** గురువారం ఉదయం కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం చాగల్లు, కొవ్వూరు మండలా లలో ప్రాంతాలను బిజెపి నాయకులతో కలిసి బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా చాగల్లులో పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావంతో పంటలను నష్టపోయిన రైతులను కలవడం జరిగింది. మరో వారం రోజులలో చేతికి అందే పంటను తుఫాను ప్రభావంతో నష్టపోవడంతో రైతులు చాలా బాధలో కనిపించారు. వారికి ధైర్యాన్ని చెప్పి, నష్ట పోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని అందుకు మేము కృషి చేస్తాం అని భరోసా కల్పించాము. మొంథా తుఫాను'ను ముందుగా అంచనా వేసి నష్టాన్ని తగ్గించడానికి ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం తో కలిసి పని చేశారు. సమర్ధవంతమైన నాయకత్వం ఉంటే ఎంతటి ఉప్పెన'నైనా ఎదుర్కోవచ్చని ఈ సమన్వయం ఋజువు చేసిందని పిక్కి నాగేంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో చాగల్లు మండల బిజెపి అధ్యక్షులు తాళ్లూరి వరప్రసాద్, నాయకులు బోడపాటి ముత్యాలరావు, కరుటూరి జగదీశ్వరావు, దొంగా లక్ష్మీ నారాయణ, కుడప నాగరాజు, మాతు సత్యనారాయణ, బచ్చు నాగరాజు, శీలబోయిన శ్రీను, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# కర్ణాటక Vs కాంగ్రెస్ టీడీపీ..

## గూగుల్ వార్ కంటిన్యూ..



ఏపీలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు ప్రకటన తర్వాత దక్షిణ భారతదేశంలో ఇన్విస్టిమెంట్ రేస్ మరింత ఆసక్తికరంగా మారుతోంది. విశాఖలో రూ.1.36 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు గూగుల్ ప్రకటించిన వెంటనే.. ఈ విషయంలో వెనకబడిన సౌత్ ఇండియా రాష్ట్రాలు ఉలిక్కిపడ్డాయి. ముఖ్యంగా కర్ణాటక సిలికాన్ వ్యాలీ ఈ భారీ పెట్టుబడిని చేజార్చుకోవడంపై విస్తృత చర్చ జరిగింది. అయితే ఏపీకి గూగుల్ తరలిపోవడానికి ఆ రాష్ట్రం ఇచ్చిన భారీ రాయితీలే కార ణమని కర్ణాటక కాం గ్రెస్ చెబుతోంది. ఈ విషయమై తాజాగా కాంగ్రెస్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. దీనికి కౌంటరుగా ఏపీ టీడీపీ కూడా ట్వీట్ వార్ మొదలుపెట్టింది. గూగుల్ పెట్టుబడు లపై ఏపీలో రాజ కీయం దుమారం ఒక వైపు కొనసాగుతుండ ాగానే పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 1.80 లక్షల ఉద్యోగాలు కల్పించే గూగుల్ చేజారడంపై అక్కడి ప్రతిపక్షాలు ఆయా ప్రభుత్వాలను దుమ్మెత్తిపోస్తున్నాయి. తమిళనాడులో ఈ విమర్శలు ఒక విధంగా ఉంటే సిలికాన్ వ్యాలీ ఉన్న కర్ణాటకలో తీవ్ర రాజకీయ దుమారం కొనసాగుతోంది. ప్రతిపక్షం విమర్శల నుంచి తప్పించుకోవడం ఒక ఎత్తు అయితే, ఇటీవల తమ రాష్ట్ర ప్రభుత్వంతో ట్వీట్ వార్ కు దిగుతున్న ఏపీ మంత్రి లోకేశ్ జోరుకు బ్రేక్ వేయడమే లక్ష్యంగా కర్ణాటక కాంగ్రెస్ విమర్శలకు దిగుతోంది. ఏపీకి పెట్టుబడులు తరలివెళ్లిపోవడం, కర్ణాటకలో పారిశ్రామిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై కొద్ది రోజులుగా రెండు రాష్ట్రాల మంత్రుల మధ్య ట్వీట్ వార్ జరుగుతున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో మౌలిక వసతుల సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆ రాష్ట్రానికి చెందిన పారిశ్రామిక వేత్తలు తమ ట్విటర్ ఖాతాల్లో పోస్టులు చేస్తే, వారిని తమ రాష్ట్రానికి ఆహ్వానిస్తూ ఏపీ మంత్రి లోకేశ్ వెంటనే స్పందిస్తుండటం వివాదానికి కారణమవుతోంది. ఇది తమ రాష్ట్రానికి నష్టం చేస్తుందని కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే గూగుల్ పెట్టుబడి ప్రకటన కర్ణాటకకు మరింత మంట పుట్టించింది. ఈ నెల 14న గూగుల్ ప్రకటన వచ్చిన వెంటనే, ఈ ఘాటు పక్క రాష్ట్రాలకు మంట పుట్టిస్తుందని లోకేశ్ ట్వీట్ చేశారు. ఆయన అన్నట్లుగానే ఇప్పటికీ కర్ణాటక కాంగ్రెస్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు తాజాగా ఒక ట్వీట్‌లో గూగుల్ పెట్టుబడులపై అక్కసు వెళ్లగక్కింది. "కర్ణాటక గూగుల్‌ను కోల్పో లేదు. దానిని మరో రాష్ట్రానికి మళ్లించారు. ఉచితాలు, సబ్సిడీల ఆశచూపి దానిని పొందారు. మేము పెట్టుబడుల కోసం అభ్యర్థించం, అడుక్కోం'అంటూ ట్వీట్ చేసింది. అయితే, ఈ ట్వీట్ పై ఏపీ టీడీపీ కూడా ఘాటుగానే స్పందించింది. "ఏపీ పురోగతి కర్ణాటక కాంగ్రెస్ ఫేవరెట్ టాపిక్ అయిపోయింది. మన అభివృద్ధి వారికి కాస్త ఘాటు అనిపిస్తోంది" అంటూ తిప్పికొట్టింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సహకారంతో ఏపీ సర్కారు గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం పదేళ్లపాటు పన్ను రాయితీలను కల్పించింది. కేంద్రం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనకు ఒకే చెప్పడంతో అమెరికా వెలుపల భారీ పెట్టుబడి పెట్టేందుకు గూగుల్ రెడీ అయింది. అయితే ఈ పరిణామం రాజకీయంగా కాంగ్రెస్ సర్కారుకు ఇరకాటంగా మారడంతో ఇటు ఏపీ ప్రభుత్వంతోపాటు కేంద్రంలోని బీజేపీపై కర్ణాటక నేతలు విరుచుకుపడుతున్నారు.

# ఆ సీటు మీదనే జేడీ టార్గెట్... పార్టీ మాత్రం ?

అందుకే తన పదవీ విరమణకు ఎంతో కాలం ఉన్నా చేతిలో ఎంతో సర్వీసు ఉన్నా కూడా కేవలం 53 ఏళ్ళకే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు. జేడీ లక్ష్మీ నారాయణ అంటే అందరికీ తెలుసు. వీవీ లక్ష్మీనారాయణ అంటే ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఆయన ఒంటి పేరు వీవీ. అధికారిక హోదా కలిగిన జేడీయే అసలు పేరుగా స్థిరపడిపోయింది. సీబీఐలో సమర్ధవంతమైన అధికారిగా వ్యవహరించిన జేడీ లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలని ఎంతో ఉత్సాహపడ్డారు. అందుకే తన పదవీ విరమణకు ఎంతో కాలం ఉన్నా చేతిలో ఎంతో సర్వీసు ఉన్నా కూడా కేవలం 53 ఏళ్ళకే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు.

**ఫస్ట్ ఇంప్రెషన్‌లోనే :**

ఆయన 2019లో తొలిసారి విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేశారు. జనసేన నుంచి ఆయన పోటీ పడితే ఏకంగా రెండు లక్షల ఎనభై వేల దాకా ఓట్లు వచ్చాయి. ఇందులో జేడీని ఆరాధించి అభిమానిచిన యువత ఓటేసింది. అలాగే పవన్ కళ్యాణ్ ని అభిమానించే వారు కూడా తోడు అయి అంత భారీ ఎత్తున ఓట్లు దక్కాయి. అయితే జేడీ జనసేనలో కొనసాగి ఉండాల్సింది అని అంటారు. కానీ ఓటమి తరువాత ఆయన పార్టీకి రాజీనామా చేయడం ఆ మీదట 2024 ఎన్నికలకు ముందు జ భారత్ నేషనల్ పార్టీ పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేయడం ఇవన్నీ



రాజకీయంగా చేసిన కొన్ని ఇబ్బందికరమైన నిర్ణయాలుగానే అంతా చూస్తూ వచ్చారు. 2024 ఎన్నికల్లో తన సొంత పార్టీ మీద విశాఖ ఉత్తరం నుంచి పోటీ చేస్తే జేడీ బాగా వెనకబడిపోయారు.

**ఈసారి టార్గెట్ అదే :**

అయితే ఓటమి తరువాత కొన్నాళ్ళ పాటు విశాఖలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ మీద తన నిరసనను ఉద్యమాన్ని చేసిన జేడీ క్రమేణా విశాఖకు దూరంగా ఉంటూ వస్తున్నారు ఆయన వర్తమాన రాజకీయాన్ని రాజకీయ పార్టీల మనోగతాన్ని అర్థం చేసుకుని ఆ విధంగా తన రాజకీయాన్ని మలచుకోవడానికే ఈ గ్యాప్ తీసుకుంటున్నారు అని అంటున్నారు. ఆయన వచ్చే ఎన్నికల కోసం కూడా భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు అని అంటున్నారు. ఆయన టార్గెట్ అయితే విశాఖ నుంచి ఎంపీగా గెలిచి పార్లమెంట్ లో అడుగు పెట్టాలని. అది 2019లో జరగలేదు, ఆ ముచ్చట 2029లో తీర్చుకోవాలని జేడీ చాలా గట్టిగానే భావిస్తున్నారు అని అంటున్నారు.

**పార్టీ అదేనా :**

ఇక జేడీ ఏ రాజకీయ పార్టీలో చేరుతారు అన్నది మరో చర్చ. నిజానికి చూస్తే ఆయన ఇపుడు ఏ రాజకీయ పార్టీని విమర్శించడం లేదు అన్ని పార్టీల పట్ల పాజిటివ్ గానే ఉన్నట్లుగా కనిపిస్తున్నారు. అదే సమయంలో అన్ని అవకాశాలూ ఓపెన్ చేసి పెట్టుకున్నారు అని అంటున్నారు 2029 నాటికి మారే రాజకీయాన్ని గమనంలోకి తీసుకోవడం ద్వారా ఆయన ఏదో ఒక బలమైన రాజకీయ పార్టీలో చేరడం ద్వారా విశాఖ ఎంపీగా పోటీ చేసి కచ్చితంగా నెగ్గాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఇంతకీ జేడీ ఏ పార్టీ అంటే ఎవరూ ఇపుడు చెప్పలేరు, అయితే ఆయన సొంత రాజకీయం సొంత పార్టీ కథ మాత్రం ఇక మీదట ఉండకపోవచ్చు అని పవర్ ఫుల్ పార్టీలోనే చేరడం ద్వారా తన ఆకాంక్షను నెరవేర్చుకుంటారు అని అంటున్నారు. అది జాతీయ పార్టీనా లేక ప్రాంతీయ పార్టీనా అంటే ఇప్పటికైతే సస్పెన్స్ అని అంటున్నారు. చూడాలి మరి జేడీ అడుగులు ఎటు పడతాయో ఆయన రాజకీయం రూట్ ఏ వైపు సాగుతుందో.

# వైసీపీ ఒంటరితనం... ఆశలు పెంచుతోందా?



దేశంలో అనేక పార్టీలు వచ్చాయి. అవన్నీ కూడా ఏదో ఒక దశలో పొత్తులు పెట్టుకున్నాయి. ఎటువంటి పొత్తులు ఎత్తులు లేకుండా రాజకీయం చేసిన పార్టీ వైసీపీయే. ఒకటి ఒంటరి అంకె అని ఎవరూ చెప్పక్కర్లేదు. అది అంతే. ఇక రాజకీయాల్లో ఒంటరితనం పూర్తిగా అనుభవిస్తున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఒక్క ఒక్క వైసీపీ మాత్రమే అని అంటారు. వైసీపీది దాదాపుగా చూస్తే పదిహేనేళ్ళ రాజకీయ ప్రస్థానం. ఈ మొత్తం ప్రయాణంలో చూసుకుంటే సింగిల్ సోలో ఈ రెండు పదాలతోనే అడుగులు వేసింది. కాలం కలసి వచ్చి అవే బలమైన నినాదాలుగా మారాయి. ఎంతదాకా అంటే సింహం సింగిల్ గానే వస్తుంది అన్నట్లుగా. అయితే ఈ డైలాగులు ఒక సమయంలో బాగా పేలాలి. అన్ని సమయాలలోనూ కుదరవు అన్నది తరువాత కథ నిరూపించింది.

**వ్యూహం మిస్ అయ్యారా :**

దేశంలో అనేక పార్టీలు వచ్చాయి. అవన్నీ కూడా ఏదో ఒక దశలో పొత్తులు పెట్టుకున్నాయి. ఎటువంటి పొత్తులు ఎత్తులు లేకుండా రాజకీయం చేసిన పార్టీ వైసీపీయే. అందుకే మూడు ఎన్నికలలో ఒకటి మాత్రమే సానుకూల ఫలితం ఇస్తే రెండు సార్లు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. 2024లో అయితే వైసీపీ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. ఓట్ల పరంగా చూస్తే 40 శాతం షేర్ ఉంది కానీ సీట్లు బొత్తిగా 11 కి పడిపోయాయి. దాంతో వైసీపీకి అధికారం కాదు కదా సరైన రాజకీయ గౌరవాన్ని ఇచ్చే స్థాయిలో సీట్లు కూడా దక్కడం కష్టమైంది అన్నది ఈ ఫలితాలు తెలియచేశాయి. ఇలా చూస్తే కనుక వైసీపీ విషయంలోనూ అదే జరుగుతోంది అని అంటున్నారు. ఇక్కడే వైసీపీ రాజకీయ వ్యూహం మిస్ అయింది అని అంటున్నారు.

**తప్పు కానే కాదుగా :**

ఎన్నికలు అంటే ఎన్నో అంశాలు మిళితం అయి ఉంటాయి. పొత్తులు కూడా ఒక పవర్ ఫుల్ స్ట్రాటజీ. దానిని ఎపుడు ఎలా ఉపయోగించాలో టీడీపీకి తెలిసినంతగా మరే పార్టీకి తెలియదు అందుకే తెలుగుదేశం ఎవరు ఏమనుకున్నా పొత్తులకే వెళ్తుంది దానిని ఎద్దేవా చేస్తూ వైసీపీ భారీ పరాజయాన్ని మూటకట్టుకుంది. ఇపుడు వైసీపీ సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఉంది అని అంటున్నారు. వైసీపీ బలం ఎంత అన్నది 2024 ఎన్నికల్లో రుజువు అయింది. వచ్చే ఎన్నికల నాటికి మరి కొంత బలం సమకూరినా కూడా మూడు పార్టీలు పైగా కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలతో ఢీ కొని నెగ్గుకుని రావడం బహు కష్టం అన్న భావన అయితే వ్యక్తం అవుతోంది

**కూటమి కట్టాల్సిందేనా :**

ఏపీలో ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ ఉంది. అయితే అదే అపొజిషన్ ఫ్లాట్ ఫారం మీద కాంగ్రెస్ వామపక్షాలు, ఇతర పార్టీలు ఉన్నాయి. ఆయా పార్టీలను కలుపుకుని వైసీపీ కూడా ఒక కూటమిని ఏర్పాటు చేసుకుంటే 2029 ఎన్నికల్లో టీడీపీ కూటమిని గట్టిగా ఢీ కొట్టే స్థితికి చేరుకోవచ్చు అన్నది విశ్లేషణగా ఉంది. అయితే వైసీపీ ఈ విషయంలో ఎంతవరకూ మొగ్గు చూపుతుంది అన్నది చూడాల్సి ఉంది. సింగిల్ గానే అన్నది ఈ రోజుకీ పార్టీలో వినిపిస్తున్న మాట. దానికి వైసీపీ లాజిక్ ఏమిటి అంటే పార్టీలో ఎందరో పనిచేస్తూ ఉన్నారు. వారికి అవకాశాలు తగ్గించి పొత్తుల పేరుతో వేరే పార్టీలకు ఇవ్వడం వల్ల వారు నష్టపోతారు అని. అది కొంతవరకూ నిజమే అనుకున్నా అధికారం దక్కించుకోకపోతే టోటల్ గా పార్టీ నష్టపోతుంది కదా అన్నది మరో వాదనగా ఉంది.

**చాలా పరిమితులున్నాయి :**

ఏపీలో ఈ రోజుకు చూస్తే వైసీపీ ఒంటరి పార్టీగానే ఉంది. అయితే జై భీమ్ అన్న పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ వంటి వారు వైసీపీతో పొత్తు కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీతో కలసి వెళ్తామని ఆయన ఇప్పటికే చెబుతున్నారు. ఇక ఆమ్ ఆద్మీ బీఎస్పీ లాంటి పార్టీలు కూడా ఉన్నాయి. వాటిని కలుపుకోవాలా వద్దా అన్నది చూడాల్సి ఉంది. వామపక్షాలు రెండు రకాల వైఖరితో వైసీపీ మీద ఉన్నాయి. సీపీఎం అయితే కాస్తా సాఫ్ట్ కార్నర్ తో ఉన్నా సీపీఐ ఎలా రియాక్ట్ అవుతుందో తెలియదు, పైగా ఈ రెండూ ఇండియా కూటమిలో జాతీయ స్థాయిలో ఉన్నాయి. కాంగ్రెస్ లేకుండా వామపక్షాలు వైసీపీతో జత కట్టే పరిస్థితి ఉండదు అని అంటున్నారు. దాంతో కాంగ్రెస్ ని దగ్గరకు తీసే విషయంలో వైసీపీ తన పర్మనెంట్ పొలిటికల్ స్టాండ్‌నే మార్చుకోవాల్సి ఉందని అంటున్నారు.

**అనివార్యంగానే :**

అయితే ఈసారి పొత్తులు వైసీపీకి అనివార్యంగానే ఉన్నాయి అని అంటున్నారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు గట్టిగా మూడున్నరేళ్ళ సమయం ఉంది. అప్పటికి ఎన్నో జరుగుతాయని అంటున్నారు. కాంగ్రెస్ తో కచ్చితంగా వైసీపీ నడవాల్సిన పరిస్థితులు రావచ్చు అన్న మాట కూడా ఉంది. ముఖ్యంగా బీహార్ తరువాత జాతీయ రాజకీయాల్లో మార్పు ఏపీ మీద ప్రభావం చూపిస్తుంది అని అంటున్నారు మరో వైపు చూస్తే వైసీపీతో కలిసేందుకు చిన్న పార్టీలు ఆసక్తిగా ఆశగా ఉన్నాయి. వైసీపీ ముందుకు వస్తే కాంగ్రెస్ వామపక్షాలు సైతం సై అంటాయి. మొత్తం మీద వైసీపీ దీర్ఘకాలంగా ఎంచుకున్న రాజకీయ ఒంటరితనం ఈసారి భగ్నం అయ్యే అవకాశాలే అధిక శాతం ఉన్నాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

**చేతికి అంది వచ్చిన పంటను**

# గ్రద్దలా తన్నుకు పోయిన తుఫాన్...

**ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటాం...**

**నేలకు ఒరిగిన వరి పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ...**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. గురువారం మండపేట మండలం మారేడుబాక గ్రామంలో వ్యవసాయ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. పంటపొలాలను పరిశీలించారు. తుఫాను కారణంగా కోతకు వచ్చిన పంట మొత్తం నేలనంటాయని రైతులు ఎమ్మెల్యే వేగుళ్ళ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ప్రతీ రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ అధికారులను క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి నివేదిక పంపవలసినదిగా ఆదేశాలు ఇచ్చారన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాయుడు గంగరాజు, పసలపూడి శ్రీనివాస్, ముత్యాల అన్నవరం, సాదె సుబ్బారావు, సిద్ధిరెడ్డి రామన్న, తీగిరెడ్డి ప్రశాంత్, కూటమి నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ అధికారులు ఎ.డి సి.హెచ్.కె.వి.చౌదరి, ఎ.ఒ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ దినోత్సవంపై మండల స్థాయిలో పోటీలు

**ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులు నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపిక**

**మండల విద్యాశాఖాధికారి సూర్యనారాయణ**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశంలో రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును స్మరించు కుంటూ జ్ఞాపకార్థంగా, ప్రతి సంవత్సరం నవంబర్ 26న జరుపుకునే జాతీయ రాజ్యాంగ దినోత్సవం పై మండల స్థాయిలో గురువారం వ్యాసరచన పోటీలను విద్యార్థులకు నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి వై.సూర్యనారాయణ తెలిపారు. రాయవరం మండలం, సోమేశ్వరం గ్రామంలో గల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దయామణి అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలకు రాయవరం మండలంలోని అన్ని గవర్నమెంట్ హైస్కూల్స్, యు.పి స్కూల్స్‌లో 8వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న ప్రతిభ కలిగిన విద్యార్థులు పాల్గొనగా, మండల స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి, నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని మండల విద్యాశాఖాధికారి వై. సూర్యనారాయణ తెలిపారు. కాగా ఈ వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన సోమేశ్వరం పాఠశాల విద్యార్థులు కోటిపల్లి సాయికిరణ్, అబ్బిరెడ్డి జ్యోష్ణ లు, రాయవరం హైస్కూల్ విద్యార్థిని మెర్ల సత్యలక్ష్మి దేవి చరిష్మాలను రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ డివైఈవో రామలక్ష్మణ మూర్తి ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీలకు ఉపాధ్యాయులు జి.సీతాదేవి, కె.శ్రీనివాస్, కె.సత్యవేణి, బి.బాలకృష్ణ, పి.నాగేశ్వరరావు, జె.ధర్మ, డి.అనూష గ్లోరీలు ప్రాతినిధ్యం వహించగా, ఈ కార్యక్రమానికి సీఆర్పీలు కె.నీనా సిరి, వి.సీతా ధనలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

**బాపూజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన**

# డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ అనురాధ




**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ పుట్టినరోజు వేడుకలు వైఎస్సార్సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన అమలాపురం నియోజక వర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ అనురాధ, వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు సమక్షంలో కేక్ కటింగ్ చేసి, దుస్సాలువాతో సత్కరించి బాపూజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పిటీసీ కొనుకు గౌతమీ మహేష్, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరి, దొమ్మేటి శాంతి భవాని, మాకే కృష్ణమూర్తి, సర్పంచ్ లు బర్రె సీతారత్నం, రాకాప విజయలక్ష్మి, చింతా రామక్రిష్ణ, నాతి శ్రీను, తిక్క ప్రసాద్,నామన సిద్ధాంతి, సాధనాల శ్రీను, బల్ల శ్యామ్, బొంతు ఏడుకొండలు, మధుర శేఖర్, మధుర చాణక్య, పెనుమాల విక్రమ్, దేవరపల్లి నరేష్, యల్లమెల్లి బోస్, కుంచె సుబ్బు, పోతుల చినబాబు, దడాల రాజశేఖర్, సన్నీ, శ్రీకాంత్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు.

# కోటి సంతకాల సేకరణలో జన నీరాజనం : చైర్ పర్సన్ రాణి



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రవేటికరణకు వ్యతిరేకంగా తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గరాణి అన్నారు. ఈ సందర్భంగా మండపేట పట్టణం 20వ వార్డు వైయస్సార్ కాలనీలో ఆమె గురువారం ఇంటింటికి తిరుగుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేటీకరణ జరిగితే కలిగే నష్టాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేస్తూ వారి అనుమతి సంతకాలతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్థాపించిన 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను కూటమి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేయడం దారుణం అన్నారు. అలా జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరం అవుతుందని, ఫీజులు భరించలేనంతగా పెరుగుతాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత సూపర్ స్పెషాలిటీ సేవలు దూరమవుతాయన్నారు. ప్రభుత్వం ఈ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ & షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, పార్టీ ఐటి వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కార్యకర్తలు బత్తిన దొరబాబు, షేక్ మస్తాన్, పేరూరి మాధవి, కొమ్మోజు నాగేశ్వరరావు, కాకాడ సురేంద్ర, పెందుర్తి జాన్, చంద్రమళ్ల ప్రశాంత్, చంద్రమళ్ల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై అవగాహన ర్యాలీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యాశాఖ వారి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్.రామకృష్ణ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలిలో అవినీతి కోసం,దాని నిర్మూలన చర్యల కోసం రామచంద్రపురం పుర ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం కార్యక్రమ కన్వీనర్ కే.రవిబాబు, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ నిర్వహణలో జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, డాక్టర్ ఎన్.శ్రీనివాస్, డాక్టర్ ఎన్‌వి రమణ, బి.రవికుమార్ ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్జేడీ-కాంగ్రెస్ @ 5-కే సర్కార్

ముజఫ్ఫర్‌పుర్

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతోన్న వేళ ప్రచార వేడి పెరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ముజఫ్ఫర్‌పుర్‌లోని ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ-కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీలు ఎక్కడుంటే అక్కడ జంగిల్ రాజ్ వస్తుందని మోదీ దుయ్యబట్టారు. "ఆర్జేడీ-కాంగ్రెస్ పాలనను ఐదు పదాల్లో చెప్పొచ్చు. కట్టా (నాటు తుపాకీ), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం), కరప్షన్ (అవినీతి).. ఇవే ఆ పార్టీల పాలనా విధానాలు. ఆయుధం ఉన్నచోట క్రూరత్వం ఉంటుంది. ఆటవిక రాజ్యం వస్తుంది. ఆర్జేడీ అధికారంలో ఉన్న సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారు. వారి హయాంలో బిహార్‌లో 35వేల నుంచి 40వేల వరకు కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి" అని మోదీ మండిపడ్డారు.



**వారిది నూనె-నీటి బంధం..**

ఇక, మహాగఠ్‌బంధన్‌లో విభేదాల గురించి ప్రస్తావిస్తూ మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "ఆర్జేడీ-కాంగ్రెస్ పార్టీలది నూనె-నీటి లాంటి బంధం. ఆ రెండూ ఎప్పటికీ కలవవు. బిహార్‌లో వారు కలిసి చేస్తున్న ర్యాలీలన్నీ ఓట్ల కోసం చేస్తున్న బూటకపు చర్యలే" అని ప్రధాని ఎద్దేవా చేశారు. తనను విమర్శించడం అంటే.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తమ జన్మహక్కులా భావిస్తున్నారని అన్నారు.

**ఛఠ్ పూజను డ్రామా అన్నారు..**

ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఛఠ్ పూజను కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు అవమానించాయని మోదీ విమర్శించారు. ఓట్ల కోసం వారు ఎంతకైనా దిగజారుతారని మండిపడ్డారు. ఇలాంటి అవమానాన్ని బిహార్ తల్లులు ఎన్నటికీ మర్చిపోరని, అలాంటి వారిని క్షమించబోరని అన్నారు. ఇక, ఛఠ్ పూజకు యునెస్కో గుర్తింపు దక్కేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ ఈ సందర్భంగా తెలిపారు.

**బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రధాన పార్టీల అగ్రనేతల పర్యటనలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముజఫర్‌పూర్, ఛప్రాలలో రెండు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ బీహార్‌లో బీజేపీ-ఎన్డీఏ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "బీహార్‌లోని నా కుటుంబ సభ్యులే ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం కోసం స్వయంగా బరిలోకి దిగారు. ఈ ఉత్సాహపూరిత వాతావ రణంలో ఈ ఉదయం 11 గంటలకు ముజఫర్‌పూర్‌లో, మధ్యాహ్నం 12:45 గంటలకు ఛప్రాలో ప్రజలతో సంభాషించే భాగ్యం నాకు కలుగుతుంది. రాష్ట్రంలోని నా సోదర సోదరీమణులు మరోసారి విజయ శంఖాన్ని పూరిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ముజఫర్‌పూర్‌లో జరిగిన మహాఘట్‌బంధన్ ఉమ్మడి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఆయనకు (మోదీకి) కేవలం మీ ఓటు మాత్రమే కావాలి. ఓట్ల కోసం డ్రామా చేయమంటే చేస్తారు. మీరేమైనా చేయించగలరు. నరేంద్ర మోదీని డ్యాన్స్ చేయమన్నా చేస్తారు" అంటూ రాహుల్ విమర్శించారు. "వారు మీ ఓట్లను దొంగిలించే పనిలో ఉన్నారు. మహారాష్ట్ర, హర్యానాలలో ఎన్నికలను దొంగిలించారు. ఇప్పుడు బీహార్‌లోనూ అదే ప్రయత్నం చేస్తారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బుధవారం బేగుసరాయ్, సమస్తిపూర్, దర్భంగాలలో ఎన్డీఏ తరపున ప్రచార ర్యాలీలు నిర్వహించారు. 2025 బీహార్ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటముల మధ్య నెలకొంది. ఎన్డీఏలో బీజేపీ, జేడీ(యూ), ఎల్‌జేపీ (రామ్ విలాస్) వంటి పార్టీలు ఉండగా, మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఉన్నాయి. వీటికి తోడు ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ కూడా రాష్ట్రంలోని 243 స్థానాల్లో పోటీ చేస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చలు

చైనా అధినేత జీ జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ను 10 శాతం మేర తగ్గిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరుదేశాల అధినేతలు దక్షిణ కొరియా వేదికగా సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, జీ జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయని అన్నారు. ఫెంటనిల్ తయారీలో ఉపయోగించే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని విశ్వసిస్తున్నానని అన్నారు. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20 శాతం సుంకాలను 10 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైనట్లు అమెరికా అధ్యక్షుడు తెలిపారు. చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని అన్నారు. ఏడాది పాటు ఎగుమతి చేసేలా ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు పదికి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం అంశంలో అమెరికాతో కలిసి పని చేసేందుకు చైనా అంగీకరించిందని అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని ట్రంప్ తెలిపారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా వస్తారని అన్నారు.

అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు.



**ఫెంటనిల్ టారిఫ్‌ల తగ్గింపు..**

"జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరిం చేందుకు అంగీకారం కుదిరింది" అని ట్రంప్ వెల్లడించారు.

**రేర్ ఎర్త్‌పై కుదిరిన డీల్..**

అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు.

**జిన్‌పింగ్‌కు 12/10..**

ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

**ఎయిర్‌పోర్టులోనే ఎందుకు..?**

జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానా శ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు.

# సామ్రాట్ 'బిగ్ మ్యాన్' అవుతారు

బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీకి సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత సామ్రాట్‌ను మోదీ 'బిగ్ మ్యాన్' చేస్తారని అన్నారు. సామ్రాట్ పోటీ చేస్తున్న తారాపుర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి ఈ విధంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌ను తప్పించి, భాజపా అభ్యర్థికి ఆ బాధ్యతలు అప్పగించేందుకు ఎన్డీయే ప్రయత్నాలు చేస్తోందని గతంలో విపక్షాలు ఆరోపించిన నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "సామ్రాట్ చౌధరీ పుట్టింది ఇక్కడే. సామ్రాట్ కోసం ఈ స్థానాన్ని వదులుకోవాలని సిట్టింగ్ ఎమ్మెల్యే (జేడీయూ) రాజీవ్ సింగ్‌ను ఒప్పించాము. తమ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని తారాపుర్ సహా అనేక ప్రాంతాల నుంచి అనేక విజ్ఞప్తులు వస్తున్నాయి. మీ ఎమ్మెల్యే మాత్రం రెడీమేడ్ డిప్యూటీ సీఎం" అని అమిత్ షా పేర్కొన్నారు. ఎన్నికల్లో సామ్రాట్‌కు ఓటు వేసి గెలిపించాలని, రానున్న రోజుల్లో ఆయన్ను ప్రధాని మోదీ "బిగ్ మ్యాన్, వెరీ బిగ్ మ్యాన్" చేస్తారని చెప్పారు.




**ఎమ్మెల్యేగా పదిసార్లు.. బిహార్‌లో ఆయన చరిత్ర సృష్టించేనా?**

బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌధరీ.. గతంలో జేడీయూ, ఆర్జేడీ పార్టీల్లోనూ పనిచేశారు. కొన్నేళ్ల క్రితం భాజపాలో చేరిన ఆయన క్రమంగా ఎదుగుతూ వచ్చారు. సామ్రాట్ కుష్వాహా వర్గానికి చెందిన నేత. రాష్ట్రంలో యాదవుల తర్వాత వీరి ప్రాబల్యం అధికంగా ఉంటుంది. ఈ వర్గానికి చేరువయ్యే వ్యూహంలోనే సామ్రాట్‌కు భాజపా ప్రాధాన్యం కల్పిస్తోందనే వాదన కూడా ఉంది. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా కొనసాగిన ఆయన.. చాలాకాలం తర్వాత ప్రత్యక్ష పోరుకు సిద్ధమయ్యారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ



సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు.

**సుప్రీంకోర్టులో సీనియర్..**

ఇక సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్నికేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు.

**శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి..**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన ఆయన ఈ బాధ్యతలు చేపడతారని వివరించారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్‌కు ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు అని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తెలిపారు.

**హర్యానాకు చెందిన..**

హర్యానాకు చెందిన జస్టిస్ సూర్యకాంత్.. గతంలో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. అంతకు ముందు పంజాబ్, హర్యానా హైకోర్టు జడ్జిగా పని చేశారు. ఆ తర్వాత 2019 మేలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. హర్యానా నుంచి ఈ పదవిని చేపట్టనున్న తొలి వ్యక్తిగా జస్టిస్ సూర్యకాంత్ ఖ్యాతికెక్కనున్నారు. ఇక న్యాయపరమైన అంశాలు, సామాజిక న్యాయం, పాలన వ్యవహారాలు, పర్యావరణ సమస్యలు తదితర అంశాలపై ఆయనకు బలమైన పట్టుంది. అలాగే అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో ఉండి.. కీలక తీర్పులు సైతం వెలువరించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ 14 నెలలపాటు కొనసాగనున్నారు. ఈ సమయంలో ఎన్నికల సంస్కరణలు, క్రిమినల్ జస్టిస్, డిజిటల్ ప్రైవసీకి సంబంధించిన అంశాలు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## చమురు కొనుగోళ్లకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాం

న్యూఢిల్లీ

రష్యన్ చమురు కంపెనీలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో భారత్ తన ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు మరిన్ని కొత్త మార్గాలను అన్వేషించనుందని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌దీర్ జైస్వాల్ గురువారం ప్రకటించారు. రష్యాలో ప్రభుత్వరంగ అతిపెద్ద చమురు సంస్థ రోస్‌నెఫ్ట్‌తోపాటు అక్కడి అతిపెద్ద ప్రైవేట్ చమురు సంస్థ లక్‌ఆయిల్‌లపై ఆంక్షల కొరడా ఝులిపించామని దక్షిణకొరియాలో ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజే భారత్ స్పందించడం గమనార్హం. అమెరికా ఆంక్షలను ధిక్కరిస్తూ ఈ సంస్థల నుంచి తక్కువ ధరకు చమురుకొనే బదులు ఇదే రేట్లకు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయగల అవకాశాలను భారత్ పరిశీలిస్తోంది. రష్యా నుంచి ముడిచమురును కొనుగోలు పరిమాణాన్ని తగ్గించుకుంటూ అమెరికా పెట్రోలియం ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకోబోందన్న వార్తల నడుమ భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్యేదీర్ జైస్వాల్ స్పందించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్ ఇంకా చర్చలు జరుపుతోందని గుర్తుచేశారు. అయితే గత నెలలతో పోలిస్తే తాజాగా రష్యన్ సంస్థల నుంచి భారత చమురు కొనుగోళ్లు తగ్గినట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి.

**ఛాబహార్ పోర్ట్ విషయంలో ఊరట**

ఇరాన్‌లోని కీలక ఛాబహార్ ఓడరేవు నుంచి అంతర్జాతీయ నౌకల రాకపోకలపై అమెరికా విధించిన ఆంక్షలను భారత్ కోసం కొద్దికాలం పక్కనబెట్టింది. ఆరు నెలలపాటు ఆంక్షల నుంచి భారత్‌ను మినహాయింపునిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ మినహాయింపు అక్టోబర్ 29వ తేదీ నుంచి మొదలవుతుందని జైస్వాల్ చెప్పారు. అంతర్జాతీయంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో తనకు ప్రతికూలంగా మారొద్దనే అక్కసుతో అమెరికా ఈ ఓడరేవుపై సెప్టెంబర్ 29వ తేదీ నుంచి ఆంక్షలు విధించడం తెల్సిందే. అయితే భారత అభ్యర్థనతో ఆ ఆంక్షల అమలును నెలరోజులు వాయిదా వేశారు. తాజా చర్చలతో దానిని మరో ఆరునెలలు పొడిగించారు. ఛాబహర్ పోర్ట్‌ను అనుసంధానత, సత్సంబంధాలే లక్ష్యంగా భారత్, ఇరాన్ సంయుక్తంగా అభివృద్ధిచేశాయి.

## ధైర్యశాలి ప్రధాని అంటే మా నాన్నమ్మే

షేక్‌పురా (బిహార్)

ఆపరేషన్ సిందూర్ వేళ భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చేస్తున్న వాదనలకు అడ్డుకట్ట వేసే ధైర్యం ప్రధాని మోదీకి అస్సలు లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. బిహార్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా గురువారం నలంద, షేక్‌పురాలో సభలో రాహుల్ ప్రసంగిస్తూ మోదీపై విమర్శల వాగ్బాణాలు సంధించారు. "తన కారణంగానే భారత్, పాక్ యుద్ధం ఆగిందని ఇప్పటికే ఎన్నో సార్లు ట్రంప్ అంతర్జాతీయ వేదికలపై డప్పు కొట్టారు. ఆయన ప్రకటనలను ప్రధాని మోదీ కనీసం అడ్డుకునే సాహసం చేయట్లేరు. మీరు మాట్లాడేది అబద్ధం అని మాట వరసకు కూడా ట్రంప్‌కు చెప్పే ధైర్యం మోదీకి లేదు. ఇటీవల కాలంలో మోదీ అమెరికాకు వెళ్లాల్సింది. కానీ ట్రంప్ భయానికే ఆయన అమెరికా వైపు కన్నెత్తి చూడట్లేరు. నిజంగానే మోదీకి అంతటి ధైర్యం ఉంటే బిహార్ ఎన్నికల ర్యాలీల్లో యుద్ధం ఆపింది ట్రంప్ కానేకాదు అని మోదీ కరాఖండీగా ప్రకటించాలి"అని రాహుల్‌సవాల్ విసిరారు.

**ధైర్యశాలి ప్రధాని అంటే మా నాన్నమ్మే**

"నిజానికి ప్రధాని అంటే ఎంతటి ధైర్యశాలిగా ఉండాలో మా నాన్నమ్మ, నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీని చూసి నేర్చుకోవాలి. 1971లో నాటి అమెరికా అధ్యక్షుడితో ఇందిర సూటిగా 'మాకు మీరంటే ఏమాత్రం భయంలేదు'అని ముఖం మీదే చెప్పేశారు. ఆమె తెగింపు గల నాయకురాలు"అని ఇందిరను రాహుల్ గుర్తుచేసుకున్నారు. బిహార్‌లో భూములు అందుబాటులో లేవన్న అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించారు. "బడా పారిశ్రామిక సంస్థకు చవగ్గా భూములు అమ్మేస్తూ పోతే ఇక భూముల లభ్యత ఎలా సాధ్యం?"అని ప్రశ్నించారు.


# బిజినెస్

## శాంసంగ్ డిజిటల్ కీ.. ఇకపై ఫోన్‌తోనే కారు అన్ లాక్



ప్రముఖ మొబైల్ ఫోన్ తయారీ సంస్థ కీలక ఫీచర్ తీసుకువచ్చింది. శాంసంగ్ గెలాక్సీ మొబైల్స్ లో కార్ అన్‌లాకింగ్ ఫీచర్ తీసుకువచ్చింది. ఈ ఫీచర్ ద్వారా ఫిజికల్ కీ లేకుండా ఫోన్‌తోనే కారును స్టార్ట్ చేయడం, అన్ లాక్ చేయడం లాంటివి చేయవచ్చు. అయితే ప్రస్తుతం ఇది మహీంద్రా ఎలక్ట్రికల్ ఎస్‌యూవీ వాహనాలకు మాత్రమే పనిచేస్తుంది. అంతే కాకుండా డిజిటల్ కార్ కీ పేరుతో గెలాక్సీ ఫోన్లలో ఈ ఫీచర్ అందుబాటులోకి తీసుకువస్తోంది. నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్, అల్ట్రా వైడ్ బ్యాండ్, టెక్నాలజీల సాయంతో ఇది పనిచేస్తుంది. కార్ మోడల్ ఆధారంగా డిజిటల్ కీ అనుసంధానం అవుతుంది. అంతే కాకుండా ఒకసారి ఫోన్ లోని యాప్ తో పెయిర్ చేసిన తరవాత యూజర్ ఫోన్ ను కారుకు దగ్గరగా తీసుకెళ్లగానే ఆటోమెటిక్‌గా అన్ లాక్ అవుతుంది. డిజిటల్ కీ యాప్ ద్వారా ఇతరులకు సైతం కారు యాక్సెస్ ఇచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే లేదా మర్చిపోతే శాంసంగ్ ఫైండ్ సర్వీసెస్ ద్వారా రిమోట్ గా కీ ని లాక్ చేయవచ్చు, లేదంటే పూర్తిగా తొలగించవచ్చు.

## ఫేస్‌బుక్, లింక్డ్‌ఇన్ తరహాలో తవాట్సాప్‌లోనూ కవర్ ఫోటో ఫీచర్




ప్రముఖ మేసేజింగ్ యాప్ వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చే పనిలో ఉంది. సాధారణంగా ప్రొఫైల్, కవర్ ఫోటోలు సోషల్ నెట్‌వర్కింగ్ అకౌంట్ల తీరులో కీలక పాత్ర పోషిస్తాయి.దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫేస్‌బుక్, లింక్డ్ఇన్ తరహాలో కవర్‌ఫోటో ఫీచర్ అందించడానికి సన్నాహాలు చేస్తోంది. కవర్ ఫోటోలు ఇప్పటివరకు వాట్సాప్ బిజినెస్ అకౌంట్లకు మాత్రమే ఉన్నాయి, దీన్ని ఇప్పుడు అందరికీ అందుబాటులోకి తెచ్చే చర్యలు తీసుకుంటున్నట్టు వాట్సాప్ తెలిపింది. ప్రొఫైల్ కస్టమైజేషన్‌లో భాగంగా ఈ సదుపాయాన్ని సాధారణ కస్టమర్లకు కూడా అందించాలని భావిస్తున్నట్టు వాట్సాప్ పేర్కొంది. ప్రస్తుతం ఈ ప్రక్రియను అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో కస్టమర్లకు అందిస్తామని స్పష్టం చేసింది. అయితే, ఎప్పటికీ అందుబాటులోకి వస్తుందనే విషయం వాట్సాప్ చెప్పలేదు. భవిష్యత్తులో వాట్సాప్ అప్‌డేట్‌లో దీన్ని తీసుకొస్తామని, కొత్త ఫీచర్‌ను ఉపయోగించి కస్టమర్లు తమ ప్రొఫైల్ సెట్టింగ్స్ ద్వారా నచ్చిన ఫోటోను కవర్ ఫోటోగా పెట్టుకోవచ్చని వాట్సాప్ తన బ్లాగ్ పోస్ట్‌లో వివరించింది. దీనికి ప్రత్యేకమైన ప్రైవసీ సెట్టింగ్ కూడా ఉంటుందని, కవర్ ఫోటోను ఎవరు చూడాలనే ఆప్షన్ కూడా ఇవ్వనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ప్రొఫైల్ ఫోటోకు ఉన్నట్టుగానే మై కాంటాక్ట్స్, ఎవ్రీవన్, నోబడీ లాంటి ఎంపికలుంటాయి.

# ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ 'లేఆఫ్స్' కలకలం




ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మరియు కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికత వేగవంతం కావడంతో, బహుళజాతి కంపెనీలు ఉద్యోగుల తొలగింపులను (లేఆఫ్స్) భారీగా ప్రకటిస్తున్నాయి. కేవలం కొన్ని నెలల్లోనే లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. ముఖ్యంగా, యూపీఎస్‌లో 48,000, అమెజాన్‌లో 30,000, ఇంటెల్‌లో 24,000, మరియు నెస్లేలో 16,000 వంటి భారీ సంఖ్యలో ఉద్యోగాల కోతలు జరిగాయి. వీటితో పాటు, యాక్సెంచర్, ఫోర్డ్ వంటి కంపెనీలు కూడా ఒక్కొక్కటి 11,000 చొప్పున ఉద్యోగులను తొలగించాయి. ఈ గణాంకాలు ప్రపంచ కార్మిక మార్కెట్‌లో నెలకొన్న అస్థిరతకు అద్దం పడుతున్నాయి. పెద్ద సంఖ్యలో లేఆఫ్స్ ప్రకటించిన జాబితాలో ఇతర టెక్, ఫార్మా మరియు కన్సల్టింగ్ దిగ్గజాలు కూడా ఉన్నాయి. మైక్రోసాఫ్ట్‌లో 7,000, పీడబ్ల్యూసీలో 5,600, సేల్స్‌ఫోర్స్‌లో 4,000 మరియు ఫార్మా దిగ్గజం నోవో నార్డిస్క్‌లో 9,000 ఉద్యోగాల కోతలు నమోదయ్యాయి. ఈ తొలగింపులు కేవలం ఒకే రంగానికి పరిమితం కాకుండా, లాజిస్టిక్స్, టెక్నాలజీ, ఆహార పరిశ్రమ, ఆటోమొబైల్ మరియు కన్సల్టింగ్ వంటి వివిధ కీలక రంగాలకు విస్తరించాయి. దీని ద్వారా, ఆర్థిక మాంద్యం భయాలు, పెరుగుతున్న నిర్వహణా ఖర్చులు, మరియు వ్యయ నియంత్రణ చర్యలు కంపెనీల వ్యూహంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని స్పష్టమవుతోంది. ఈ సామూహిక లేఆఫ్స్‌కు అనేక కారణాలు దోహదపడుతున్నాయి. కోవిడ్-19 మహమ్మారి సమయంలో అధిక లాభాలు మరియు డిమాండ్‌ను అంచనా వేసి, అవసరానికి మించి ఉద్యోగులను నియమించుకోవడమే ప్రధానంగా కనిపిస్తుంది. అయితే, ప్రస్తుతం ఆర్థిక వృద్ధి మందగించడం, రుణాలపై వడ్డీ రేట్లు పెరగడం వంటి స్థూల ఆర్థిక ఒత్తిళ్లు కంపెనీల లాభాలపై ప్రభావం చూపుతున్నాయి. వీటికి తోడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల అనేక మానవ వనరుల పనులను యంత్రాలు భర్తీ చేయగలుగుతున్నాయి. ఫలితంగా, కంపెనీలు తమ వ్యాపార నమూనాలను "లీన్"గా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి, ఇందులో భాగంగానే అనవసరమైన లేదా పునరావృతమయ్యే పాత్రలను తొలగిస్తున్నాయి. ఈ లేఆఫ్స్ కేవలం ఉద్యోగాలు కోల్పోయిన లక్షలాది మంది జీవితాలపైనే కాక, మొత్తంగా కార్మిక మార్కెట్ మరియు ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకవైపు, అనుభవం ఉన్న నిపుణులు సైతం కొత్త ఉద్యోగాల కోసం తీవ్రంగా పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## కృత్రిమ మేధ చిప్‌లకు భారీ డిమాండ్‌తో కంపెనీ దూకుడు




కృత్రిమ మేధ రంగంలో ప్రభంజనం సృష్టిస్తున్న చిప్‌మేకర్ ఎన్విడియా కార్పొరేషన్ చరిత్ర సృష్టించింది. బుధవారం ట్రేడింగ్‌లో కంపెనీ మార్కెట్ విలువ తొలిసారిగా 5 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించింది.మార్కెట్ ప్రారంభంలోనే కంపెనీ షేర్లు 3 శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఏఐకి పెరుగుతున్న డిమాండ్‌తో అత్యధికంగా లాభపడిన సంస్థగా ఎన్విడియా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. 5 శాతం పెరిగిన ఈ కంపెనీ షేర్లు, బుధవారం కూడా అదే జోరును కొనసాగించాయి. ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌తో సమావేశం కానున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీకి ముందు, ఎన్విడియా బ్లాక్‌వెల్ ఏఐ ప్రాసెసర్లపై చర్చించేందుకు ఈ సమావేశం జరగనుంది. ఈ ప్రకటనతో, కంపెనీకి అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన చైనాకు చిప్‌ల అమ్మకాలపై ఉన్న ఆంక్షలు సడలించే అవకాశం ఉందన్న అంచనాలు పెరిగాయి.కేవలం నాలుగు నెలల క్రితమే 4 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన ఎన్విడియా, ఇంత తక్కువ సమయంలోనే 5 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరడం విశేషం. ఏఐ ప్రాసెసర్లకు రికార్డు స్థాయిలో ఉన్న డిమాండ్, వరుసగా కుదుర్చుకుంటున్న భాగస్వామ్యాలు కంపెనీ అసాధారణ వృద్ధికి కారణంగా నిలుస్తున్నాయి. ఇటీవల సీఈఓ జెన్సన్ హువాంగ్ మాట్లాడుతూ.. తమకు 500 బిలియన్ డాలర్ల విలువైన కొత్త చిప్ ఆర్డర్లు వచ్చినట్లు వెల్లడించారు. అంతేకాకుండా, రోబోట్యాక్సీల అభివృద్ధి కోసం ఉబర్‌తో, 6జీ టెక్నాలజీ కోసం నోకియాలో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడి, తర్వాతి తరం చాట్‌జీపీటీ కోసం కొత్త ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు ఓపెన్‌ఏఐతో 100 బిలియన్ డాలర్ల ఒప్పందం వంటి కీలక భాగస్వామ్యాలను ప్రకటించింది. మరో కీలక ఒప్పందంలో భాగంగా, అమెరికా ఇంధన శాఖతో కలిసి ఏడు ఏఐ సూపర్ కంప్యూటర్లను నిర్మించడానికి ఎన్విడియా పనిచేస్తోంది. ఇది హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ రంగంలో కంపెనీ నాయకత్వాన్ని మరింత సుస్థిరం చేస్తోంది.

# కుదిరితే పదకొండో స్థానంలో కూడా ఆడిస్తారు: బీసీసీఐపై మాజీ క్రికెటర్ విమర్శలు

టీ20 ప్రపంచకప్-2024 తర్వాత టీమిండియా ఓపెనర్‌గా వచ్చి అదరగొట్టాడు సంజూ శాంసన్ పదమూడు ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా వచ్చి 183కు పైగా స్ట్రైక్‌రేటుతో పరుగులు రాబట్టాడు. ఇందులో ఏకంగా మూడు శతకాలు కూడా ఉండటం గమనార్హం.

### గిల్ రాకతో గందరగోళం

అయితే, ఆసియా టీ20 కప్-2025 సందర్భంగా శుబ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా రీ ఎంట్రీ ఇవ్వడంతో సంజూకు కష్టాలు మొదలయ్యాయి. భవిష్య కెప్టెన్ గిల్ ఓపెనర్‌గా వచ్చేందుకు సంజూపై వేటు వేసింది యాజమాన్యం. ఇక ఆ టోర్నీలో సంజూకంటూ బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రత్యేక స్థానం లేకుండా పోయింది. ఆసియా కప్ టోర్నీలో మూడుసార్లు ఐదో స్థానంలో.. ఓసారి ఆరో స్థానంలో సంజూను బ్యాటింగ్‌కు పంపారు. ఇక బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనైతే ఎనిమిదో స్థానం వరకు అతడికి పిలుపేరాలేదు. వికెట్ కీపర్‌గా మాత్రమే టోర్నీ ఆసాంతం అతడి సేవలు వాడుకున్నారు. తాజాగా ఆస్ట్రేలియా పర్యటనలోనూ తొలి టీ20లో శుబ్‌మన్ గిల్- అభిషేక్ శర్మతో కలిసి భారత ఇన్నింగ్స్ ఆరంభించాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కెప్టెన్, మాజీ చీఫ్ సెలక్టర్ క్రిష్ణమాచారి



శ్రీకాంత్ సంజూ శాంసన్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు.

### దురదృష్టవంతుడైన ఆటగాడు

యూట్యూబ్ చానెల్ వేదికగా మాట్లాడుతూ.. "జట్టులో ప్రస్తుతం అత్యంత దురదృష్టవంతుడైన ఆటగాడు సంజూ శాంసన్. ఓపెనర్‌గా సెంచరీ చేసిన ఘనత అతడిది. కానీ ఇప్పుడు 3-8 వరకు ఏ స్థానంలోనైనా మేనేజ్‌మెంట్ అతడిని పంపేందుకు వెనుకాడటం లేదు.

### కుదిరితే పదకొండో స్థానంలో కూడా ఆడిస్తారు

ఒకవేళ అవకాశం గనుక ఉంటే.. పదకొండో స్థానంలో కూడా సంజూను బ్యాటింగ్ చేయమంటారు. ఇలా చేయడం వల్ల ఆటగాడి మనసు గాయపడుతుంది. టాపార్డర్‌లో రాణించినా డిమోట్ చేయడం ఎంతమాత్రం సరికాదు. అయినా.. ఇప్పుడు అతడికి ఇంతకంటే గొప్ప ఆప్షన్ మరొకటి లేదు.

### వికెట్ కీపర్‌గానైనా అవకాశం

మౌనంగా అన్నీ భరిస్తూనే యాజమాన్యం చెప్పినట్లు నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, ఆసియాకప్ టోర్నీలో ఐదో స్థానంలో వచ్చి అతడు మెరుగ్గా రాణించాడు. టీ20 ప్రపంచకప్ టోర్నీలో అతడు మొదటి ప్రాధాన్య వికెట్ కీపర్‌గా ఉంటే అంతకంటే మంచి విషయం మరొకటి ఉండదు. ఐదో నంబర్‌లో సంజూ మరింత మెరుగ్గా రాణిస్తే జట్టులో అతడి స్థానానికి ఢోకా ఉండదు. కాగా ఆసియా కప్‌లో సంజూ ఏడు మ్యాచ్‌లలో కలిపి 125 కంటే తక్కువ స్ట్రైక్‌రేటు నమోదు చేశాడు. అయితే, పాకిస్తాన్‌తో ఫైనల్లో 21 బంతుల్లో 24 పరుగులు చేసి సత్తా చాటాడు. ఇదిలా ఉంటే ఆసీస్-భారత్ మధ్య తొలి టీ20 వర్షం కారణంగా రద్దై పోయింది.

## స్మృతి మంధాన పెళ్లి డేట్ ఫిక్స్!.. వరుడు ఎవరంటే?

భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతోందా? అంటే అవుననే సమాధానమే ఎక్కువగా వినిపిస్తోంది. వచ్చే నెలలోనే ఈ స్టైలిష్ ఓపెనర్ వివాహ బంధంలో అడుగుపెట్టేందుకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. మహిళా క్రికెట్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్మృతి.. ఇప్పటికే ఎన్నో రికార్డులు సాధించింది.

### భారత జట్టు ఓపెనర్‌గా

భారత జట్టు ఓపెనర్‌గా ఇప్పటికే వన్డేల్లో 115 మ్యాచ్‌లు ఆడి.. 14 శతకాల సాయంతో 5253 పరుగులు సాధించిన స్మృతి.. ఏడు టెస్టుల్లో 629 పరుగులు చేసింది. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్లో 153 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఈ లెఫ్టాండర్ బ్యాటర్.. 3982 పరుగులు సాధించింది. అంతేకాదు.. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా ఫ్రాంఛైజీకి తొలి టైటిల్ అందించిన ఘనత ఆమెది.

ఆరేళ్లుగా ప్రేమ

ప్రస్తుతం వన్డే వరల్డ్‌కప్-2025తో బిజీగా ఉన్న స్మృతి మంధాన.. ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఆమె పెళ్లి పనుల్లో తలమునకలు కానున్నట్లు సమాచారం. కాగా స్మృతి చాన్నాళ్లుగా.. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ తో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. 2019 నుంచి డేటింగ్ చేస్తున్న ఈ జంట గతేడాది తమ ఐదో వార్షికోత్సవం అంటూ రిలేషన్‌షిప్ గురించి అభిమానులతో పంచుకున్నారు.



ఇండోర్ కోడలు కాబోతోంది

ఆ తర్వాత ప్రతి వేడుకలోనూ కలిసి కనిపించారు స్మృతి- పలాష్. స్మృతితో పాటు టీమిండియా టూర్లకు కూడా వెళ్తుంటాడు పలాష్. ఇటీవల.. "స్మృతి త్వరలోనే ఇండోర్ కోడలు కాబోతోంది" అంటూ పలాష్ తమ పెళ్లి గురించి సంకేతాలు ఇచ్చాడు. కాగా 1996లో ముంబైలో జన్మించిన స్మృతి మంధాన.. తనకు రెండేళ్ల వయసు ఉన్నపుడు సాంగ్లీకి వెళ్లింది. మాధవ్‌నగర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసింది. మరోవైపు.. పలాష్ 1995లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఓ మరాఠీ కుటుంబంలో జన్మించాడు. శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకున్న అతడు.. బాలీవుడ్‌లో కంపోజర్‌గా సిర్థపడ్డాడు. పలాష్ సోదరి పాలక్ ముచ్చల్ కూడా బాలీవుడ్ సింగర్. తనకు కూడా స్మృతితో మంచి అనుబంధం ఉందని పాలక్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపింది.

### పెళ్లి డేట్ ఫిక్స్!

ఇక స్మృతి స్వస్థలం సాంగ్లీలోనే పెళ్లి జరుగనున్నట్లు తెలుస్తోంది. టైమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపిన వివరాల ప్రకారం.. నవంబరు 20న స్మృతి- పలాష్ పెళ్లి తంతు జరుగనున్నట్లు తెలుస్తోంది.

# స్పోర్ట్స్

## ఆ జట్టు హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్!?



ఐపీఎల్-2025 సీజన్‌కు ముందు తమ కోచింగ్ స్టాఫ్‌లో సమూల మార్పులు చేసేందుకు సిద్ధమైంది. మొన్నకు మొన్న మెంటార్ జహీర్ ఖాన్‌పై వేటు వేసిన లక్నో యాజమాన్యం.. ఇప్పుడు హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌ను తప్పించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆండీ ఫ్లవర్ తర్వాత లక్నో ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన లాంగర్.. భారత ఆటగాళ్లతో సరైన బంధాన్ని ఏర్పరచుకోలేకపోయారని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో భారత్‌కు చెందిన మాజీ క్రికెటర్‌ను తమ హెడ్ కోచ్‌గా నియమించాలని లక్నో భావిస్తున్నట్లు సమాచారం. ఇన్‌సైడ్ స్పోర్ట్ కథనం ప్రకారం.. లక్నో ఫ్రాంచైజీ మెనెజ్‌మెంట్ తమ జట్టు ప్రధాన కోచ్‌గా భారత క్రికెట్ దిగ్గజం, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను తీసుకురావాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుందంట. యువరాజ్ సింగ్‌తో ఫ్రాంచైజీ యాజమాన్యం ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. యువీ ఇప్పటివరకు ఏ ప్రొఫెషనల్ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేయకపోయినా.. అబుదాబి టి10 లీగ్‌లో మాత్రం మెంటార్‌గా వ్యవహరించాడు. అయితే పంజాబ్‌కు చెందిన ఎంతో మంది యువ ఆటగాళ్లను మాత్రం తన అనుభవంతో యువీ తీర్చిదిద్దాడు. ప్రస్తుత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రియాన్ష్ ఆర్య వంటి సంచలన ప్లేయర్లు యువరాజ్ శిష్యులే. ఒకవేళ యువరాజ్ నిజంగా కోచ్‌గా వస్తే లక్నో తలరాత మారినట్లే.ఇక ఇది ఇలా ఉండగా.. లక్నో సూపర్ జెయింట్స్ ఇటీవల కొన్ని కొత్త నియమాకాలు చేపట్టింది. న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ వ్యూహాత్మక సలహాదారుగా బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్, స్పిన్ బౌలింగ్ కోచ్‌గా కార్ల్ క్రోవ్ లక్నో జట్టులోకి చేరారు. కాగా గత సీజన్‌లో పంత్ సారథ్యంలోని లక్నో జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరడంలో విఫలమైంది.




## అనుకున్నదొక్కటి, అయినదొక్కటి.. దేవుడికి వేరే ప్లాన్స్ ఉన్నాయంటూ శిరీష్ పోస్ట్


టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌లో ఒకరైన అల్లు శిరీష్ కొత్త అడుగు వేయబోతున్నారు. ఆయన తన ప్రియురాలు నైనికాతో నిశ్చితార్థం చేసుకోబోతున్నట్టు ఇటీవల ప్రకటించడంతో మెగా అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. అయితే, ఈ వేడుకకు వాతావరణం ఆటంకం కలిగించింది. దీంతో అల్లు శిరీష్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ షేర్ చేస్తూ .."చలికాలంలో అవుట్‌డోర్ నిశ్చితార్థం ప్లాన్ చేశాను కానీ వాతావరణం, దేవుడికి వేరే ప్లాన్స్ ఉన్నాయ్" అని రాశారు. వర్షంలో డెకరేషన్ వర్క్స్ జరుగుతున్న ఫోటోను షేర్ చేయడంతో ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అక్టోబర్ 31న హైదరాబాద్‌లోని తమ సొంతింట్లోనే నిశ్చితార్థం ప్లాన్ చేశారు.. మొదట అవుట్‌డోర్‌లో, గ్రాండ్‌గా డెకరేషన్ చేసి, వెన్నెల వెలుతురులో స్టేజ్ ఏర్పాటు చేయాలని ప్లాన్ చేశారు. కానీ తుఫాన్ ప్రభావంతో నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ ఏర్పాట్లు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వాతావరణం మెరుగుపడితే ఔట్‌డోర్‌లోనే వేడుక నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, వర్షం కొనసాగితే సింపుల్‌గా ఇంట్లోనే కుటుంబ సభ్యుల మధ్య నిశ్చితార్థం జరగనుందని సమాచారం. ఈ వేడుకకు కేవలం అల్లు అర్జున్, స్నేహా రెడ్డి కుటుంబం, అలాగే నైనికా కుటుంబ సభ్యులు మాత్రమే హాజరుకానున్నారు. అల్లు శిరీష్ ఇటీవల నైనికా పేరును ప్రకటించినా, ఆమె ఫేస్‌ను రివీల్ చేయలేదు. అయితే దీపావళి సందర్భంగా జరిగిన కుటుంబ వేడుక ఫోటోల్లో అల్లు అర్జున్ భార్య స్నేహా అనుకోకుండా నైనికా ఫేస్ రివీల్ చేయడంతో సోషల్ మీడియాలో ఆమె ఫోటోలు వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకొని స్నేహా రెడ్డి ఆ తర్వాత ఫొటో డిలీట్ చేసినప్పటికీ అప్పటికే కొందరు స్క్రీన్ షాట్ తీసి నెట్టింట వైరల్ చేశారు. జంట మూడముచ్చటగా ఉందని చాలా మంది కామెంట్స్ చేశారు.

## నన్ను చూసి నేనే గర్వపడుతున్నా..



ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి అతి తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. ప్రజెంట్ ఈ బ్యూటీ లేడీ ఓరియెంటెండ్ చిత్రాలతో పాటు పలు క్రేజీయెస్ట్ ప్రాజెక్టులు ఒప్పుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా వచ్చిన 'బైసన్' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇందులో అనుపమ పాత్ర తక్కువగానే ఉన్నప్పటికీ సినిమా హిట్‌లో కీలకంగా మారింది. దీంతో అనుపమపై ప్రశంసలు కురిపిస్తున్నారు ప్రేక్షకులు. ఇందులో భాగంగానే తాజాగా సినిమా సక్సెస్ ఈవెంట్‌లో పాల్గొని కెరీర్ స్టార్టింగ్‌లో ఎదుర్కొన్న విమర్శల గురించి చెప్పుకొచ్చింది. 'నా సినిమా కెరీర్ స్టార్టింగ్‌లో ఎన్నో ట్రోల్స్ ఎదురుకొన్నాను. ముఖ్యంగా నా మొదటి చిత్రం 'ప్రేమమ్' తర్వాత నాపై వచ్చిన నెగిటివిటీకి చాలా భయపడ్డాను.

## పా.రంజిత్ కొత్త ప్రయత్నం.. కీలక పాత్రలో అక్కినేని కోడలు



కోలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ పా. రంజిత్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సామాజిక అంశాలు, దళితుల పోరాటాలు, అణగారిన వర్గాల అన్యాయాలను బలమైన కథలుగా మలచడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అంబేద్కర్ భావజాలాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజల్లో చైతన్యం రగిలించే చిత్రాలను తెరకెక్కిస్తూ వస్తున్న ఈ దర్శకుడు, ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌తో మళ్లీ వార్తల్లో నిలిచారు. తాజా సమాచారం ప్రకారం, పా. రంజిత్ దర్శకత్వంలో అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ నటించబోతున్నారట. గతేడాది విక్రమ్‌తో 'తంగలాన్' అనే సినిమా తెరకెక్కించిన రంజిత్, ఇప్పుడు కాస్త గ్యాప్ తీసుకుని తన తదుపరి సినిమాపై ఫోకస్ చేస్తున్నారు. ఇంకా అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతుందని టాక్ వినిపిస్తోంది. సినిమాకు తాత్కాలికంగా 'వెట్టువం' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు సమాచారం. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సమ్మర్ రిలీజ్ లక్ష్యంగా షూటింగ్ చేస్తున్నారు. ఇటీవలే సినిమా యూనిట్, ప్రధాన తారాగణంతో కలిసి ఓ భారీ వరద సీక్వెన్స్ చిత్రీకరించినట్లు తమిళ వర్గాలు వెల్లడించాయి. ఇందులో 'అట్టకత్తి' ఫేమ్ దినేష్ హీరోగా నటిస్తుండగా, ఆయనకు జోడీగా శోభిత ధూళిపాళ కనిపించనుందని సమాచారం. నాగ చైతన్యను గత సంవత్సరం డిసెంబర్‌లో వివాహం చేసుకున్న తర్వాత శోభిత ఇప్పటివరకు కొత్త ప్రాజెక్ట్ ఏదీ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఆమె అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఓ వెబ్ సిరీస్ చేస్తోందని, అలాగే ఒక సినిమా షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నారని తెలిసింది. మరోవైపు, ఈ సినిమాలో ఆర్య నెగటివ్ రోల్ చేస్తున్నారని తమిళ మీడియా రిపోర్ట్స్ చెబుతున్నాయి. పా. రంజిత్ దర్శకత్వంలో ఆర్య ఇంతకుముందు నటించిన 'సార్పట్టా పరంబరై' ఓటీటీలో ఘనవిజయం సాధించింది. దానికి సీక్వెల్‌గా 'సార్పట్టా 2' చేయాలని భావిస్తున్నా, అంతకంటే ముందుగా రంజిత్ కొత్త ప్రాజెక్ట్ 'వెట్టువం' లో ఆర్యకు విలన్ రోల్ ఇచ్చారని టాక్. పా. రంజిత్–శోభిత ధూళిపాళ–ఆర్య కాంబినేషన్‌లో వస్తోన్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అయితే ఇందులో నిజమెంత అనేది తెలుసుకోవాలంటే, అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

## మాస్ నిర్ణయానికి థాంక్స్ చెప్పాలి



ఈ మధ్య బడ్జెట్ తో సంబంధం లేకుండా అవకాశం ఉంటే చాలు టికెట్ రేట్లు పెంచుకోవడాన్ని నిర్మాతలు బాగా వాడుకుంటున్నారు. అయితే దీనివల్ల లాభం కన్నా నష్టాలు పొందిన వాళ్లే ఎక్కువ. ధరలు అధికంగా ఉన్న కారణంగా యావరేజ్ లు ఫ్లాప్ కావడం, ఫ్లాపులకు డిజాస్టర్ ముద్ర పడటం పరిపాటిగా మారింది. మిరాయ్ కు ఎలాంటి పెంపు లేకుండా రెగ్యులర్ ప్రైసింగ్ పెట్టినా సరే నూటా యాభై కోట్ల గ్రాస్ దాటేసి వావ్ అనిపించింది. కేవలం రేట్ల కారణంగా హిట్ 3 ది థర్డ్ కేస్, తండేల్ లాంటివి తమ పూర్తి పొటెన్షియాలిటీని వాడుకోలేకపోయాయి. ఇక మాస్ జాతరకు కూడా ఇలాగే చేస్తారేమో అనుకున్నారందరూ. కానీ సితార ఎంటర్ టైన్మెంట్స్ పెంపుకు వెళ్ళలేదు. హైదరాబాద్ లో ఎలాగూ అనుమతిలో ఉన్న గరిష్ట ధర సరిపోతుంది కాబట్టి ఇబ్బంది లేదు. మల్టీప్లెక్సులు 295 రూపాయల దాకా పెట్టుకోవచ్చు. ఎటొచ్చి ఏపీలో ఇది 177 రూపాయలే ఉండటం వల్ల ప్రతిసారి పెంపు కోరక తప్పడం లేదు. కానీ మాస్ జాతరకు అలాంటి రిస్కు చేయలేదు. విజయవాడ తదితర నగరాల్లో ఓపెన్ చేసిన ప్రీమియర్ షోల బుకింగ్స్ చూస్తే మాములు రేట్లే ఉన్నాయి. అంటే మల్టీప్లెక్స్ లో తెలంగాణలో కంటే వంద తక్కువ ధరలో సినిమా చూసే అవకాశం దక్కడమే కాదు సింగల్ స్క్రీన్‌లో 105 రూపాయల బాల్కనీతో ఎక్కువ శాతం చూసే ఛాన్స్ దక్కింది. నిజానికి మాస్ జాతరకు బడ్జెట్ తక్కువేం కాలేదు. యాక్షన్ బ్యాక్ డ్రాప్ కాబట్టి గట్టిగా ఖర్చు పెట్టారు. యాక్షన్ ఎపిసోడ్లు, క్యాస్టింగ్ కోసం పెద్ద ఎత్తున వ్యయం చేశారు. పైగా క్యాస్టింగ్ కోసం కూడా జేబు తడిసె రేంజ్ లో పారితోషికాలు ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ చూసుకుంటే పెంపు ఈజీగా అడిగి ఉండొచ్చు. కానీ నిర్మాత నాగవంశీ అటువైపు మొగ్గు చూపించలేదు. డిస్ట్రిబ్యూషన్ చేసిన డబ్బింగ్ మూవీ వార్ 2కి తీసుకున్న హైక్స్ ని మాస్ జాతరకు వద్దనుకున్నారు. అంటే ఎక్కువ శాతం ఆడియన్స్ కి రీచ్ అవ్వాలనే ఉద్దేశంతోనే. ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు రవితేజ ఫ్యాన్స్ థాంక్స్ చెప్పడం ఎంతైనా సబబే.



## యష్ 'టాక్సిక్' వచ్చేది అప్పుడే.. రూమర్స్‌పై చిత్రబృందం క్లారిటీ.!

యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19 2026లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియార అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com